57400
కథా నిలయం
శ్రీకాకుళం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

# స్నేహ

మార్చి 14, 2010

Entered

# మారని కథ తీరని కల

# హ్యాపీబర్త్‌డే

(2010 మార్చి 7నుంచి
2010 మార్చి 20 వరకు)

**అభినయ**
1సం॥, మార్చి-8
నిర్మల-రవి
చింతల్-రంగారెడ్డి

**జె. సృజన(చిన్నారి)**
3సం॥, మార్చి-10
సరిత-వెంకటేష్(జె.వి)
ఆర్టీసి క్రాస్‌రోడ్డు-హైదరాబాద్



**ఎస్. సందీప్ రాజు**
8సం॥, మార్చి-14
రమాదేవి-శ్రీనివాసరాజు
మండాది-గుంటూరు

**జి. వెన్నెల**
3సం॥, మార్చి-20
శ్రీలక్ష్మి-లెనిన్
నర్సరావుపేట-గుంటూరు

**సిహెచ్. ప్రియదర్శిని**
మార్చి
రజని-రాజు
మచిలీపట్నం-కృష్ణా

**వి. దిలీప్‌కుమార్**
మార్చి-8
జానకి-రవీందర్
గణేష్‌నగర్-ఉప్పల్

**వి. సుకన్య**
10సం॥,మార్చి-20
కవిత-బోసుబాబు
కొప్పెరపాడు-ప్రకాశం

**ఆదర్శ్**
3సం॥, మార్చి-15
శృతిపముజుల-భక్తవత్సలం
న్యూయార్కు-అమెరికా

**రాంచరణ్**
1సం॥, మార్చి-17
స్వాతి-ఆంజనేయులు
మల్లారెడ్డిపేట-మెదక్

**కె.సాత్విక్**
3సం॥, మార్చి-2007
ప్రసన్నకుమారి-వెంకటేష్(శ్రీను)
గుత్తివారిపల్లి-చిత్తూరు



**శివచరణ్**
2సం॥, మార్చి-2008
మంజుల-కృష్ణ
ధర్మన్నగూడ-రంగారెడ్డి

**పి. ప్రతీక**
7సం॥, మార్చి-20
లావణ్య-శేఖర్‌బాబు
మియాపూర్-హైదరాబాద్

**కె. యశ్వంత్**
1సం॥,మార్చి-13
మమత-గోపాలరావు
భద్రాచలం-ఖమ్మం

**పి. అర్చన**
3సం॥,మార్చి-18
వీరమణి-వెంకటేష్
ఆత్మకూర్-నల్లగొండ

ENTERED

మనలో మాట

# ఉగాది ఊసులు

మన కాలాన్ని మనమే మర్చిపోతున్నాం. అదేనండీ మరో రెండు రోజుల్లో తెలుగు కొత్త సంవత్సరంలోకి అడుగెట్టబోతున్నాంకదా. మర్చిపోయారా! అదే జనవరి ఫస్టయితే ఎవరూ గుర్తు చేయక్కర్లా. అర్ధరాత్రి ఎస్సెమ్మెస్సులు, గ్రీటింగులు, కేకులు, లేట్‌నైట్ పార్టీలు... చెప్పేదేముంది! మ...హా... బిజీ!! ఉగాది మాత్రం ఊసులో కూడా లేదు. ఏదేమైనా మన కాలాన్ని మనం గుర్తుంచుకుంటే బావుంటుందికదా అనే ఈ ఘోష. ఉపోద్ఘాతం...అన్నీను.

మనకి ఊసులో వున్నా లేకపోయినా ప్రకృతి వాకిట్లో మాత్రం ఉగాది కళ వచ్చేసింది. మరుమల్లెలు ఘుమ్మంటున్నాయి. శిశిరంలో ఆకురాల్చిన చెట్లు కొత్త చివుళ్లు తొడుక్కుని పచ్చగా మెరిసిపోతున్నాయి. కవులు కండువాలు సర్దేసుకుంటూ హడావిడిపడిపోతున్నారు. వేపపూల ఘుమఘుమలు, మత్తకోకిల కుహుకుహురావాల సంగతి మాత్రం అడక్కండి. పట్నాల్లో ...కాంక్రీటు భవనాల మధ్యన కోకిల ఉనికి లేదని నిందించడంలో తన తప్పేం లేదు. ఇక పండితుల వారి సంగతి సరేసరి. పంచాంగ శ్రవణం చేయడానికి ఎప్పుడూ సిద్ధమేకదా. అయినా ఆరోజు భవిష్యవాణిని వినాలని ఉవ్విళ్లూరనిదెవరు చెప్పండి? సామాన్యుణ్ణి మొదలుకొని రాజకీయ నాయకుడి వరకు అందరూ సిద్ధం సుమతీ అంటారు. కొత్త సంవత్సరంలో రుతువులెలా వుంటాయి? వానలెలా కురుస్తాయి? ఏ పంట వేస్తే లాభసాటిగా వుంటుంది? వంటి విషయాలను పంతులిగారి నోటెంట వినాలని రైతన్న ఎదురుచూస్తాడు. నిత్యావసరాల ధరలు ఈ ఏడాదైనా అందుబాటులోకి వస్తాయో రావోనన్న కలవరం సామాన్యుడి కళ్లలో కనిపిస్తుంది. ఇక రాజకీయ నాయకుల సంగతి సరేసరి. వీరి పుణ్యమా అని పంచాంగ శ్రవణం ఒక ప్రహసనంలా మారిపోయింది. ఏ పార్టీ దగ్గర ఆ పార్టీ పంచాంగం చెప్పకపోతే పప్పులుడకవు. అవే గ్రహాలు, అవే రాశులు. ఫలితాలు మాత్రం ఆ పంచాంగశ్రవణం ఏపార్టీ ఆధ్వర్యంలో జరుగుతోందనే పాయింటు మీదే ఆధారపడి వుంటుంది. ఎవరి పంచాంగం వారిది. అందులో చెప్పేది జరిగినా జరగకపోయినా భవిష్యత్తు గురించి తెలుసుకోవాలనుకోవడం అదో తృప్తి.

నిజానికి ఉగాది అంటే ..పచ్చడి పండుగ. కార్టూనిస్టుల పండుగ. కవుల పండుగ. వసంతుని పండుగ. కార్టూనిస్టులు షడ్రుచుల పచ్చడితోపాటు కార్టూన్లను రుబ్బి పాఠకులకు అందిస్తారు. హాస్యంతో పాటు, చురుక్కుమనిపించేలా సమస్యలనూ ప్రస్తావిస్తారు. ఇక కవులు...ప్రకృతి మీద, కోకిలలమీద అలవోకగా కవిత్వం చెప్పేస్తారు. మన్మధబాణాల సంగతేమో కానీ... ఈ ఉగాది మహిళాబిల్లుతో వచ్చేసింది. వివక్షల బాణాలకు విరుగుడు ఈ బిల్లు.

పండితులేం జ్యోతిష్యం చెప్పినా... కవులేం పాటలు కట్టినా... ఏలికలెన్ని కథలు చెప్పినా... పాలితులు కదలిక పెంచితేనే ఉగాది ఉషస్సులు కొద్దిగానైనా దక్కుతాయి. ★

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| రుచి | ... | 3 |
| కవిత్వమ్ | ... | 6 |
| రోశయ్యగారు ఊరికే ఆలస్యం చేయరు... | | 7 |
| సీరియల్ | ... | 8 |
| కార్టూన్లు | ... | 10 |
| క్రైమ్ కథ | ... | 12 |
| నవ్వుల్ పువ్వుల్ | ... | 17 |
| అట్టమీది కథ | ... | 18 |
| వికాసం | ... | 21 |
| బాలనేస్తాలు | ... | 22 |
| కథ | ... | 24 |
| చూద్దామా | ... | 26 |
| కొత్త పుస్తకాలు | ... | 28 |


## ఇంకా...

స్ఫూర్తి ... 4

విప్లవకారుల విలువైన నేస్తం

సినిమా కబుర్లు ... 11

అమెరికా రేఖల్లోనే ఆస్కార్ పురస్కారాలు

కథ ... 22

మంత్రగత్తె



## ఆసాంతం ఆసక్తిగా..

నిజమైన మానవత్వంతో పొరుగువారికి సాయపడడంలోనే అసలైన విజ్ఞానం, అభివృద్ధి వున్నాయని, అలాంటి మహనీయ లక్షణాలు పుణికిపుచ్చుకున్నవే మన ఆచార సంప్రదాయాలని అందంగా వివరించిన కథ 'అమృత బిందువులు' ఆసాంతం ఆసక్తిగా సాగింది. ఈ కథా రచయిత్రికి అభినందనలు. అలనాటి హాస్యవీరుడు పద్మనాభం నటప్రస్థానం గురించిన వ్యాసం ద్వారా పద్మనాభంను మరింత దగ్గరగా తెలుసుకోగలిగాం. 'మాయాలోకం'తో మొదలైన ఆయన నట ప్రస్థానం 'టాటా బిర్లా మధ్యలో లైలా' చిత్రంతో ముగించిన ఈ హాస్యరసస్రష్ట కేవలం నటనకే పరిమితం కాకుండా చిత్ర నిర్మాణం కూడా చేసిన కళా పోషకుడుగా తెలుసుకున్నాం. విభిన్న పాత్రల సమాహారపు బసవరాజు వెంకట పద్మనాభరావు తెలుగుజాతికి సదా గుర్తుండి పోతారు.

**అమ్మిన శ్రీనివాసరాజు, చర్ల.**

## ఎప్పటికీ వుంటారు

హాస్యరసస్రష్ట పద్మనాభం గురించి మన సినిమా కబుర్లులో వివరించిన తీరు ఆకట్టుకుంది. తెలుగు తెరమీద ఓ హాస్య నటుడు, నిర్మాత, దర్శకత్వం వంటి బరువైన బాధ్యతలపై స్వారీ చేసిన ఘనత పద్మనాభంగారిదనే చెప్పవచ్చు. సొంత బేనర్‌లో నిర్మించిన కొన్ని చిత్రాలు విజయం సాధించకపోయినా చక్కటి సందేశంతో నాటి ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచాయని చెప్పొచ్చు. రొటీన్‌కు భిన్నంగా ఆలోచించి ఆచరించే మనస్తత్వం కాబట్టి శ్రీరామ కథ తెరకెక్కింది. కళను అడ్డుపెట్టుకుని కాసులు వెనకేసుకున్న అనేక మంది నటులలో కళ కలకాలం కళకళలాడాలని ఆశించిన పద్మనాభం హాస్యప్రియులున్నంతకాలం జీవించే వుంటారు.

**యర్రమోతు ధర్మరాజు,**
**ధవళేశ్వరం.**

## కొత్త విశేషాలు

ఫిబ్రవరి నెల చివరి సంచిక స్నేహ 'అట్టమీది కథ'గా హాకీ పండుగ విశేషాలన్నీ అందించిన షాహిన్ సుల్తానా గారికి ధన్యవాదాలు. నిమ్మ 'పండు'గ విశేషాలు అబ్బురపరిచాయి. 'అమృత బిందువులు' కథ చాలా చక్కగా వుంది. 'సినిమా కబుర్లు' ద్వారా పద్మనాభం గారిని మా జ్ఞాపకాలలో మరోసారి కదలాడేలా చేశారు. 'బాలనేస్తాలు' పేజీలలో పెద్ద పీత విశేషాలు కొత్తగా వున్నాయి. ఈ ప్రపంచంలో మ్యాజిక్‌తో ఏ కళనూ సరిపోల్చి చూడలేం. దీనికి సంబంధించిన శీర్షిక చదివి చాలా ఆనందించాం. కడియపు లంక ప్రాంత విశేషాలను మాలను పేర్చినంత అందంగా చక్కగా అందించిన రాంబాబు గారికి మా అభినందనలు. 'కొత్త పుస్తకాలు' ద్వారా ఎప్పటికప్పుడు వెలువడుతున్న పుస్తక సమాచారాన్ని అందుకోగలుగుతున్నాం. నవ్వుల్ పువ్వుల్ మండువేసవిలో పండు వెన్నెలలా అలరింపజేశాయి. మనలోమాట గర్హనీయంగా వుంది. ఎవరొచ్చినా మద్యం ఏరులకు అడ్డుకట్ట వేసేదెవరూ లేరు. ఫిబ్రవరి 21 ఆదివారం స్నేహలో 'అట్టమీది కథ'గా చరిత అందించిన 'నయావంచనలు' నేటి సమాజం పోకడలకు దర్పణం పట్టింది. 'ఆరోగ్యం'లో చిన్నారుల చురుకుదనానికి అందించిన సూచనలన్నీ చాలా ప్రయోజనకరంగా వున్నాయి. 'చూద్దామా' ద్వారా అజంతా ఎల్లోరా గుహల గురించి సంపూర్ణంగా తెలుసుకోగలిగాం. 'బుల్లి పోస్టాఫీసు' దృగ్విషయం అబ్బురపరిచేదిలా వుంది. తెర ద్వారా మాకందిన 'సినిమా కబుర్లు' ఆలోచింపజేశాయి. ఖైదీ 'కథ', 'బాలనేస్తాలు'లో నేర్చుకుందాం, చిత్రవిచిత్రం అంశాలు మాకెంతో నచ్చాయి. చివరి పేజీలోని కృష్ణమూర్తిగారి కథ చందమామ కథలను మరిపించేదిగా ఆకర్షింపచేసింది. 'స్ఫూర్తి' ద్వారా అనేక గ్రంథాల మూలంగా ఎందరు ఎంతగా ప్రభావితం అయిందీ ప్రతివారం తెలుసుకునే అవకాశం కల్పించడం అభినందనీయం. 'కవిత్వమ్'లో నివేదించిన వెంకటేష్‌కు అయితారం ప్రేమలు, నారాయణ, లచ్చయ్య మమతలు మళ్లీ ప్రాప్తించాలని ఆశిస్తున్నాం. మనలోమాట భాషా వికాసం ఏమోగానీ ఆంగ్లభాష స్పర్శ లేకుండా మనకు రోజు గడవడం కష్టంగా ఉందా? లేక మనమే ఈ పరిస్థితిని కొని తెచ్చుకుంటున్నామా? చెప్పడం కష్టమే!

**నేమాన సుభాష్‌చంద్రబోస్,**
**ఇలిసిపురం, శ్రీకాకుళం.**

## చాలా తెలిశాయ్

గోదావరి పరులేకర్ జీవితం, గిరిజనులతో జీవితం పంచుకొని ఉద్యమాలు సాగించేవారికి ఆదర్శం. ప్రజా ఉద్యమాలలో గిరిజనుల కోసం ఉద్యమించడం అత్యంత కష్టం. గోదావరి పరులేకర్ గురించి స్ఫూర్తి ద్వారా తెలియజేసిన ప్రస్తుత ఐద్వా రాష్ట్రకార్యదర్శి కె.స్వరూపరాణి గారికి అభినందనలు. బిటి (బాసిల్లస్ తురంజానిసిస్) బ్యాక్టీరియా వల్ల వచ్చే ప్రమాదం గురించి చాలా విషయాలు 'బిపి పెంచుతున్న బిటి వంకాయ' గురించి 'విజ్ఞాన వీచిక' ద్వారా చాలా విషయాలు తెలియజేసినందుకు ధన్యవాదాలు.

**టి.శ్రీరామమూర్తి,**
**గాజువాక, విశాఖ.**

## చక్కని వ్యాసం

ఫిబ్రవరి 21 ఆదివారం అనుబంధంలో నయా వంచనలు అట్టమీది కథ చదివిన తర్వాత మన రాష్ట్రంలో విస్తరిస్తున్న నేర సామ్రాజ్యానికి అద్దం పట్టినట్టుగా అనిపించింది. కుటుంబ సభ్యులే తమ వారిని మోసం చేయడం, డబ్బుల కోసం కిడ్నాప్ చేయడం, హత్య చేయడం లాంటి సంఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి.




నిత్య పెళ్లికొడుకు తుషార్ ఎయిర్ ఇండియాలో ఉద్యోగిగా పనిచేస్తూ 14 పెళ్లిళ్లు చేసుకోవడం సిగ్గుచేటు. నిరంతరం అప్రమత్తంగా వుంటే మనం మోసపోం. చక్కని వ్యాసం అందించిన ప్రజాశక్తికి ధన్యవాదాలు.

**కామిడి సతీష్‌రెడ్డి,**
**పరకాల, వరంగల్.**

## ఒక్క మహిళలకే కాదు

ఆనాటి చరిత్రలో ఒక్కటైన 'వర్లీ ఆదివాసుల తిరుగుబాటు' పుస్తకం ఈ రోజున కె.స్వరూపరాణిగారు గుర్తుకు తేవడం కొత్త తరానికి అవసరమైంది. గోదావరి పరులేకర్ ఒక్క మహిళలకు మాత్రమే స్ఫూర్తినిచ్చేవారు కాదు. గోదావరి పరులేకర్ గారిది అందరికీ అన్ని పోరాటాలకి స్ఫూర్తినిచ్చే జీవితం. స్వరూపరాణిగారికి మాతృభాష, రాజకీయాలు తల్లినుండే సంక్రమించడం అరుదైన విషయం. వీరి నాయకత్వంలో ఐద్వా పటిష్టమౌతుంది. సాజన్ తక్కువ చదువుకున్నవాడు. పూర్ణ రచయిత్రి మాత్రమే కాకుండా ఎన్నో విషయాలు సభల్లో మాట్లాడగల మనిషి. అటువంటి మనిషి కూడా ఇంట్లోవారి మాటలకు తలవంచి అంతదూరం నుండి తనను చూడాలని వచ్చిన సాజన్‌ను అనుమానించింది. కానీ తర్వాత తనెంత పొరపాటు చేసిందో అతని మాటలతో తెలుసుకుంటుంది. మునీంద్ర సమాజానికి చక్కటి సందేశం ఇచ్చారు.

**ఇలిపిల్ల సూర్యనారాయణ,**
**భీమనవారిపేట, విజయవాడ.**

★









## ఛీజ్‌బాల్స్

**కావలసిన పదార్థాలు**

పన్నీర్ - 200 గ్రా, ఉప్పు - సరిపడా
మిరియాలపొడి - పావు స్పూన్, గుడ్డు - 1
బ్రెడ్ స్లయిసెస్ - 2,
నూనె - వేపటానికి సరిపడా

**సాస్ తయారీకి**

టమాటా పేస్ట్ - 1 కప్పు,
టమాటా తురుము - 1 కప్పు
ఉల్లి తురుము - అరకప్పు,
వెల్లుల్లి పేస్ట్ - అరస్పూన్
ఉప్పు - సరిపడా, పంచదార - 1 స్పూన్
కారం - 1 స్పూన్, తులసి ఆకులు - కొద్దిగా
కొత్తిమీర - కొద్దిగా, నూనె - 3 స్పూన్లు

**తయారు చేసే విధానం**

పన్నీర్, ఉప్పు, మిరియాల పొడి, ఎగ్, బ్రెడ్ వేసి కలిపి ఈ మిశ్రమాన్ని చిన్న వుండలుగా తయారు చేయాలి. వీటిని ఫ్రిజ్‌లో గంట సేపు వుంచాలి. బాండీలో నూనె పోసి కాగిన తర్వాత పన్నీర్ బాల్స్ వేసి ఎర్రగా వేయించాలి. వేరే చిన్న గిన్నెలో 3 స్పూన్ల నూనె వేసి కాగిన తర్వాత ఉల్లి తరుగు, వెల్లుల్లి పేస్ట్ వేసి వేపుకోవాలి. ఇది ఎర్రగా వేగిన తర్వాత టమాటా తరుగు వేసి కలుపుతూ నూనె చిందేవరకు వేపుకోవాలి. తర్వాత టమాట పేస్ట్, ఉప్పు, పంచదార, కారం, తులసి ఆకులు వేసి కలపాలి. ఇలా తయారు చేసుకున్న సాస్‌లో వేయించిన పన్నీర్ (ఛీజ్) బాల్స్‌ను వేసి కొంచెం పెద్ద ఫ్లేమ్‌మీద 2 లేదా 3 నిమిషాలు ఉడికించాలి. చివరిలో కొత్తిమీర చల్లుకుంటే చాలు. ఇష్టమైన వారు ఛీజ్ తురుమును కూడా చల్లుకోవచ్చు.

## సేమియా చికెన్ బిరియానీ

**కావలసిన పదార్థాలు**

చికెన్ - అరకిలో, సేమియా - పావుకిలో
కారం - 2 టేబుల్ స్పూన్లు,
గరం మసాలా పొడి - 2 స్పూన్లు
అల్లంవెల్లుల్లి పేస్ట్ - 2 స్పూన్లు,
ఉల్లిపాయలు - 2
టమాటాలు - 2, పచ్చిమిరపకాయలు - 3
కరివేపాకు - 2 రెమ్మలు, కొత్తిమీర - 1 కట్ట
జీడిపప్పు - కొంచెం, కిస్‌మిస్ - కొంచెం
సోయాసాస్ - 2 టేబుల్ స్పూన్లు,
నెయ్యి - వేయించటానికి సరిపడా
యాలకులు - 4, లవంగాలు - 8

**తయారుచేసే పద్ధతి**

చికెన్ ముక్కలను కడిగి పెట్టుకోవాలి. 4 టేబుల్ స్పూన్ల నేతిలో సేమ్యాను బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. అవి తీసి అందులోనే జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నేతిలో యాలకులు, లవంగాలు, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి కొద్దిగా వేపాలి. తర్వాత ఉల్లిపాయ ముక్కలను వేసి మెత్తబడేవరకు వేయించి అల్లం వెల్లుల్లి పేస్టును వేసి పచ్చివాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు చికెన్ ముక్కలను, టమాటా ముక్కలను వేసి కలపాలి. తర్వాత కారం, గరమ్ మసాలా పొడి, ఉప్పు వేసి వేయించాలి. అందులో 3 కప్పుల నీళ్లు పోసి చికెన్‌ముక్కలు మెత్తగా అయ్యేవరకు ఉడికించాలి. వేయించిన సేమియాను అందులో వేసి 1కప్పు వేడినీళ్లు పోసి సేమ్యా అడుగంటకుండా కలుపుతూ వుండాలి. నీరంతా ఇంకిపోయేముందు వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్, సోయాసాస్ వేసి కలదిప్పాలి. చివరిలో కొత్తిమీర చల్లితే సరి.

## నిమ్మ ఆకు కారంపొడి

**కావలసిన పదార్థాలు**

నిమ్మ ఆకులు - 1 కప్పు,
వెల్లుల్లిపాయలు - 3రెబ్బలు
ఎండు మిర్చి - 5, ధనియాలు - గుప్పెడు
కరివేపాకు - 2 రెమ్మలు, నిమ్మఉప్పు - కొద్దిగా
నూనె - 2 స్పూన్లు, ఉప్పు - సరిపడినంత,
జీలకర్ర - 1 స్పూన్

**తయారుచేసే పద్ధతి**

నిమ్మ ఆకులను శుభ్రంగా కడిగి ఆరబెట్టుకోవాలి. బాండీలో నూనెవేసి కాగాక కడిగిన నిమ్మ ఆకులు వేసి వేయించాలి. వీటిని తీసి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నూనెలో ఎండుమిర్చి, ధనియాలు వేసి వేపుకోవాలి. ఇలా వేయించిన వాటికి వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు, నిమ్మఉప్పు వేసి మెత్తగా మిక్సీ వేసుకోవాలి. అంతే నిమ్మఆకు కారంపొడి రెడీ.

## ములక్కాడ - బంగాళదుంప పులుసు

**కావలసిన పదార్థాలు**

ములక్కాడలు - 4, బంగాళదుంపలు - అరకిలో
ధనియాలు - 1 స్పూన్, అల్లం - చిన్నముక్క
ఉల్లిపాయలు - 4, వెల్లుల్లి - 4 రెబ్బలు
తాలింపు గింజలు - సరిపడినన్ని,
ఎండుమిర్చి - రెండు
చింతపండు - 100గ్రా, టమాటాలు - 4
కారం - తగినంత, ఉప్పు - తగినంత
పసుపు - కొద్దిగా, కొత్తిమీర - చిన్న కట్ట,
బెల్లం - చిన్న ముక్క

**తయారుచేసే పద్ధతి**

ములక్కాడలు, బంగాళదుంపలు, మిర్చి, ఉల్లిపాయలు కడిగి ముక్కలు చేసుకోవాలి. అల్లం - వెల్లుల్లి, టమాటాలను మిక్సీలో వేసి మెత్తని ముద్ద చేసుకోవాలి. కళాయిలో నూనె పోసి కాగాక తాలింపు గింజలు వేసి వేగనివ్వాలి. అల్లం వెల్లుల్లి ముద్దను వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. తర్వాత బంగాళదుంప, మునక్కాడ ముక్కలు వేసి 2 నిమిషాలు వేయించాలి. అవి వేగాక అందులో చింతపండు రసం పోసి ఉప్పు, కారం, పసుపు, కొద్దిగా బెల్లం వేసి బాగా మరిగించాలి. ముక్కలు ఉడికాక కొత్తిమీర చల్లుకుని దింపాలి. ★

స్ఫూర్తి

ఆర్.ఎస్. (రుద్రరాజు సత్యనారాయణ)
సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు.

# విప్లవకారుల విలువైన నేస్తం

**1947లో** పదవ తరగతి చదువుతున్నప్పుడే నా వయసు ఒక సంవత్సరం ఎక్కువ చెప్పి పార్టీ సభ్యత్వం పొందాను. ఇంటర్మీడియట్‌లో వుండగా నిర్బంధం ప్రారంభమైంది. నాటి విద్యార్థి నాయకులు దాసరి నాగభూషణరావుకు కొరియర్‌గా పని చేయడానికి గుంటూరు పంపారు. రెండు నెలలు రహస్యంగా అక్కడ ఉన్నా. అప్పటికి మా గ్రామం చించినాడలో నాతో సహా ఆరుగురు పార్టీ సభ్యులు ఉన్నారు. భూస్వాములు (కాంగ్రెస్ వారు) పట్టించడంతో ప్రభుత్వం నాలుగు నెలల్లో ఐదుగురిని కాల్చి చంపింది. భూస్వాములు నన్ను కూడా కాల్చాలని ప్రయత్నించారు. దాదాపు వంద నుంచి 150 మంది రిజర్వ్ ఫోర్స్‌తో కాపు కాశారు. నేను కూడా గుంటూరు నుండి మా ఊరికి వచ్చి దళితులలో 40 మందిని కూడదీసి పార్టీవైపు ఆకర్షించడానికి, మన పార్టీ పేదల కోసం పని చేస్తుందని చెప్పడానికి ప్రయత్నించాను. ఆ రకంగా మా గ్రామంలో పార్టీ పునాదులు బలంగా ఏర్పడ్డాయి. తర్వాత 1953లో జరిగిన మొట్టమొదటి ఎన్నికలు మొదలు 2009 ఎన్నికల వరకు మా గ్రామంలో సిపిఎం అభ్యర్థే సర్పంచిగా ఎన్నికవుతూ ఉన్నారు.

అంతకు ముందు మార్క్సిస్టు సాహిత్యం చదవడానికి అందుబాటులో ఉండేది కాదు. లీగాలిటీ వచ్చాక పుస్తకాలు చదవాలన్న పట్టుదల పెరిగింది. 'అమ్మ, కమ్యూనిస్టు ప్రణాళిక, మంచి కమ్యూనిస్టు ఎలా వుండాలి? చారిత్రక భౌతికవాదం, రాజకీయ అర్థశాస్త్రం ...' అధ్యయనం చేశాను. ఈ పుస్తకాలన్నిట్లో ఏ పుస్తకం ప్రాధాన్యత దానిదే. ఒక్కో పుస్తకం ఒక్కో రకమైన ప్రభావం చూపించింది. ముఖ్యంగా లీషావ్‌చీ 'మంచి కమ్యూనిస్టు ఎలా వుండాలి?' అన్న పుస్తకం గురించి చెప్పుకోవాలి. పాలకొల్లులో డివిజన్ లైబ్రరీలోంచి తీసుకొని చదివాను. అప్పుడే కమ్యూనిస్టు ఎలా వుండాలనేది మనసులో నాటుకుపోయింది. ప్రజలకు ఆదర్శంగా, నిజాయతీగా, నిరాడంబరంగా, అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడ్డంలో చివరిదాకా పనిచేయడంలో ఆ పుస్తకం తోడ్పడింది. సమిష్టి పని, నిర్ణయాలు తీసుకునేలా చూసేవాణ్ణి. బూర్జువా పార్టీకి సిపిఎంకు, బూర్జువాలకు సిపిఎం వారికి, ఆ నాయకులకు మన నాయకులకు తేడా ఏంటో స్పష్టంగా తెలిసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమశిక్షణతో పనిచేస్తున్నా. నేటి వరకు అలాగే వున్నాను. నా 60 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎప్పుడూ వాటిని తప్పలేదు. 1970 నుంచి సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నా. పార్టీలోగానీ, ప్రజాజీవితంలోగానీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడ్డంలో ఆ పుస్తకం ఇచ్చిన స్ఫూర్తి ఎంతగానో తోడ్పడింది. అప్పట్లో పార్టీకి పుస్తకాలు చదవడం, చదివించడం, రాజకీయ తరగతులు నిర్వహించడం, రాజకీయ చైతన్యం పెంచడమే ప్రధాన కార్యక్రమంగా ఉండేది.

❁❁❁

మాది భూస్వామ్య కుటుంబం. ప్రగతిశీల కుటుంబం. మాకు 50 ఎకరాలుండేది. నలుగురు అన్నదమ్ములం. పొలం పంచుకుని విడిపోయాం. భూస్వామ్య కుటుంబంలో పుట్టినందుకు ఆ భావజాలం సహజంగానే


అంతకు ముందు మార్క్సిస్టు సాహిత్యం చదవడానికి అందుబాటులో ఉండేది కాదు. లీగాలిటీ వచ్చాక పుస్తకాలు చదవాలన్న పట్టుదల పెరిగింది. 'అమ్మ, కమ్యూనిస్టు ప్రణాళిక, మంచి కమ్యూనిస్టు ఎలా వుండాలి? చారిత్రక భౌతికవాదం, రాజకీయ అర్థశాస్త్రం ...' అధ్యయనం చేశాను. ఈ పుస్తకాలన్నిట్లో ఏ పుస్తకం ప్రాధాన్యత దానిదే. ఒక్కో పుస్తకం ఒక్కో రకమైన ప్రభావం చూపించింది. ముఖ్యంగా లీషావ్‌చీ 'మంచి కమ్యూనిస్టు ఎలా వుండాలి?' అన్న పుస్తకం గురించి చెప్పుకోవాలి. పాలకొల్లులో డివిజన్ లైబ్రరీలోంచి తీసుకొని చదివాను. అప్పుడే కమ్యూనిస్టు ఎలా వుండాలనేది మనసులో నాటుకుపోయింది. ప్రజలకు ఆదర్శంగా, నిజాయతీగా, నిరాడంబరంగా, అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడ్డంలో చివరిదాకా పనిచేయడంలో ఆ పుస్తకం తోడ్పడింది. సమిష్టి పని, నిర్ణయాలు తీసుకునేలా చూసేవాణ్ణి. బూర్జువా పార్టీకి సిపిఎంకు, బూర్జువాలకు సిపిఎం వారికి, ఆ నాయకులకు మన నాయకులకు తేడా ఏంటో స్పష్టంగా తెలిసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమశిక్షణతో పనిచేస్తున్నా. నేటి వరకు అలాగే వున్నాను. నా 60 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎప్పుడూ వాటిని తప్పలేదు.

వస్తుంది. అయినప్పటికీ నేను పైన చెప్పిన లక్షణాలకే కట్టుబడి ఉండేందుకు ప్రయత్నించాను.

సభ్యత్వం తీసుకున్నప్పుడు ఇంట్లో ఎలాంటి వ్యతిరేకతా రాలేదు. పైగా మా అన్నదమ్ముల్లో ముగ్గురు పార్టీ సభ్యులే.

భీమవరం హాస్టల్లో రాజుల విద్యార్థులకోసం భవనం కట్టారు. దాంట్లో భూస్వాముల బిడ్డలుండేవారు. దానిలో పేదవారికి అవకాశం ఇవ్వాలని పోట్లాడాం. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేదల పక్కే వుండేవాణ్ణి. చదువు రానివాళ్లకు చదువు చెప్పడం, చదువు వచ్చినవారితో పుస్తకాలు చదివించడం నిత్యం చేసేవాళ్లం. 54లో మొదటి రాజకీయ పాఠశాలకు హాజరయ్యాను. రాజకీయ తరగతులతో పాటు కామ్రేడ్ మృత్యుంజయుడు కర్రసాము నేర్పారు. అప్పట్లో గ్రామంలో ఒక్క కమ్యూనిస్టు వున్నా ఆ గ్రామాన్ని ప్రభావితం చేసేవారు. 62లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయా. తిరిగి 67లో పోటీ చేసి గెలిచా. అప్పట్లో అసెంబ్లీలో పది మంది ఎమ్మెల్యేలుండేవారు. కామ్రేడ్ నాగిరెడ్డిగారు లీడర్. కామ్రేడ్ బిఎన్ ఉపనాయకుడు. నేను విప్. 1969లో కామ్రేడ్ నాగిరెడ్డి నక్సలైట్లతో వెళ్లిన తర్వాత కామ్రేడ్ బిఎన్ లీడర్. నేను డిప్యూటీ. 1970లో బిఎన్ పార్లమెంటుకు ఎన్నికైన తర్వాత నన్ను పార్టీ లీడర్‌గా ఎన్నుకున్నారు. ఆ సంవత్సరం జరిగిన రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కమిటీకి ఎంపికయ్యాను.

అయితే పార్లమెంటరీ పోరాటం ఒక్కటే సరిపోదు. ప్రజాపోరాటం కూడా వుండాల్సిందేనని అప్పట్లో నాకు అనుభవమైంది. నర్సాపూర్ నియోజకవర్గంలో నీళ్ల రాక పొలాలు ఎండిపోయాయి. అసెంబ్లీలో అడిగాం. నిలదీశాం. ఫలితం లేకపోయింది. ఇంక ప్రజలను సమీకరించి ఆందోళన చేయడమే శరణ్యమనుకున్నాం. అప్పుడు సమస్య పరిష్కారమైంది. పార్టీ రాష్ట్ర కమిటీ చేసిన నిర్ణయాలను తూచ తప్పకుండా అమలు చేసేవాడిని. అప్పట్లో ఇప్పటిలా ఇంతేసి జీతాలుండేవికావు. 500 రూపాయలుండేది. అది పార్టీకి ఇచ్చేవాణ్ణి. అసెంబ్లీలో కూడా క్రమశిక్షణే ముఖ్యం. అక్కడ కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మాకూ తేడా స్పష్టంగా ఉండేది.

1978-79లో మామీద భూస్వాములు 38 కేసులు పెట్టారు. నాకు లైఫ్ పడింది. సంవత్సరం తర్వాత కేసు కొట్టేశారు.

నేను ఆరుసార్లు అరెస్టయి జైలుకెళ్లాను. 65లో ఓసారి చైనా యుద్ధం సందర్భంగా అరెస్టు చేశారు. నాలుగు మాసాల పాటు ముషీరాబాద్ జైల్లో పెట్టారు. తర్వాత వైజాగ్ పంపారు. రైల్వే స్ట్రైక్ అప్పుడు అరెస్టు చేశారు. మూడోసారి మర్డర్ కేసులో అరెస్టయ్యాను. ఆరో దఫా అరెస్టయినప్పుడు లైఫ్ పడింది. అయితే సంవత్సరానికే ఆ కేసు కొట్టేశారు.

అయితే జిల్లాలో నాకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తుల గురించి కూడా చెప్పుకోవాలి. కామ్రేడ్ ఉద్దరాజు రామం, కామ్రేడ్ అల్లూరిగారు. పదమూడేళ్లు జిల్లా కార్యదర్శిగా వున్నాను. యువ కార్యకర్తలను తయారుచేసుకోవాలనే పార్టీ నిరంతర సూచనతో జిల్లాలో యువనాయకత్వాన్ని బాధ్యతలు స్వీకరించాలని ప్రోత్సహించాను.

పార్టీ బాధ్యతల నిర్వహణలో, ప్రజాప్రతినిధిగా బాధ్యతలను నిర్వహించడంలో సాహిత్య అధ్యయనం ఎంతగానో తోడ్పడింది. 'మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి'? పుస్తకం నా జీవితంపై చెరగని ముద్ర వేసింది. ప్రతి కమ్యూనిస్టూ పదేపదే అధ్యయనం చేయాల్సిన పుస్తకం ఇది. కమ్యూనిస్టు పార్టీ సభ్యులకు స్వయం సాధన అవసరమని ఈ పుస్తకం స్పష్టం చేస్తుంది. ప్రతి విప్లవకారుడు తనకు తాను మార్పు చెందాలంటే తన విప్లవ చైతన్యం స్థాయిని పెంపొందించుకునేందుకు విప్లవ పోరాటాలకు అతడు దూరంగా ఉండకూడదని, ఆచరణ ద్వారా పాఠాలు నేర్చుకోవడం దీని నుంచి తెలుసుకోవచ్చు. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు ప్రజల పట్ల ఎలా వ్యవహరించారో అర్థం చేసుకుని వాటిని మన కార్యాచరణకు వర్తింపజేసుకోవడం ఎందుకనేది అర్థమైంది. మనల్నిగాని, ప్రజలను గాని, పూర్వులనుగాని మోసం చేయకూడదు. ఇది కమ్యూనిస్టు సభ్యుల ప్రధాన, ఉత్తమ లక్షణాల్లో ఒకటిగా ఉండాలనేది ఈ పుస్తకం చెబుతుంది. మానవ జాతి చరిత్రలో కమ్యూనిస్టు ఆశయమే అత్యున్నతమైన, అత్యంత కఠినమైన ఆశయమని అర్థం చేసుకోవడం దీని ద్వారా సాధ్యమైంది. కమ్యూనిస్టు ఆదర్శాలతో ప్రాక్టికల్ పనిని వాస్తవిక ఘటనల నుంచి సత్యాన్వేషణ చేసే తత్వాన్ని జోడించగలవాడే కమ్యూనిస్టు పార్టీ మంచి సభ్యునిగా చెప్పుకోవాలి. పార్టీ సభ్యుని సొంత ప్రయోజనాలు పార్టీ ప్రయోజనాలకు నిర్నిబంధంగా లోబడి ఉండాలి. పార్టీ ప్రయోజనాల కోసం, విప్లవ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టు తన ప్రాణాల విషయంలోనూ, ఆరోగ్యం విషయంలోనూ శ్రద్ధ వహించగలుగుతాడు. అవమానాలు భరించాల్సి వచ్చినా, ఎక్కువ బరువులు మోయాల్సి వచ్చినా తనకిష్టంలేనిది చేయాల్సి వచ్చినా అతడు ఎట్టి సందేహం లేకుండా అత్యంత కష్టసాధ్యమైన పనిని, అత్యంత ప్రధానమైన పనిని తీసుకోవాలనేది దీని నుంచి నేర్చుకోవచ్చు.

'మన ఆలోచనల్లోనూ, మాటల్లోనూ, ప్రవర్తనలోనూ మనల్ని మనం

పార్టీ బాధ్యతల నిర్వహణలో, ప్రజాప్రతినిధిగా బాధ్యతలను నిర్వహించడంలో సాహిత్య అధ్యయనం ఎంతగానో తోడ్పడింది. 'మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి'? పుస్తకం నా జీవితంపై చెరగని ముద్ర వేసింది. ప్రతి కమ్యూనిస్టూ పదేపదే అధ్యయనం చేయాల్సిన పుస్తకం ఇది. కమ్యూనిస్టు పార్టీ సభ్యులకు స్వయం సాధన అవసరమని ఈ పుస్తకం స్పష్టం చేస్తుంది. ప్రతి విప్లవకారుడు తనకు తాను మార్పు చెందాలంటే తన విప్లవ చైతన్యం స్థాయిని పెంపొందించుకునేందుకు విప్లవ పోరాటాలకు అతడు దూరంగా ఉండకూడదని, ఆచరణ ద్వారా పాఠాలు నేర్చుకోవడం దీని నుంచి తెలుసుకోవచ్చు.

నియంత్రించుకోవాలి. ముఖ్యంగా విప్లవ పోరాటానికి హాని కలిగించే రాజకీయ ఆలోచనా విధానాలను, మాటలను, కార్యాలను కంట్రోల్ చేయాలి. ఇది కచ్చితమైన వైఖరిని అవలంబించడం ద్వారానే, సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం ద్వారానే సాధ్యం. వర్గ సమాజంలో మానవుని వర్గ స్వభావమే అతని ప్రధాన గుణం. అదే అతని మూల స్వభావం' వంటి విషయాలు కమ్యూనిస్టు ఉన్నతికే కాక మానవుని వ్యక్తిత్వ వికాసానికి, పరిపూర్ణ వ్యక్తిత్వానికి దోహదపడతాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇటువంటి మంచి పుస్తకాన్ని అధ్యయనం చేయకపోతే నిజ జీవితంలో మంచి మిత్రుడిని కోల్పోవడం కంటే ఎక్కువ నష్టమని నా అభిప్రాయం.

★

# ముందే కూసింది..

ఉగాదికి ముందే కోయిల కూసింది
ఉషస్సులను మగువలకు తెచ్చింది
లోకానికి కొత్త సొబగులు అద్దింది
సరికొత్త యుగారంభాన్నిచ్చింది

వసంతంలో మల్లె విరిసింది
చట్టసభల్లో స్థానమిస్తానంది
మగువ మనస్సు వికసించింది
అతివకు అధికారం చేరువైంది

చేయి చేయి కలపమంది
కల్మషాన్ని తొలగమంది
స్త్రీ వివక్షకు చోటులేదంది
పదవుల్లో మూడొంతులంది

స్త్రీశక్తికి చోటిచ్చి లోకానికి చాటమంది
ఎందరి కలలనో సాకారం చేసింది
భారతావనిలో సాధ్యమని రుజువు చేసింది
స్త్రీ భాగస్వామ్యంతోనే సమసమాజం సాధ్యమంది

విరోధినామానికి వీడ్కోలు పలికింది
వికృతినామానికి స్వాగతం చెప్పింది
నవయుగానికి ఆహ్వానం పలికింది
ఉగాదికి ఉషస్సులు అందరికంది

**- శాంతిశ్రీ**

---

# మొబైల్ మొక్కలం

అవును
మొబైల్ మొక్కలం
ఉన్నచోట నుండి కదలమనేగా
మా వృక్షజాతికి
స్థావర జంగమాలన్న పేరొచ్చింది
ఏమిటీ వైరుధ్యం అనుకుంటున్నారా?
అవును మొబైల్ మొక్కలం
కుండీల్లో మొక్కలం
మానవుల్లో ఖైదీల్లాంటి మొక్కలం
ఊరేగింపులకు తీసుకొచ్చిన
కిరాయి కార్యకర్తల్లా
నగరాల్లో
ట్రక్కుల్లో అటూ ఇటూ తిరుగుతూ
మీకు కనిపించే వుంటాం
ఎక్కడ ఏ సభ జరిగినా
ఏ పెళ్లి పేరంటం జరుగుతున్నా
ఈవెంట్ మేనేజర్ల ట్రక్కుల్లో
తెరలు, అట్ట సెట్టింగులతో పాటు
మేమూ తయారు...

పచ్చదనం
ప్రాణప్రదం
ప్రాణపథం
ప్రాణధనం...
కాని ఇవాళ
పచ్చదనం
పండుగనాడు గుమ్మానికి కట్టిన
ప్లాస్టిక్ మామిడి తోరణంలా
కేవలం అలంకారప్రాయం
వేదికల ముందు
మా ఉనికి
ఆ కాసేపు ఓ నిండుదనం
అప్పటి సంబరాల్లో
మేజువాణి ముదితల్లాంటి
మొబైల్ మొక్కలం
వేడుక ముగిసిందా
మొదలవుతుంది
మా పయనం
మరో చోటుకి
ఒక రకంగా
మేం చేసేది 'గ్రీన్‌రన్'
మౌనంగా వినిపించే
మా సందేశం పట్టించుకునేదెవ్వరు?
పచ్చదనం కేవలం అలంకారం కాదని
గ్రహించేదెవ్వరు?

**-ఎస్. హనుమంతరావు**

---

# మెతుకు చెప్పిన సత్యం

రైతంటూ వున్నాక
ఏదో ఒకటి పండించి తీరాలి.
భూమంటూ వున్నాక
ఏదో ఒక ఉపద్రవం వచ్చి తీరాలి.
ఎంతసేపూ మడక దున్నడాలూ
వానలు కురవక విత్తనాలు మొలవకపోవడాలూ
నెర్రెలిచ్చిన భూమిలో
ఎముకలెల్లిన జీవాలు
కట్టెలా పాతుకు పోవడాలు తప్ప
మెతుకు చెప్పిన సత్యమేమీ లేదా!!
నారుమడి చూసి ఎన్ని బస్తాలు పండుతాయో
ఇట్టే చెప్పే
రైతు కళ్లనెప్పుడూ వడ్లగింజ కనిపెడుతూనే వుంటుంది.
నాటేస్తున్న చేతులని
కాలం కాటేస్తుంటే
మెతుకు ఓదారుస్తోంది.
అంతో ఇంతో ముద్ద పెడతానని
గంజ పాలు పోసుకునే దశలో
తాలు రాకుండా వరి మొలకల్ని
మొలలోతు నీళ్లల్లో నిలబెడతానని
భూమిని సముదాయిస్తున్నది మెతుకు
ఉత్తుత్తి గర్జనలని
ఉరిమే మెరిసే మెరుపులని
రైతుకు చూపిస్తూ
వాటిని పొలం మళ్లుగా దున్నమన్నది మెతుకు
రెప్పల్లో తడి ఆరిపోయిన
బ్రతుకులో ఆశలు తీసుకుని
అర్తిగా చెప్తూనే ఉందెప్పుడూ
"ఖానే కా వక్త్ దోస్త్ ఆతో
సోనే కా వక్త్ దుష్మన్ ఆతా"
మెతుకు పెడుతూనే వుంటా
కాలం నిన్నెంత తరుముతున్నా



శత్రుత్వంతో అని.

**- తమ్మెర రాధిక**

# రోశయ్యగారు ఊరికే ఆలస్యం చేయరు....




**ఆలస్యం, కాలం గడపటం, పొద్దుపుచ్చటం ఈ పదాలు మన భాషలోకి చేరటానికి ఎంత కాలం గడిచిందో తెలియదు. అవి రాకముందు మన పూర్వులు పొద్దుపుచ్చటాన్ని ఏమని పిలిచారో కదా? ఏమైనా మనం కష్టపడకుండా మన భాషను పరిపుష్టం చేసినందుకు సదా కృతజ్ఞులమై ఉండాలి. సోంబేరి, సోమరిపోతు, ఒక పట్టాన కదలడు అనే ఈ పదాలు ప్రైవేటికంటే ముందు వచ్చాయా? వాటితో పాటే వచ్చాయా? పరిశోధకులు తేల్చాల్సిందే.**

ఆలస్యం అనే పదాన్ని భాషాపరంగా మనం వినియోగించవచ్చుగాని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆచరించకూడదు. మన పెద్దలు ఆలస్యం అయితే అమృతం కూడా విషంగా మారుతుందని ఊరికే చెప్పలేదు. ఆలస్యాన్ని భరించలేము కూడా. స్కూలుకెళ్లిన పిల్లలు ఆటలాడుకుంటూ ఆటో అంకుల్ (పెద్ద పట్టణాల్లో) ఎంత ఆలస్యంగా వస్తే అంత మంచిదనుకుంటారు. నిజంగా ఆలస్యమైతే మనకు ఇంటిదగ్గర ఆతృత మొదలు. అత్తగారు సణుగుడు ప్రారంభిస్తారు, మామగారు ఇంట్లోకి బయటికీ తిరుగుతారు. ఈ ముసలాళ్లకు చాదస్తం గాకపోతే పదినిమిషాలు ఆలస్యం అయితే కొంపలేమన్నా మునుగుతాయా అని తల్లులు అనుకుంటారు. ఆలస్యం అయినందుకు రైల్వే స్టేషన్లలో క్షమించాలని మైకుల్లో చెబుతారు. బస్టాండుల్లో అలాంటి కనీస మర్యాద ఉండదు. ఏమో పైనుంచి వచ్చే బస్సు.... వచ్చినపుడు ఎక్కటమే అని మొరటు సమాధానం వస్తుంది. ఇలా ఆలస్యం గురించి చెప్పుకోవాల్సి వస్తే నిత్యజీవితంలో చాలా ఉన్నాయి. మహిళలను ఆకాశంలో సగం అంటూ ఆకాశానికి ఎత్తేశారు గాని చట్ట సభల్లో మూడోవంతు సీట్లను రిజర్వు చేసేందుకు 14 సంవత్సరాల పాటు బిల్లును కాలయాపన చేశారు. రాజ్యసభ ఆమోదం పొందింది. మరి లోక్‌సభలో మోక్షం ఎప్పుడో ?

రాజకీయ నాయకులు తమ పనుల విషయానికి వస్తే ఆఘమేఘాల మీద చేసుకుంటారు. అదే జనం విషయానికి వస్తే....బోగస్ కార్డుల ఏరివేత రెండునెలల్లో పూర్తి చేస్తామని చెప్పి ఇప్పటికి ఆరునెలలు. ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియదు. ఇళ్లకు, వ్యవసాయానికి వేర్వేరు లైన్ల ద్వారా విద్యుత్ ఇస్తామని చెప్పి దాదాపు పది సంవత్సరాలు అవుతోంది. అన్నం ఉడికిందో లేదో చూడాలంటే ఒక్క మెతుకును చూస్తే చాలు. రోశయ్య సర్కార్ తన బడ్జెట్ లక్షా పదమూడువేల ఆరు వందల అరవై కోట్ల నలభై ఒక్క లక్షల రూపాయలని చెప్పుకోవచ్చు. కానీ ఎంత కక్కుర్తికి పాల్పడుతున్నారంటే ఉద్యోగులకు ఫిబ్రవరి నెల నుంచి నూతన వేతనాలు వర్తింప చేసి ఒక నెల బకాయిని పిఎఫ్ ఖాతాలో వేసుకుంటామని చెప్పారు. మార్చినెల వేతనంతో కొత్త వేతనాలు అందుకోవచ్చన్నారు. అయితే అందుకు అవసరమైన ఉత్తరువులను జారీ చేయకుండా ఎలా కాలంగడపాలా అని చూస్తున్నారు. ఈ వరస చూస్తుంటే కొత్త ఆర్థిక సంవత్సరం నిధులకోసం కనీసం మూడునెలల పాటు ఆలస్యం చేసేందుకు పూనుకున్నారు. అవినీతి నిరోధకశాఖ అనేక మందిపై నివేదికలు తయారు చేసి ఏళ్లు గడుస్తున్నా అవినీతి పరులు రిటైరయ్యే వరకు వాటి బూజు దులపరు. ఆలస్యం చేయటానికి ఎలాంటి నక్కజిత్తులు ప్రయోగిస్తారో చూడంటూ మన కేంద్ర విజిలెన్స్ కమిషనర్ విసిగిపోయి కొన్ని వివరాలను గతనెలలో వెబ్‌సైట్‌లో పెట్టి బహిరంగ పరిచారు. దానిప్రకారం అనేక మంది సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులపై శాఖాపరమైన విచారణ విచారణాధికారిని నియమించమనో లేక నియమించిన అధికారికి అవసరమైన పత్రాలను ఇవ్వమనో కోరితే మూడు సంవత్సరాలకు పైగా కేంద్ర ఆర్థిక, పట్టణాభివృద్ధి, వినియోగదారుల వ్యవహారాల శాఖల అధికారులు తాత్సారం చేస్తున్నారని వాపోయారు.

ఆలస్యం చేయటంలో అమెరికన్లేమీ తక్కువ తినలేదు. అనేక మంది పెద్దలు అబ్బే అమెరికాలోనా అయితే అవుతుంది కాదంటే కాదు మనలాగా సంవత్సరాల తరబడి నాన బెట్టరు అని కోతలు కోస్తుంటారు. అది కొన్ని అంశాల్లో నిజమే. సద్దాం హుస్సేన్ మారణాయుధాలు పోగేస్తున్నాడంటూ ఆఘమేఘాల మీద యుద్ధానికి దాడులు చేయటానికి అమెరికా ఎలాంటి ఆలస్యం చేయలేదు. 2003 నుంచి అక్కడ నరమేథం సాగించారు. చివరికి ఎలాంటి మారణాయుధాలూ దొరకలేదని స్వయంగా బుష్ మహాశయుడే చెప్పారు. కానీ ఇంతవరకు అమెరికా, ఇతర దేశాల సైన్యాన్ని అక్కడి నుంచి తొలగించలేదు. ఎప్పుడు తొలగిస్తారో కూడా చెప్పటం లేదు. కుర్దులను ఊచకోత కోయటంలో కెమికల్ ఆలీ అనే నాయకుడు బాధ్యుడంటూ ఇటీవల ఉరిశిక్ష విధించారు. నిజానికి అందులో వాస్తవమెంతో తెలియదు. సద్దాంహుస్సేన్ నమ్మినబంట్లలో కెమికల్ ఆలీ ఒకడు. అందుకే అతన్ని హతమార్చారు. మారణాయుధాల పేరుతో అమెరికన్లు సాగిస్తున్న మారణహోమంలో ఇప్పటివరకు ఉట్టి పుణ్యానికి ఈ ఏడాది జనవరి వరకు లక్షా మూడువేల మంది అమాయకులను అమెరికన్లు, వారి స్నేహితులు హత్య చేశారని ఒక అంచనా. తొలి మూడు సంవత్సరాల్లోనే లక్షా 51వేల మందిని చంపారని మరొక నివేదిక పేర్కొన్నది. రోగాలు రొష్టులతో మరణించిన వారు మరికొన్ని లక్షల మంది. 18 లక్షల మంది ఇరాక్ వదలి పారిపోయారు, మరో 16లక్షల మంది ఇరాక్‌లోనే కొంపాగోడు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఇన్ని ఘోరాలు చేసినందుకు ఒక్కడంటే ఒక్క అమెరికన్నూ ఉరితీయలేదు. పాలస్తీనా దేశంలో యూదుల ప్రాంతాలను విడదీసి ఇజ్రాయల్ ఏర్పాటు చేయాలని 1948లో ఐరాస తీర్మానించింది. ఆ మేరకు ఏర్పడిన ఇజ్రాయల్ మొత్తం పాలస్తీనాను ఆక్రమించింది. అప్పటినుండి ఇప్పటి వరకు పాలస్తీనా స్వతంత్ర దేశ పునరుద్ధరణ జరగకుండా అమెరికన్లు కాలయాపన చేస్తున్నారు.

దివాళా తీసిన పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, జనరల్ మోటార్స్ వంటి కంపెనీల ఉన్నతాధికారులకు బోనస్‌లు చెల్లించేందుకు ఆఘమేఘాల మీద ఉద్దీపన పథకాలు ప్రకటించి వేలకోట్ల డాలర్లను చెల్లించాడు ఒబామా. పార్లమెంటరీ నిబంధనలను ఉపయోగించుకొని ప్రతిపక్ష ఎంపీ జిమ్ బన్నింగ్ నిరుద్యోగులను ఆదుకోవటం ఎలా అన్న చర్చలో తన అభ్యంతరాలను చెప్పేందుకు వారాల తరబడి అధ్యయనం చేస్తున్నానని చెబుతూ గరిష్ట వ్యవధి తీసుకున్నాడు. చివరకు మరో 30రోజుల పొడిగింపు అవకాశాన్ని కూడా కోరాడు. ఫలితంగా ఐదులక్షల మంది ఉపాధికోల్పోయిన అమెరికన్లు ఎలాంటి పరిహారం, సహాయం లేకుండా నష్టపోయారు. తన అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలంటే నిరుద్యోగులకు ఇవ్వదలచిన పదిబిలియన్ డాలర్ల ఖర్చును మరోచోట కోత పెట్టాలని మెలికపెట్టాడు. మన రోశయ్యగారు కొత్త కార్డులు ఇవ్వకుండా, బోగస్ పేరుతో ఉన్న కార్డులను రద్దు చేయటానికి, తద్వారా బియ్యం, కిరోసిన్ సబ్సిడీ తగ్గించటానికి ప్రపంచబ్యాంకు పెట్టిన మెలికే కారణం. అందుకే అది చెప్పలేక కార్డుల సంగతి తేల్చకుండా కాలం గడుపుతున్నారు. ఆయనదేం పోయింది. నష్టం పేదలకేగా !!

**- సత్య**

సీరియల్

<u>జరిగినకథ:</u>

హావ్ హాయ్ ఇంటికెళ్తుంది. హాయ్ భార్య అప్పటికే చాలాసేపటి నుంచి ప్రసవవేదన పడుతోంది. హావ్ ఆమెకు దగ్గరుండి అన్ని సేవలూ చేసి ప్రసవం చేస్తుంది. తర్వాత తల్లీబిడ్డలకు ఎటువంటి సేవలు చేయాలో హాయ్‌కు చెప్పి ఇంటికెళ్తుంది. అప్పటి నుంచి తన భర్త ఆశయం నెరవేర్చే ఉద్దేశ్యంతో తరచుగా వాళ్లింటికి వెళ్లడం, శత్రువులను ఎదుర్కోవడానికి కావలసిన ధైర్య సాహసాలను నూరిపోయడం చేసేది. హీప్‌లో నుంచి వచ్చిన తొత్తులు కాపలా కాయడంతో డువాంగ్ తీసుకొస్తానన్న ఇద్దరు దళసభ్యులను టాట్ ఇంటి దగ్గరే ఉంచుతుంది. వారిని హాయ్ తన ఇంట్లో పెట్టుకోవడానికి ఒప్పుకుంటాడు. కొంత కాలం తర్వాత వారిని హావ్ ఇంటికి తీసుకొస్తుంది. డువాంగ్ వారిని ఆమెకు పరిచయం చేస్తుంది. ఇంతలో హావ్ ఇంటివైపుగా ఇద్దరు తొత్తులు వస్తున్నారని తెలియడంతో ఆమె భయపడుతుంది. ఆ తర్వాత...

**8వ భాగం**

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

# వియత్నాం గెరిల్లా

"డువాంగ్ వాళ్లను లోనికి తీసుకెళ్లు, తొత్తులు వస్తే రహస్య గృహంలోకి వాళ్లను పంపించు"

"సరే, మీరు లోనికి వెళ్లండి. హావ్ మరికొన్ని రొయ్యలు పట్టుకురా ఇద్దరం బాగుచేద్దాం"

డువాంగ్ అన్నీ సర్దేసింది. కొంచెం సేపు అయిన తర్వాత తొత్తులు ఇద్దరూ కాళ్లీడ్చుకుంటూ వచ్చారు. వాళ్ల నడక చూసిన తర్వాత నాకు మనస్థిమితం ఏర్పడింది. నెమ్మదిగా తూలుతూ వస్తున్నారు. దాడి చేయడానికి వస్తున్న వారి మాదిరిగా లేరు. మా యింటి ముందుగా నడిచి ముందుకు వెళ్లారు. ముందుకు వెళ్లిన వాళ్లు ఏదో గుసగుసలాడుకుని వెనుదిరిగి వచ్చారు. రొయ్యల్ని బాగు చేస్తున్న డువాంగ్ వారి వంక కన్నెత్తి కూడా చూడలేదు. "నువ్వు ఊరుకో, వాళ్ల సంగతి నేను చూసుకుంటాను" అని నెమ్మదిగా గొణిగింది.

వాళ్లిద్దరూ మా దగ్గరకు వచ్చారు. ఒకతను ఏదో చెప్పాలనుకున్నాడు. కానీ, వెనుకాడాడు రొయ్యల్ని చూపిస్తూ.

"అమ్మకానికి రొయ్యలున్నాయా? కొంటాం" అని అడిగాడు.

"మాకు సరిపడా వున్నాయి. అమ్మకానికి లేవు"

"మాకు కొన్ని ఇవ్వండి"

"ఎన్ని కొంటారు?" అడిగింది డువాంగ్.

"మీరు ఇవ్వగలిగినన్ని, ప్రస్తుతానికి మాదగ్గర పావలా మాత్రం వుంది"

డువాంగ్ ఆలోచిస్తున్నట్లుగా చూసి, "హావ్ ఆ పెద్ద మనుషులకు కొన్ని రొయ్యలు తెచ్చి ఇవ్వు" అంది.

ఇంట్లోకి వెళ్లి సుమారు ఒక కిలో వుండే రొయ్యల్ని తెచ్చి వారికిచ్చాను. రొయ్యల్ని తీసుకోకుండా పావలా తిరిగి జేబులో పెట్టుకున్నాడు.

"పావలాకు అన్ని రొయ్యలా! పావలాకు ఇందులో సగం కూడా రావు. అయినా తృప్తి లేదు. అవునా?" అని డువాంగ్ ప్రశ్నించింది.

"లేదు.. లేదు" అంటూ అతను గొణిగాడు. నా వంక ఆశ్చర్యంగా చూస్తూ

"మంత్రసాని హావ్వు కదూ?" అని అడిగాడు.

నా పేరు ఎలా తెలుసుకున్నాడో తెలియదు.

"భగవంతుడు నిన్ను రక్షించుగాక! నీకు చాలా రుణపడివున్నాను" అంటూ చెప్పసాగాడు.

మాకు చాలా ఆశ్చర్యం వేసింది. నా వంక తేరిపార చూసి,

"నా భార్య ప్రసవవేదన పడుతున్నప్పుడు సహాయం చేశావు. అందుకు ధన్యవాదాలు. ఆ రాత్రి నేను వద్దామనుకున్నాను. రాలేకపోయాను. అందమైన బిడ్డ పుట్టింది. నా భార్య నిన్ను ఎప్పుడూ తలుస్తూ వుంటుంది. అవకాశం వచ్చినప్పుడు నీ రుణం తీర్చమంటుంది" అంటూ ప్రేమ పూర్వకంగా చెప్పుకుపోతున్నాడు.

ఆ మాటలు వింటూనే ఆనాటి విషయం గుర్తుకు తెచ్చుకోసాగాను. నాటి రాత్రి నేను వాళ్లింటికి వెళ్లినప్పుడే నా భర్త ఇంటికి వచ్చాడు. ఆమె ఈ సైనికుని భార్య! అదంతా గుర్తుకు వచ్చింది.

"నా పేరు ఎలా గుర్తుంది?" అని అడిగాను.

"నా భార్య నిన్ను పేరు పెట్టి పిలవడం విన్నాను"

నువ్వు 'సావో' బీచ్‌లో వుంటున్నావని నా భార్య చెప్పింది"

"టామ్! రొయ్యలు వద్దు" సరిపడా డబ్బులూ లేవు"

"నెల మధ్యలో వున్నాం. అప్పుడే డబ్బు అయిపోయిందా?" డువాంగ్ అడిగింది.

"డబ్బులు చాలడం లేదు. నా భార్య వారం రోజుల నుండి బియ్యం అప్పు చేస్తోంది"

"పర్వాలేదు. రొయ్యలు తీసుకెళ్లండి. డబ్బు ఇవ్వక్కర్లేదులే"

అతను సందేహించాడు. కానీ రెండో అతను "వాళ్లు ఇస్తామంటున్నారు తీసుకో" అని ప్రోత్సహించాడు.

నేను పొట్లాం కట్టి ఇచ్చాను. తీసుకుని తలొంచి నమస్కరించి వెళ్లిపోయారు.

వాళ్లు కనుమరుగయ్యే వరకు ఆగి, "దుర్దినంగా వుంది కదూ?" అన్నాను. డువాంగ్ వాళ్లు పోయిన దిక్కే చూస్తున్నది. ఏదో ఆలోచనలో మునిగిపోయింది. కొంతసేపు అయిన తర్వాత,

"వాళ్లు చాలా పేదవాళ్లు. అందువల్లే సైనికులుగా చేరారు. కానీ, ఇప్పుడు మరింత పేదవాళ్లు అయ్యారు. ఒకరిద్దరు టూబూ వంటి వాళ్లు మినహా మిగిలిన వారందరిదీ ఇదే పరిస్థితి. మన మాదిరిగానే వాళ్లూ మానవులు... అతని

భార్యకు సహాయం చేయమని పంపడంలో గ్రామ పార్టీ మంచి పని చేసింది. అతను నీకు రుణపడి వుండడమంటే ఉద్యమానికి రుణపడి వున్నట్లే. అర్థమయ్యిందా?" అని అడిగింది డువాంగ్.

నేను మౌనంగా కూర్చున్నాను. కొంతసేపైన తర్వాత, "డబ్బుకోసం సైన్యంలో చేరారు. కానీ సహృదయులు. వారెందుకు పారిపోకూడదు?" అడిగాను.

"పారిపోవడం తేలికనుకున్నావా? అనేక విధాలుగా వారు బంధింపబడి వుంటారు. వారు పారిపోవడం పారిపోకపోవడం మన మీద ఆధారపడి వుంటుంది. ఇప్పటి నుండి అందుకు మనం ప్రోత్సహించాలి. వారు ఆలోచించేట్టు చేయాలి. సైనిక కేంద్రం విడిచి పెట్టేటట్టు చేయాలి". ఈ మాటలు చెబుతున్నప్పుడు డువాంగ్ కళ్లు మెరిశాయి. ఈ విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు కనపడింది. ఆ ఇద్దరు సైనికులతో జరిపిన సంభాషణ ఆమె నిర్ణయాన్ని మరింత బలపరిచింది.

సైనికులిద్దరూ వెళ్లిపోయిన తర్వాత మామయ్య ఇంట్లో నుండి బయటికి వచ్చాడు.

"వాళ్లు వెళ్లారు. అవునా?"

"ఆ వెళ్లిపోయారు"

"భయమేసింది. ఎందుకు తిరుగుతున్నారంట?"

"రొయ్యలు కొనుక్కోవాలనుకుంటున్నారు"

జరిగిన సంగతంతా మామయ్యతో చెప్పాను.

"వాళ్లు శత్రు శిబిరం విడిచి వెళతారు" అన్నాడు మామయ్య. ఆ మాటలకు డువాంగ్ నవ్వింది. ఏమీ మాట్లాడలేదు.

"ఇంట్లోకి వస్తారనుకుని స్నేహితుల్ని రహస్య గృహంలోకి తీసుకెళ్లాను" అంటూ చెప్పి గదిలోకి వెళ్లి మంచం కింద వున్న ఇసుకను తొలగించి అక్కడ వున్న చెక్కపై చిన్నగా కొట్టాడు. తలుపు తీసుకుని ఇద్దరూ తలలు బయటికి పెట్టారు.

"వాళ్లు వెళ్లిపోయారు. బయటికి రండి" పిలిచాడు మామయ్య. వాళ్లిద్దరూ బయటికి వచ్చారు. డువాంగ్ నవ్వుతూ,

"మీ ఇద్దరూ ఇక్కడకు వచ్చారో లేదో, నిర్బంధం ప్రారంభమైంది" అంది.

"అందుకు అలవాటు పడడానికి తోడ్పడింది"

ఆ ఇద్దరూ వచ్చి వలల గుట్టమీద తాపీగా కూర్చున్నారు. ఏమీ జరగనట్టు వున్నారు. పైప్ నిండా పుగాకు నింపి, ముట్టించి ఒక దమ్ము లాగారు.

"హీవ్ మనం ఎప్పుడు వెళ్దాం?"

"కొంచెం సేపు విశ్రాంతి తీసుకోండి. భోజనం చేసి నిద్రపోయి తర్వాత వెళ్దాం"

డువాంగ్ చేతులు నలుపుకుంటూ,

"ఎంత సంతోషం, నిన్న నిద్రపోవాలనుకున్నాం. ఇవాళ కావాల్సినంత సేపు నిద్రపోవచ్చు"

"ఆమె నాకు తెలుసులే. ఆమెను గురించి ఆదుర్దా పడకు. తెలివితేటలు ఉపయోగించాలి. మొదటిసారిగా మనం హీప్‌లో ప్రాంతంలో ఉద్యమం ప్రారంభించబోతున్నాం. అందులో జయం పొందాలి. బాధ్యత నీదే"
"ఆ విషయం గురించే ఆలోచిస్తున్నాను"
"అలాగే చేయడం మంచిది. జాగ్రత్తగుండాలి. 'బౌ' ఏమంటున్నాడు?"
"ఆ విషయం గురించి ఇంతవరకు నన్నేమీ అనలేదు"
"నీ కోసం మనుషులు ఎప్పుడు వస్తారు?"
"మధ్యాహ్నం బండి వస్తుంది".
డువాంగ్ వెళ్లిపోయింది. ఏమైనా అనుమానం కలిగితే వల పూసలు మోగించమని మామయ్యకు చెప్పాను.

"అంతే అంతే, ఇవాళ బాగా నిద్రపోండి. రేపటి నుండి మీ ఇష్టం వచ్చినట్లు నిద్రపోవడానికి వీలుండదు" అంది డువాంగ్.

జంగ్ నవ్వి, "ఈ రకమైన జీవితానికి అలవాటుపడ్డాను. మామూలుగా భోజనం చేయనీయకుండా, నిద్రపోనీయకుండా నెలల తరబడి ఆపలేక పోయారు. ఎందుకు మమ్మల్ని భయపెట్టడానికి ప్రయత్నిస్తావ్" అన్నాడు.

సమాధానం చెప్పకుండానే డువాంగ్ నవ్వింది. ఇద్దరూ కాన్వాస్ పట్టా మీద పడుకున్నారు. నిద్ర రావడంలేదు కాబోలు. మామయ్య దగ్గరకు చేరారు.

వంట పూర్తికాగానే అందరం కలిసి తిండి తిన్నాం. తర్వాత వాళ్లు పడుకున్నారు. మామయ్య దొడ్లో కూర్చుని వల అల్లుకుంటున్నాడు. అదే సమయంలో కాపలా కాస్తున్నాడు. పాపను వరండాలోకి తీసుకెళ్లి కొత్త గౌను కుడుతూ కూర్చున్నాను. డువాంగ్ వెళ్లిపోతూ "ఇద్దరినీ నీకు అప్పగించాను. భయంగా వుందా?" అని అడిగింది.

"ఏమీ లేదు" బదులు చెప్పాను.

"ఆ స్థావరం సురక్షితమైనదని అనుకుంటున్నావా?"

"తప్పకుండా, అన్ని విషయాలను వాళ్లకు చెప్పాను. జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం మీద ఆ గ్రామంలోని పరిస్థితి క్లిష్టమైంది. అయినా చాలామంది మంచి వాళ్లున్నారు. ప్రసవ సమయంలో అనేక సార్లు సహాయం చేయడానికి ఆ గ్రామం వెళ్లాను. అందరూ బాగా పరిచయమయ్యారు...."

"ముందుగా మన వాళ్లిద్దరికీ చెప్పాల్సింది ఏమైనా వుందా?" అని తిరిగి అడిగింది డువాంగ్.

"గ్రామం చివర వున్న గ్రామాధికారి గురించి, ఐరన్ బ్రిడ్జ్ దగ్గర వున్న హోటల్ గురించి మినహా ఆదుర్దా పడవలసినదేమీ లేదు. గ్రామాధికారేమో మెతకవాడు. రైతుల నుండి కోళ్లను, పందులను ఎత్తుకు రమ్మని అధికారులు చెప్తే, ఇచ్చిన వాళ్ల దగ్గర నుండి తీసుకుపోయి వాళ్లకు ఇస్తాడు. ఎవర్నీ బాధించడు. హోటల్ యజమాని టూబా మూడో భార్య మాత్రం చాలా దుర్మార్గురాలు. ఆమె వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం కూడా అందజేస్తుందనుకుంటాను. తన భర్త వుద్యోగం లాంటిది తనకు కూడా ఇస్తారని ఇటీవల బడాయిలు చెబుతోంది"

"ఆమె నాకు తెలుసులే. ఆమెను గురించి ఆదుర్దా పడకు. తెలివితేటలు ఉపయోగించాలి. మొదటిసారిగా మనం హీప్‌లో ప్రాంతంలో ఉద్యమం ప్రారంభించబోతున్నాం. అందులో జయం పొందాలి. బాధ్యత నీదే"

"ఆ విషయం గురించే ఆలోచిస్తున్నాను"

"అలాగే చేయడం మంచిది. జాగ్రత్తగుండాలి. 'బౌ' ఏమంటున్నాడు?"

"ఆ విషయం గురించి ఇంతవరకు నన్నేమీ అనలేదు"

"నీ కోసం మనుషులు ఎప్పుడు వస్తారు?"

"మధ్యాహ్నం బండి వస్తుంది".

డువాంగ్ వెళ్లిపోయింది. ఏమైనా అనుమానం కలిగితే వల పూసలు మోగించమని మామయ్యకు చెప్పాను. పాపకు కొత్త గౌను కుడుతూ కూర్చున్నాను. పాప ఆనందంతో, "అమ్మా! నీకు కొత్త చొక్కా వుందా?" అని అడిగింది.

"ముందు నీకు కుట్టి తర్వాత నాకు కుట్టుకుంటాను"

"తాతయ్యా! తాతయ్యా!" అంటూ పాప పెద్దగా అరిచింది.

"అలా అరవకూడదు. పని చేసుకోనియ్యి. సముద్రంలోకి పోయి నీకు చేపలు పట్టుకొస్తాడు" అని పాప కాలు పట్టుకుని "ఇంతింత చేపలు తెస్తాడు" అన్నా.

"బలె...బలె" అంటూ సంతోషంతో తన తల నా ఒళ్లో దాచుకుంది. ఇద్దరం అలా చాలాసేపు గడిపాం. అప్పుడప్పుడూ పాప పెద్దగా నవ్వేది. పాప నోరు మూస్తూ, 'అల్లరి చేయకూడదు, వాళ్లను నిద్రపోనియ్యి' అని నెమ్మదిగా చెప్పా.

పాప అల్లరి మానింది. గదిలోకి తొంగి చూస్తే యువకుడు మావంక చూస్తూ కూర్చుని వున్నాడు. కళ్లు మెరుస్తున్నాయి. మా సంతోషంలో భాగం పంచుకుంటున్నట్లుగా వున్నాడు. సముద్రం వంక చూస్తున్నాడు. ఏమి గుర్తుకొచ్చిందో అంతలోనే విచారం అతని ముఖాన్ని ఆవరించింది. ఏదో ఆలోచిస్తున్నాడు.

(ఇంకా వుంది)


టేకిట్! 'నీమ్ ఫ్లవర్ పికిల్' అంటే!
కంగారు పడకండి! ఉగాది పచ్చడి... కాన్వెంట్ చదువులు కదా...!!!
శేఖర్


ఉగాది పచ్చడంటేనే భయపడి పారిపోయేవారు! ఇప్పుడు కోరి కోరి మరీ అడుగుతున్నారు... కారణం?
'ఆత్మహత్య' చేసుకుందామనే నిర్ణయానికొచ్చాను!
శేఖర్


ఇన్సూరెన్స్ చేశారా? అని అడుగుతున్నారెందుకూ?
ఎలాగూ ఇంకొద్ది క్షణాల్లో ఉగాది పచ్చడి తినబోతున్నారు కదాని!
శేఖర్


దొంగ వెధవ నిజం చెప్పటం లేదు గానీ... ఓసారి ఇంటికెళ్లి అమ్మగారు చేసిన ఉగాది పచ్చడి తీసుకురా...!!!
శేఖర్


నీదీ... ఉగాది పచ్చడి తిన్న కేసే అన్నమాట!
శేఖర్


తీపి... పులుపు... వగరు... లేకుండా ఒక్క 'చేదు' మాత్రమే వుందేమిటే ఈ ఉగాది పచ్చడిలో?
అది కుంకుడు కాయ రసమండీ! స్నానానికని అక్కడ పెట్టా...!
శేఖర్


గిట్టని వాళ్లెవరో మీవారి మీద విష ప్రయోగం చేశారమ్మా...
తెల్లారి లేచాక ఆయన ఉగాది పచ్చడి తప్ప మరేం తినలేదు డాక్టర్!
శేఖర్


అంతా ఒక్కసారి కాకుండా... తీపి ఒకసారి పులుపు ఓ సారి... చేదొకసారి... వగరొకసారి పెడ్తోందా...? ఎవరావిడ?
సీరియల్ రచయిత్రి లే...!
శేఖర్

సినిమా కబుర్లు

# అమెరికా రేఖల్లోనే ఆస్కార్ పురస్కారాలు



అవతార్‌లో కూడా పరోక్షంగా అమెరికా ఆధిక్యతను చూపించే ప్రయత్నం జరిగింది. కాని అంతకంటే కూడా యుద్ధ క్షేత్రమైన ఇరాక్‌లో తీసిన కథకు మొగ్గు వుండటం సహజమే. అక్కడ అమెరికా సైనికుల సంఘర్షణను, మానవతా విలువలను క్యాథరిన్ చూపించారు. అమెరికా సైనికులకు ఇరాక్ ప్రజలు డాబాలపై నుంచి జేజేలు పలకడం ఈ చిత్రంలో చూస్తాం. అమెరికన్లు ఎన్నో నరమేధాల తర్వాత కూడా ఘోరంగా ఓడిపోయిన వియత్నాంలో విజయవిహారం చేసినట్టు చూపించే రాంబో పాత్రను సృష్టించి కాసులు దండుకున్న ఉదాహరణను ఇది గుర్తు చేస్తుంది. కథాత్మకత ముసుగుతో ఆస్కార్ కట్టబెట్టినా అసలైన ఆంతర్యం ఇదే. మహిళా దినోత్సవం సందర్భంలో తొలి మహిళా ఆస్కార్ అంటున్నారు గాని వాస్తవంలో మార్చి 8కి గల సామ్రాజ్యవాద వ్యతిరేక సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమైన పోకడ ఈ చిత్ర దర్శకురాలిది.

**అం**తర్జాతీయంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా పరిగణించడమే గాక అమిత ప్రచారం పొందే ఆస్కార్ పురస్కారాలను ఈ ఏడాది ఊహించిన దానికి అనుగుణంగానే ప్రకటించారు. హిందూ పత్రిక ఆదివారం అనుబంధం చదివిన వారికి ఇందులోని తర్కం కూడా ఇట్టే తెలిసిపోతుంది. క్యాథరిన్ బిగ్లో రూపొందించిన హర్ట్ లాకర్‌కూ జేమ్స్ కామెరూన్ నిర్దేశకత్వంలోని అవతార్‌కూ మధ్య పోటీ గురించి ఎడతెగని చర్చ సాగినా చివరకు హర్ట్ లాకర్‌కే ఆస్కార్ల పంట పండింది. ఈ చిత్రాన్ని కేవలం కోటీ పది లక్షల డాలర్ల ఖర్చుతో నిర్మించగా కోటీ నలభై ఏడు లక్షలు వసూలు చేసింది. ఇందుకు భిన్నంగా అవతార్‌ను 23 కోట్ల 70 లక్షల డాలర్ల ఖర్చుతో నిర్మించగా 300 కోట్ల డాలర్లు వసూలు చేసి ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టింది. హర్ట్ లాకర్ ఇరాక్‌లో సైనికుల బాంబు నిర్మూలన దళం అనుభవాలను చిత్రిస్తే, అవతార్ మరో గ్రహం నుంచి వచ్చిన వారు మానవుల వంటి జీవులతో తలపడిన సందర్భాన్ని సాంకేతిక అద్భుతంగా చిత్రించింది. క్యాథరిన్, కామెరూన్‌లు గతంలో భార్యాభర్తలు కావడం ఈ నాటకాన్ని రక్తి కట్టించింది. చాలా కాలంగా హాలీవుడ్‌లో సాంకేతిక హంగామా కన్నా కథాబలంతో పటిష్టంగా రూపొందిన చిత్రాలకే ఎక్కువ పురస్కారం లభిస్తున్నట్టు తెలుస్తుంది. అంతకన్నా కీలకం అమెరికా విదేశాంగ ప్రయోజనాలకు అనుగుణంగా వున్న చిత్రాలకు పెద్దపీట ఖాయమైపోతుంది. ఈ రెండు కారణాల వల్ల క్యాథరిన్‌కే ఆస్కార్ దక్కడం తథ్యమన్న అంచనాలు నిజమయ్యాయి.

అవతార్‌లో కూడా పరోక్షంగా అమెరికా ఆధిక్యతను చూపించే ప్రయత్నం జరిగింది. కాని అంతకంటే కూడా యుద్ధ క్షేత్రమైన ఇరాక్‌లో తీసిన కథకు మొగ్గు వుండటం సహజమే. అక్కడ అమెరికా సైనికుల సంఘర్షణను, మానవతా విలువలను క్యాథరిన్ చూపించారు. అమెరికా సైనికులకు ఇరాక్ ప్రజలు డాబాలపై నుంచి జేజేలు పలకడం ఈ చిత్రంలో చూస్తాం. అమెరికన్లు ఎన్నో నరమేధాల తర్వాత కూడా ఘోరంగా ఓడిపోయిన వియత్నాంలో విజయవిహారం చేసినట్టు చూపించే రాంబో పాత్రను సృష్టించి కాసులు దండుకున్న ఉదాహరణను ఇది గుర్తు చేస్తుంది. కథాత్మకత ముసుగుతో ఆస్కార్ కట్టబెట్టినా అసలైన ఆంతర్యం ఇదే. మహిళా దినోత్సవం సందర్భంలో తొలి మహిళా ఆస్కార్ అంటున్నారు గాని వాస్తవంలో మార్చి 8కి గల సామ్రాజ్యవాద వ్యతిరేక సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమైన పోకడ ఈ చిత్ర దర్శకురాలిది.

ఆస్కార్లలో ప్రతిసారి ఏదో ఒక చిత్రం వైపు మొగ్గు స్పష్టంగా వుంటుంది. అందుకే ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకత్వం, ఎడిటింగ్, స్క్రీన్‌ప్లే, మిక్సింగ్, సౌండ్ ఎడిటింగ్ పురస్కారాలు కూడా ఈ చిత్రానికే దక్కాయి. అవతార్‌కు సాంకేతిక విభాగంలో ఉత్తమ ఆర్ట్, విజువల్ ఎఫెక్ట్, సినిమాటోగ్రఫీ అవార్డులు లభించాయి. హర్ట్ లాకర్‌తో పోటీ పడగల ఒకే ఒక చిత్రం ఇన్‌గ్లోరియస్ బాస్టర్డ్స్ ఎలాటి అవార్డులూ తెచ్చుకోలేకపోయింది. మరో విశేషమేమంటే 1943 తర్వాత మళ్లీ ఈసారి పది ఉత్తమ చిత్రాలను నామినేషన్‌కు ఎంపిక చేశారు. గత పర్యాయమైతే కేవలం స్లమ్‌డాగ్ మిలియనీర్ మాత్రమే అందరి అభిమాన ఎంపికగా ముందే తేలిపోయింది.

ఉత్తమ చిత్రం స్థాయిలో కాకున్నా ఉత్తమ నటి అవార్డు కూడా పోటాపోటీగా సాగింది. న్యూయార్క్‌లో జీవితం కోసం పెనుగులాడిన ఆఫ్రికన్ అమెరికన్ పేదమ్మాయి పాత్రకుగాను నూతన నటి గాబ్రరీ సిడ్బీ ఆస్కార్ తెచ్చుకోగలిగింది. ఆమెతో పోటీ పడిన హాలీవుడ్ హేమాహేమీలు నిలబడలేకపోయారు. ఉత్తమ నటుడిగా పురస్కారం పొందిన జెఫ్ బ్రిడ్జెస్‌కు కూడా ఇదే వర్తిస్తుంది. క్రేజీ హార్ట్‌లో నటనకు గాను అవార్డు పొందిన ఈయన తల్లిదండ్రులు కూడా తారలే. 'ఇంత అద్భుతమైన వృత్తిని నాకు ప్రసాదించినందుకు అమ్మానాన్నలకు వందనం' అని అతనన్నాడు!

హాలీవుడ్ అంటేనే హంగామా. గత ఏడాది ఆర్థిక మాంద్యం కారణంగా కొంచెం తక్కువ స్థాయిలో జరిపిన దృష్ట్యా ఈ సారి భారీ ఏర్పాట్లు చేశారు. తారా సందోహం తరలి వచ్చింది. ఒలింపిక్స్, గ్రామీ వంటి ఉత్సవాల రేటింగ్ పెరిగింది గనక ఎబిసి ఆధ్వర్యంలో జరిగిన ఆస్కార్స్ రేటింగ్ కూడా కొద్దిగా పెరుగుతుందనే ఆశించారు. అయితే నామినేట్ చేసిన పది చిత్రాల క్లిప్పింగులను క్రమపద్ధతిలో చూపి అలరిస్తారన్న ఆశలు పెద్దగా నెరవేర లేదు. అయినా హాలీవుడ్ తళతళలను మాత్రం ఆస్కార్ నూరు శాతం సాక్షాత్కరింపచేసింది.

**- తెర**

క్రైమ్ కథ

# నెత్తుటి బొట్లు

- యర్నాగుల సుధాకరరావు

"నా భర్త ప్రతిరోజు ఇక్కడే రాత్రి సమయంలో తాగేవాడు. పిల్లలు చూస్తే చెడిపోతారని మద్యం తాగేప్పుడు జాగ్రత్తలు పాటించేవాడు" చెప్పింది. ఆ మాటలకు పెదవి విరిచాడు.
రాణి, ముఖేష్, రంజిత్ కోసం వెతుకులాట ఆరంభమైంది.
రెండు వారాల్లో మొత్తం వారి ప్లేసులన్నీ జల్లెడపట్టి వెతికి తీసుకుని వచ్చారు.

**పో**స్టుమార్టమ్ రిపోర్టువస్తే ఏదైనా తెలిసేది. గోపాల్(43) హత్యలో మనం అనుమానించే వ్యక్తుల ప్రత్యక్షప్రమేయం లేదు. వారు పిలవగానే వచ్చారు. వారిని ఇంటరాగేట్ చేశాం. ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆ రాత్రే గోపాల్‌ను బెడ్‌రూమ్‌లోఎవరో చంపేశారు. హంతకుడు ఏ ఒక్క ఆనవాలునూ వదిలిపోలేదు. పోలీస్‌డాగ్సు సిటీ అంతా తిప్పితిప్పి వెనక్కి తెచ్చేశాయి. గోపాల్‌తో వ్యాపార లావాదేవీల్లో బాగా గొడవలు పడుతున్న వారెవరు కూడా ఈ కేసులో ఇన్‌వాల్వ్ అయినట్లు లేరు. పోనీ డబ్బుకోసమే ఈ హత్య జరిగిందంటే ఆ ఇంట్లో ఏమీ పోలేదు" పైఅధికారికి విపులంగా వివరించాడు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరూప్.

అక్కడ మరికొంతమంది అధికారులు ఆసక్తిగా విన్నారు.

"ఒకే మీరు కేసు స్టడీలో బాగానే ఉన్నారు. కాస్త ముందుకు వెడితే మొత్తం మన చేతికి వస్తుంది. ఆ ఇంటి స్టోర్ రూమ్‌కున్న మూడు మెట్లమీద రెండు నెత్తురుబొట్లు లభించాయి. ఎండిన నెత్తురు మరకల్లో ఒక నెత్తురుబొట్టు హతుడు గోపాల్‌ది, మరో నెత్తుటిబొట్టు వేరెవ్వరిదో తేలలేదని చెప్పారు. ఒకసారి ఆ దిశలో పరిశోధించండి. ఏది ఏమైనా హంతకుణ్ణి పట్టుకుని తీరాలి. గోపాల్ ఒక కీలకవ్యక్తి"

స్వరూప్ అక్కణ్నించి నేరుగా గోపాల్ ఇంటికి వెళ్లాడు. ఆ ఇంట్లోవారు ఏది అడిగినా చెప్పడానికి ఉత్సాహంగానే ఉన్నారు. స్టోరురూమ్ మెట్ల దగ్గర ఆగాడు. అక్కణ్నించి పరిసరాలను పరీక్షగా చూశాడు.

అనుమానంగా కలియతిరిగాడు. ఇక్కడే ఏదో జరిగింది ఏమిటది? స్వరూప్ ఆలోచిస్తూ అక్కడ కూర్చున్నాడు. గోపాల్ మృతదేహంపై గొంతులో గాయం ఉంది. బాగా రక్తం కారిపోయింది. అది జరిగింది లోపల బెడ్‌రూమ్ దగ్గర. మరి ఇక్కడికి రెండు నెత్తురుబొట్లు ఎలా రాలి పడ్డాయి? హంతకుడి చేతిమీద గాయం అయిందనుకుంటే ఒక నెత్తురుబొట్టు మెట్టుమీద పడిందనుకుంటే ఇక్కడికెందుకు వచ్చారు?

స్టోరురూమ్‌లో మంచం చూశాక దగ్గరగా వెళ్లాడు. అది బాగానే ఉంది. కావాలని పనికిరాదని పడేశారు. తలగడ దిండు మరీ బాగుంది. స్టోరురూమ్‌లో ఫ్యాన్ ఎందుకో అర్థం కాలేదు. ఆలోచిస్తూనే బయటికి చూశాడు. స్టోరురూమ్‌కి అవతల పక్కింటివారి పెరటి తలుపుంది. అక్కడికి వెళ్లి అందులో ఎవరుండేది తెలుసుకున్నాడు. వాళ్లు గోపాల్ హత్య తరువాత ఊరెళ్లారు. రెండు కుటుంబాలకు మంచి స్నేహం ఉందని తెలుసుకున్నాడు.

గోపాల్ భార్యను పక్కకు తీసుకుపోయి ఆ ఇంటివారి గురించి అడిగాడు. "ఆమె పేరు రాణి. మాతో స్నేహంగా ఉండేవారు. ఆమెపై భర్తకు అనుమానం ఎక్కువ. ఆమె అందంగానే ఉంటుంది. గోపాల్‌హత్య అయిన రోజు ఉదయాన్నే పాట్నా వెళ్లారు. వారి గురించి ఎందుకు అడుగుతున్నారు?" ఎదురు ప్రశ్నించింది.

గోపాల్, రాణితో మాట్లాడేవారా? చనువుగా ఉండేవారా? నిజమే చెప్పండి. ఏదీ దాచకండి"

"ఆ ఇద్దరిమధ్య ఏదో ఉందని ఆమె భర్తకు అనుమానం. ఒకసారి గొడవపడ్డాడు. నన్ను హెచ్చరించాడు. చంపేస్తానన్నాడు"

"అతడే గోపాల్‌ను చంపేశాడేమో?"

"రాణి భర్త ముఖేష్ చాలా నీరసంగా ఉంటాడు. అతడి చేతిలో నా భర్త ఏ పరిస్థితిలోనూ చావడు. ఎందుకంటే అతడికి ఏదో రోగం ఉంది. నిలబడలేడు. పరువుకు పడి ఛస్తాడు. నా భర్తను పిస్తోలుతో హత్య లేదు. కత్తితో పొడవగా చనిపోయాడు"

"వారింటికి తరుచూ ఎవరైనా వచ్చేవారా?"

"రాణి అన్న రంజిత్ వచ్చాడు"

"అతడెలాంటి వాడు?"

"తెలియదు. కానీ, ఎప్పుడో మాటల సందర్భంలో రాణి చెప్పింది. అన్నదమ్ములు పెద్దరికంతో పాట్నాలో రాజకీయాలు చేస్తుంటారు. ఆ రాజకీయాలు కూడా పరమక్రూరంగా ఉంటాయి. వారు హత్యలు చేయడానికి వెనుకాడరని"

ఆమెను స్టోరురూమ్‌లోకి తీసుకుపోయి అక్కడ ఫ్యాన్, పాత మంచం చూపించి వీటిని ఇక్కడ ఎవరు వాడుతున్నారని అడిగాడు. ఆమె అర్థం కాక చూసింది.

"నా భర్త ప్రతిరోజు ఇక్కడే రాత్రి సమయంలో తాగేవాడు. పిల్లలు చూస్తే చెడిపోతారని మద్యం తాగేప్పుడు జాగ్రత్తలు పాటించేవాడు" చెప్పింది. ఆ మాటలకు పెదవి విరిచాడు.

రాణి, ముఖేష్, రంజిత్ కోసం వెతుకులాట ఆరంభమైంది.

రెండు వారాల్లో మొత్తం వారి ప్లేసులన్నీ జల్లెడపట్టి వెతికి తీసుకుని వచ్చారు.

ముఖేష్ తను ఎందుకు నేరం చేయించాల్సివచ్చిందో ఒప్పుకున్నాడు. అలా చేయకుంటే తనకు శాంతి లభించేదికాదు.

రాణికి డబ్బుపిచ్చి. ఆమె ప్రతిరాత్రి పెరట్లోంచి నేరుగా స్టోర్ రూమ్‌కి వెళ్లిపోయేది. గోపాల్ ఆమెను దొంగనోట్లను మార్చేందుకు వాడుకున్నాడు. నా దృష్టిలో పడ్డాక పలుమార్లు ఆమెను హెచ్చరించాను. ఒకసారి గోపాల్‌కు చెప్పాను. అక్కణ్నించి వారిద్దరు లెక్క చేయలేదు. దాంతో ఆమె అన్నను పిలిపించి ఈ విషయం చెప్పాను. వాడు రెచ్చిపోయాడు. గోపాల్‌ను ఖతమ్ చేయడానికి నిశ్చయించుకున్నాడు. నేను వద్దన్నాను. 'ఇలాంటివారికి ఇదే సరైన జవాబు' అని హత్య పథకం అమలు చేశాడు. ఆ రోజు గోపాల్ ఫ్యామిలీ అంతా పెళ్లికి వెళ్లింది. వారితో రాణి వెళ్లింది. స్టోర్‌రూమ్ దగ్గరకు వెళ్లి రంజిత్ తలుపు చప్పుడు చేశాడు. రాణి వెనక్కి వచ్చిందని గోపాల్ మద్యం తాగుతూనే ఆత్రంగా వచ్చాడు. అప్పుడు వాడి దగ్గర దొంగనోట్లు లక్షల్లో ఉన్నాయి. వాడిని పట్టుకుని చావగొట్టి మెట్టుమీద పడేశాడు.

గోపాల్ మైకంలో బాటిల్ పగలగొట్టి రంజిత్‌ను పొడవబోయాడు. రంజిత్ తప్పించుకుని కత్తితో పొడవబోయాడు. గోపాల్ పరుగెత్తాడు. వెంటపడి బెడ్‌రూమ్‌లో కత్తితో గోపాల్ గొంతులో పొడిచాడు. దాంతో గోపాల్ కుప్పకూలాడు. ఇదంతా నేను ప్రత్యక్షంగా చూశాను. తొలుత చంపకుండా చావగొట్టి వదిలేద్దామనుకున్నాడు. రంజిత్‌చేతికి గాయం కావడంతో తట్టుకోలేక చంపేశాడు"

అక్కడ అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. మెట్లమీద రెండు నెత్తురుబొట్లు పడకుంటే ఈ కేసు ఇంతత్వరగా ముగిసేది కాదు.రంజిత్ కూడా నేరం ఒప్పుకోవాల్సి వచ్చింది.

★

# బొమ్మా... బొమ్మా... ఆస్కార్ బొమ్మా... ఎలా తయారయ్యావమ్మా...

చిత్రపరిశ్రమలో అత్యద్భుత ప్రతిభావంతులను ఆస్కార్ అవార్డుతో సత్కరిస్తుంటారు. ప్రపంచంలో అత్యధిక ప్రాధాన్యత గల అవార్డుల్లో ఆస్కార్ ఒకటి. అమెరికన్ ఎకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ వారు వాటిని బహూకరిస్తుంటారు. ఇంకా ఈ ఎకాడమీ గ్రామీ (సంగీతం), గోల్డెన్ గ్లోబ్ (అన్ని రకాలైన మీడియా), ఎమ్మీ (టీవీ ఆర్టిస్టు) అవార్డులను కూడా తయారుచేస్తోంది. మెట్రో గోల్డెన్ మేయర్ స్టూడియో యజమాని లూయిస్ బి.మేయర్ ఈ సంస్థను ఏర్పాటు చేశారు. మొట్టమొదటిసారిగా 1929, మే 16న ఈ అవార్డులను హాలీవుడ్‌లోని రూస్‌వెల్ట్ హోటల్లో బహూకరించారు. 1927-28 సంవత్సరాల్లో సాధించిన విజయాలకు, ప్రదర్శించిన ప్రతిభకు ప్రోత్సాహంగా వీటిని ఇచ్చారు. ఈ కార్యక్రమానికి నటుడు డగ్లస్ ఫెయిర్‌బాంక్స్, డైరెక్టర్ విలియమ్ సి.డిమిల్లీ ఆతిథ్యమిచ్చారు. 81వ ఆస్కార్ అవార్డులను 2008 సంవత్సరపు ఉత్తమ చిత్రానికి 2009 ఫిబ్రవరి 22న హాలీవుడ్‌లోని కొడాక్ థియేటర్‌లో ఇచ్చారు. దీనికి నటుడు హ్యూ జాక్‌మాన్ ఆతిథ్యమిచ్చారు.

**ఆస్కార్ ప్రతిమ తయారీ ఎలా?**

ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఆస్కార్ ప్రతిమను ఎలా తయారు చేస్తారో తెలుసుకుందామా?

ఆస్కార్ అవార్డు పొందడమంటే చిన్న విషయం కాదు! అందుకుగాను కళాకారులు కొన్ని దశాబ్దాల తరబడి కృషి చేయాల్సి ఉంటుంది. కాని వీటిని తయారు చేయడానికి కొన్ని రోజులు మాత్రమే పడుతుంది. 18,000 డాలర్లు ఖర్చవుతుంది. కాని దీనిని పొందిన వారికి మిలియన్ల విలువనిస్తుంది. పదమూడున్నర అంగుళాల పొడవు, ఎనిమిదిన్నర పౌండ్ల బరువున్న ముద్దతో ఈ అవార్డు రూపు ప్రారంభమౌతుంది. ఈ ముద్దను నాణ్యమైన టిన్, కాపర్, ఆంటిమొని లోహాలు, మరికొన్ని మిశ్రమాల కలయికతో తయారు చేస్తారు. ఈ ముద్దను నునుపుగా చేసి దానికి పాలిష్ వేస్తారు. పాలిష్ చేసిన తర్వాత దానిమీద కాపర్, నికెల్, వెండి, 24 క్యారెట్ల బంగారంతో పూత పూస్తారు. ఈ పూత తర్వాత దాన్ని ఒక మెటల్ బేస్ మీద బిగిస్తారు. ప్రతి ఆస్కార్ ప్రతిమకు నెంబర్లిస్తారు. 1949వ సంవత్సరం నుంచి నంబర్లివ్వడం ప్రారంభించారు. వీటిని సంవత్సరానికి 50 నుంచి 60 వరకూ తయారుచేస్తారు. ఈ అవార్డులను తయారుచేయడం పూర్తయిన తర్వాత వాటిని బూట్ల పెట్టె కంటే కొంచెం పెద్దగా ఉండే ప్లాస్టిక్ పెట్టెలో ప్యాక్ చేస్తారు. తర్వాత ప్రతి ఎనిమిదింటిని ఒక్కో కార్డ్‌బాక్స్‌లో పెట్టి సంస్థ కార్యాలయమైన కాలిఫోర్నియాలోని బెవెర్లీ హిల్స్‌కి పంపిస్తారు. అక్కడ వాటిమీద విజేతల పేర్లు చెక్కి హాలీవుడ్‌కు పంపిస్తారు. అలా తయారుచేసిన వాటిలో నాణ్యత లోపించిందని అనిపిస్తే వెంటనే వాటిని కరగదీసి మళ్లీ తయారు చేస్తారు. ఇలా 1995 నుంచి ఇప్పటివరకు చిన్న చిన్న లోపాలున్న 160 ప్రతిమలను బాగు చేశారు.

ఓసారి ఆస్కార్ ప్రతిమలను చికాగో నుంచి లాస్‌ఏంజిల్స్‌కు తీసుకువెళ్తుంటే 55 బొమ్మలను దారిలో ఎవరో దొంగిలించారు. ఇది 2000 మార్చి 10న జరిగింది. తర్వాత తొమ్మిది రోజుల్లో 52 దొరికాయనుకోండి.

వీటిని శుభ్రం చేయడానికి ఒక మెత్తని తడి గుడ్డతో తుడిస్తే చాలట.

# షెడ్యూల్డు కులాల రక్షణ కొరకు పటిష్ఠ చర్యలు

## - జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు

షెడ్యూల్డు కులాల అభివృద్ధికి, అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక విధానాలను అమలులోకి తెచ్చింది. వారి రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పరిచిన జస్టిస్ పున్నయ్య కమిషన్ అందించిన సలహాలను సూచనలను ఆచరణలోకి తెస్తూ వివిధ ప్రభుత్వ శాఖలకు విశేష అధికారాలు కల్పించింది. తద్వారా తరతరాలు వెనుకబాటు తనంలో ఉన్న షెడ్యూల్డు కులాలవారు ఆర్థిక, సామాజిక రంగాలలో పాటు సర్వతోముఖాభివృద్ధిని సాధించే వీలుకలుగుతుంది. అంతే కాకుండా సమాజంలో అన్ని వర్గాలతో సమానంగా అవకాశాలు పొందగలుగుతారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులకు అధారంగా **"రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు అందించిన విశేష అధికారాలు"** ఇలా ఉన్నాయి

**హోం శాఖ:** ప్రజా రక్షణ, వారి భద్రత కోసం అంచెలంచెలుగా కృషిచేస్తున్న హోంశాఖ పర్యవేక్షణలో షెడ్యూల్డు కులాల వారికి సంపూర్ణ రక్షణ కల్పించడానికి అనేక చర్యలు రూపొందించింది.

1) అవసరానుగుణంగా తమిళనాడు స్క్వాడ్ విధానాన్ని అనుసరిస్తూ, ప్రతి జిల్లాలోనూ స్పెషల్ మొబైల్ పోలీసు స్క్వాడ్ ఏర్పాటు
2) రోజుకో గ్రామం చొప్పున పోలీసు అధికారుల సందర్శన, పైగా సామూహిక కార్యకర్తల రూపంలో బాధ్యతల నిర్వహణకి రంగం సిద్ధం
3) ప్రతి సబ్ ఇన్‌స్పెక్టరు వారంలో ప్రతి శుక్రవారం రెండు గ్రామాలలో పర్యటించి, షెడ్యూల్డ్ కులాలవారిని ఆలయాలకి తీసుకువెళ్ళడం, హోటళ్ళలో విడి గ్లాసుల పద్ధతికి స్వస్తి చెప్పడం, సార్వజనీక బోరుబావులు, బావుల వద్ద అందరితో కలసి నీళ్ళు తెచ్చుకోవడం వంటి సంస్కరణలు చేయంచడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తారు. అంటే నాలుగు నెలల వ్యవధిలో అన్ని గ్రామాలలో ఈ మంచి పనులు పూర్తవుతాయి.
4) పిసిఆర్ మరియు పిబిఏ చట్టాల పరిధిలోకి వచ్చే కేసులని పరిష్కరించడానికి అర్హులైన ప్రత్యేక పోలీసు అధికారులని ప్రోత్సహించడానికి ప్రత్యేక పురస్కారాలని అందించడం.
5) గుర్తించబడిన ప్రదేశాలలో షెడ్యూల్డ్ కులాలు తప్ప ఇతరుల ఆయుధాల లైసెన్సులని నిలిపివేయడం లేదా రద్దు చేయడం జరుగుతుంది.
6) రాష్ట్ర ఇంటెలిజెన్స్ స్పెషల్ శాఖ ద్వారా ఇబ్బందులుండే గ్రామాలు మరియు ప్రాంతాలలో తిరుగులేని నిఘా ఏర్పాటు.
7) చట్టాన్ని ఉల్లంఘించేవారిని , వారిని ప్రోత్సహించే వారినీ అరెస్టు చేయడానికి తగిన చర్యలు జరుగుతున్నాయి.
8) షెడ్యూల్డు కులాలవారి పట్ల నేరాలు జరిగిన ప్రాంతాలలో స్పెషల్ పోలీసు పికెట్‌లని ఏర్పాటు చేయడం.

9) షెడ్యూల్డు కులాలవారి భూముల్లో అక్రమంగా జొరబడే వారిని అరెస్టు చేసి, వారికి విరుద్ధంగా చార్జిషీట్లు దాఖలు చేయడానికి తగు చర్యలు చేపట్టడం.

10) ఇంకా నేరాలు చేసేవారిని గురించిన ఫిర్యాదుల నిమిత్తం ఎస్.సి. ఎస్.టి. సెల్ ఏర్పాటు, ఆయా కేసులని త్వరితంగా విచారింపచేయడం, బాధితులకి తగిన ఆర్థిక సాయం అందించడం, రాష్ట్ర రాజధానిలో డిజిపి ఆధ్వర్యంలో ఎస్.సి. ఎస్.టి. రక్షణ సెల్ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టడం.

**సాంఘిక సంక్షేమ శాఖ:** రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల వారి బాగు కోసం, వారి అభ్యున్నతి కోసం రకరకాల చర్యలు చేపడుతోంది.

గ్రామాలలో ఆర్.డి.ఓ., ఎం.ఆర్.ఓ. వంటి వివిధ స్థాయి అధికారుల ప్రోద్బలంతో అసమానతలని తొలగించడం, ఉల్లంఘనల విషయంలో విచారణలు చేపట్టడానికి డి.ఎస్.పి. స్థానంలో సబ్ ఇన్స్పెక్టర్, ఇన్స్పెక్టర్‌ల నియామకానికి భారత ప్రభుత్వానికి సిఫార్సు చేయడం, అల్లర్లు జరిగే ప్రాంతాల గుర్తింపు, అన్ని వర్గాల, జాతుల వారితో శాంతి సంఘాలను స్థాపించడం, షెడ్యూల్డు కులాలపై అత్యాచారాలకి గురైన వారికి అర్థిక సాయం, జిల్లా మెజిస్ట్రేటు ద్వారా త్వరితంగా చర్యలు చేపట్టడం.

అనుభవజ్ఞులైన సీనియర్ అడ్వకేట్లతో జిల్లా స్థాయి పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ప్యానెల్ ఏర్పాటు, 10 సంవత్సరాల కంటే తక్కువ కాని ప్రాక్టీసు ఉన్న అడ్వకేట్లతో శాంతిభద్రతల సమీక్షలు జరిపించడం, ప్రభుత్వ సెక్రటరీల స్థాయిలో నోడల్ అధికారుల నామినేషన్, అల్లర్ల ప్రాంతాలలో జిల్లా కలెక్టరు, మేజిస్ట్రేట్‌లు, ఎస్.పి వంటి ఉన్నత అధికారుల పర్యటనలు జరిపించడం, బాధితులకి అప్పటికప్పుడు నగదు రూపంలో పరిహారం చెల్లింపుకి ఏర్పాట్లు, అవసరమైన మేరకు సహాయ, పునరావాస చర్యలు చేపట్టడం, అటువంటి అంశాల నివేదిక స్పెషల్ కోర్టుకి అందించడం, అత్యధికంగా అల్లర్లు జరిగిన ప్రాంతాలలో స్పెషల్ ఆఫీసర్ల నియామకం, సహాయక చర్యల నిమిత్తం మోడల్ ప్రణాళికలు సిద్ధం చేయడం.

రూ॥ 30,000/- ఆర్థిక సాయంతో పాటు పక్కా గృహాలు నిర్మించి అందించడం, షెడ్యూల్డు కులాలకి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబానికి నష్ట పరిహారం, అర్హత కలిగిన ఒక సభ్యుడికి ఉద్యోగం కల్పించడం, కుటుంబ సభ్యులకి మెయింటెనెన్స్ చెల్లింపు, చట్టపరమైన సర్దుబాట్ల ప్రకటనలు, షెడ్యూల్డు కులాల ఫైనాన్స్ కార్పొరేషన్ భాగస్వామ్యం వంటివి కొన్ని ప్రముఖమైనవి.

షెడ్యూల్డు కులాల ఫైనాన్స్ కార్పొరేషన్ భాగస్వామ్యం వంటివి కొన్ని ప్రముఖమైనవి.

**సాధారణ పరిపాలనా శాఖ:** చట్టాలని రూపొందించడం ముఖ్యమే, అయితే వాటిని అమలు జరిపించడం అంతకంటే ముఖ్యం అప్పుడే వాటి తాలూకు ఫలాలు, ఫలితాలు అవసరమైన వారికి దక్కడం సాధ్యపడుతుంది. షెడ్యూల్డు కులాల వారి అభ్యున్నతి కోసం ఈ శాఖ చేపడుతున్న పనుల సారాంశం గమనిద్దాం: ఒక్కో గ్రామానికి మూడు అసమానతల తొలగింపు చొప్పున షెడ్యూల్డు కులాల వారికోసం ప్రతి నెల 30వ తేదిన " పౌర హక్కుల దినోత్సవం " పాటింపు వంటివి ఉన్నాయి.

**రెవెన్యూ శాఖ:** షెడ్యూల్డు కులాల వారి విషయంలో అసమానతల తొలగింపు కోసం జిల్లా ప్రకారం అన్ని అవసరమైన చర్యలూ చేపట్టాలి. భూ గరిష్ఠ పరిమితి చట్టం కింద లభ్యమయిన మిగులు భూముల పంపిణీ జరపడం ఒక ముఖ్యమైన అంశం అయితే, వివిధ ప్రభుత్వ మెమోల ఆచరణతో వివాదాల పరిష్కారం దిశగా పనులు జరగనున్నాయి. ఇంకా, ప్రభుత్వ బంజరు భూములని భూస్వాముల చేత ఖాళీ చేయించడం, అక్రమ ఆక్రమణల నుండి రక్షణ కల్పించడం, అగ్ర హిందువులు ఆక్రమించుకున్న శ్మశానాలు, ఫుట్‌పాత్‌లని తిరిగి ఇవ్వడం వంటి పనులు కూడా ఊపందుకోనున్నాయి.

# మనం సూక్ష్మజీవుల కొలువులం

**జీర్ణాశయం, చిన్నపేగు ముందు భాగంలో జీర్ణరసాలు శక్తివంతంగా పనిచేస్తూ ఉండడం వల్ల అక్కడ సూక్ష్మజీవులు దాదాపు ఉండవు. కానీ, చిన్నపేగు చివరి భాగంలో మాత్రం అసంఖ్యాకంగా బ్యాక్టీరియా ఉంటాయి. తల్లిపాలు తాగే శిశువులలో బైఫిడో బ్యాక్టీరియం జాతులు ఉంటాయి. పాలు మానగానే ఈ బ్యాక్టీరియా స్థానంలో ఎశ్చరీషియా, ఫ్యూసోబ్యాక్టీరియం, యూబ్యాక్టీరియంలు అభివృద్ధి చెందుతాయి. మన చిన్నపేగులలో నిత్యం నివసించే బ్యాక్టీరియా జాతులు దాదాపు యాభై వరకూ ఉన్నాయి. అయితే అవి మనకు ఎటువంటి హానీ కలిగించవు. పైగా వాటిలో కొన్ని మనకు అవశ్యకమైనవి కూడా!**

**మ**నం రోజూ మన శరీరాలను శుభ్రం చేసుకుంటాం. ఆ మాటకొస్తే రోజులో చాలాసార్లు శుభ్రం చేస్తాం. అయినా సరే... మనం పరిశుభ్రంగా ఉన్నామని కరాఖండిగా చెప్పేందుకు జంకుతాం. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని ప్రత్యేక వసతులు కల్పిస్తే తప్ప మనలో ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాధికారక సూక్ష్మజీవుల బారిన పడుతుంటాం. అయితే ఆ కారణంగా వ్యాధి రావాలన్న నియమం ఏదీ లేదు. నిజానికి చాలావరకు అసలు వ్యాధులే రావు. కానీ నమ్మండి నమ్మకపోండి – మనపై కనీసం 75 రకాల సూక్ష్మజీవులు ఎప్పుడూ ఉంటాయి. అవి మన తల, చర్మం, నోరు, ముక్కు, గొంతు, పేగులు వంటి అవయవాలలో నివసిస్తాయి.

మన శరీరం సూక్ష్మక్రిముల దాడిని తట్టుకునే విధంగా పటిష్టంగా రూపొందింది. చర్మంపైన సూక్ష్మక్రిములు జీవించడానికి అనువైన వాతావరణం ఉండదు. అయినా టాఫిలోకోకస్ ఎపిడర్మిస్, ఎసినెటో బాక్టర్ కాల్కో ఎసెటికస్, ఎశ్చరీషియా కోలై వంటి  బ్యాక్టీరియా ఉంటాయి. మనం ఎన్నిరకాల సబ్బులు వాడినా చర్మంపై సూక్ష్మక్రిములు సంపూర్ణంగా సమసిపోవు.

చర్మంలో తైలగ్రంథులూ, శ్వేదగ్రంథులూ వేర్వేరు క్రియలు వేరే కారణాలకోసం నిర్వహిస్తున్నా, వాటి స్రావాలు సూక్ష్మక్రిములకు అభివృద్ధి కేంద్రాలు. చర్మం నునుపుగా, తేమను నిలువ చేసుకునేందుకు తైల గ్రంథుల స్రావం ఉపయోగపడుతుంది. అలాగే, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు చెమట పడుతుంది. కానీ వాటి వల్ల సూక్ష్మజీవులు వచ్చి చేరతాయి. వాటిలోనే స్థిర నివాసాలేర్పరచుకుంటాయి. మొటిమలు వంటివి (ఏక్నీ) తైలం ఎక్కువై సూక్ష్మజీవులు పేరుకోవడం వల్ల వచ్చేవే! యుక్తవయసులో చెంపలపై కందిపోయినట్టు ఉండే పరిస్థితికి కారణం యాక్నీ వల్గారిస్.

మన శ్వాస ద్వారా నిత్యం ఎన్నో సూక్ష్మజీవులను మనం పీల్చుకుంటూవుంటాం. కానీ ఆ జీవులను మన ఊపిరితిత్తుల నుండి పల్చని శ్లేష్మం తీసేస్తుంది. అందువల్ల ఊపిరితిత్తులు సాధారణంగా ఎటువంటి సూక్ష్మక్రిములు లేకుండా ఉన్నా, వాటి పైనున్న కంఠనాళం, గొంతు మాత్రం అనేక క్రిములకు నెలవు. నోటిలో స్ట్రెప్టోకోకస్ సలైవారిస్, బుగ్గల లోపలి వైపు స్ట్రెప్టోకోకస్ మైటిస్, పళ్లపై గార పుట్టించే స్ట్రెప్టోకోకస్ మ్యూహన్స్... ఇలా అనేక క్రిములు కొలువై ఉంటాయి. దంతాలు, చిగుళ్ల కలిసే ప్రదేశంలో బ్యాక్టీరియాలు, ఫ్యూసోబాక్టీరియం, ట్రిపోనీమా జాతులు పెరుగుతాయి. ఇక గొంతులో స్ట్రెప్టోకోకస్, కొరైనో బ్యాక్టీరియం వంటి క్రిములుంటాయి. అయితే వీటివల్ల వ్యాధులేవీ రావు.

జీర్ణాశయం, చిన్నపేగు ముందు భాగంలో జీర్ణరసాలు శక్తివంతంగా పనిచేస్తూ ఉండడం వల్ల అక్కడ సూక్ష్మజీవులు దాదాపు ఉండవు. కానీ, చిన్నపేగు చివరి భాగంలో మాత్రం అసంఖ్యాకంగా బాక్టీరియా ఉంటాయి. తల్లిపాలు తాగే శిశువులలో బైఫిడో బ్యాక్టీరియం జాతులు ఉంటాయి. పాలు మానగానే ఈ బ్యాక్టీరియా స్థానంలో ఎశ్చరీషియా, ఫ్యూసోబ్యాక్టీరియం, యూబ్యాక్టీరియంలు అభివృద్ధి చెందుతాయి. మన చిన్నపేగులలో నిత్యం నివసించే బ్యాక్టీరియా జాతులు దాదాపు యాభై వరకూ ఉన్నాయి. అయితే అవి మనకు ఎటువంటి హానీ కలిగించవు. పైగా వాటిలో కొన్ని మనకు ఆవశ్యకమైనవి కూడా!



శిశువు తల్లి గర్భంలో రూపొందే వరకూ సూక్ష్మక్రిమి రహితంగానే ఉంటుంది. తల్లి శరీరంలో నుండి బయటికి వస్తూనే చర్మంపై సూక్ష్మక్రిములు చేరిపోతాయి. క్రమంగా అవి నోరు, ముక్కు, గొంతులో నివసిస్తాయి.

ఇంత భారీ మోతాదులో సూక్ష్మజీవులున్నా, మనం భయపడవలసిన అవసరం లేదు. నిజానికి వాటిలో చాలా వరకు పరోక్షంగా మనకు మంచి చేస్తాయి. వాటిని మనం బలవంతంగా తొలగిస్తే అసలు హానికరమైన వాటికి చోటిచ్చినట్టే! విపరీతంగా సబ్బు వాడకం, యాంటీబయాటిక్‌ల వాడకం వల్ల జరిగేది అదే. అవి విచక్షణా రహితంగా మనపై స్థిరనివాసమేర్పరుచుకున్న వందలాది సూక్ష్మజీవుల కాలనీలను రూపుమాపుతాయి. అదే అదునుగా వ్యాధికారక క్రిములు దాడి చేస్తాయి.

**-కాకర్లమూడి విజయ్**

# నవ్వుల్ - పువ్వుల్

## మంచి నాన్న

**రఘు :** నన్ను లక్షాధికారిని చేయాలని మా నాన్న తెగ కష్టపడి పోతున్నాడ్రా.

**వేణు :** అవునా! మీ నాన్న చాలా మంచివాడ్రా.

**రఘు :** అవునురా కానీ నేను ఇంతకుముందు కోటీశ్వరుడునిరా!

## టైమ్

**డాక్టర్ :** ఏంటి విసిగిస్తున్నావు. నా క్లినిక్ సాయంత్రం 7 గంటల నుండి 9 గంటల వరకు మాత్రమే తెరిచి వుంటుందని తెలియదా?

**రోగి :** మీ క్లినిక్ టైములు నాకైతే తెలుసు డాక్టర్‌గారు. కానీ నన్ను కరిచిన ఆ కుక్కకేమి తెలుస్తుంది చెప్పండి.

## నాన్న కథ

**కొడుకు :** ఏదైనా కథ చెప్పమ్మా. నిద్ర పట్టడం లేదు.

**అమ్మ :** కొంచెం సేపు ఆగమ్మా! మీ నాన్నగారు వస్తారు. 'ఆలస్యం ఎందుకైంది?' అని ఒక్క ప్రశ్న వేస్తే చాలు బోలెడన్ని కథలు వినిపిస్తారు.

## దిగులు

**రామారావు :** నా భార్య పేర 5 లక్షలు... నా కూతురి పేర బంగ్లా... నా కొడుకు పేర 25 ఎకరాల పొలం రాసేశాను.

**చలపతి :** మరి దేనికి దిగులుగా వున్నావు?

**రామారావు :** ఇవన్నీ ఎలా సంపాదించాలా అని!

**- ఎం.ఎల్.నారాయణ**

## నిజాయితీ

**రామయ్య :** నాకు నిజమైన నిజాయితీ గల కొడుకు వున్నాడు. మావాడు తాగుబోతు కాదు, సిగరెట్లు తాగడు, అమ్మాయిలతో తిరగడు.

**సీతయ్య :** ఆహా! నిజమా? ఎంత వయస్సు మీ వాడికి?

**రామయ్య :** ఈ రోజుతో 13 నెలలు.

## శుభవార్త

**డాక్టర్ :** నీకు ఒక శుభవార్త, ఒక దుర్వార్త

**రోగి :** శుభవార్త ఏమిటో చెప్పండి డాక్టర్.

**డాక్టర్ :** నీకు మరో 24 గంటలు మాత్రమే ఆయుష్షు

**రోగి :** మరి దుర్వార్త ఏంటి?

**డాక్టర్ :** నిన్న నీకు ఈ విషయం చెప్పడం మర్చిపోయాను.

## పంచదార

**టీచర్ :** వెంకటేష్ వెస్ట్‌ఇండీస్‌లో ప్రధానపంట ఏది?

**గోపి :** నాకు తెలియదండి.

**టీచర్ :** పంచదార మనం ఎక్కడినుండి తెచ్చుకుంటాం.

**గోపి :** మా పక్కంటి నుండి.

## పేదవారు

**(బిల్‌గేట్స్ దేవుణ్ణి కోరుతున్నాడు)**

**బిల్‌గేట్స్ :** దేవా నన్ను అత్యంత పేదవాడిగా మార్చు.

**దేవుడు :** భారత దేశంలో మీ వ్యాపారాలు ఆపెయ్.

**బిల్‌గేట్స్ :** నన్ను పేదవాడిగా చేయమన్నానే గానీ అడుక్కునేవాడిగా కాదు.

అట్టమీది కథ




# మారని కథ! తీరని కల!!

- రెంటాల జయదేవ

**ఎక్కడ వేసిన గొంగళి అక్కడే! బహుశా ఈ జాతీయం తెలుగు సినిమా కథకు వర్తించినంతగా మరొక దానికి వర్తించదేమో! 78 ఏళ్ళు నిండిన తెలుగు టాకీ ఇప్పటికీ కథల విషయంలో వేగంగా పురోగమిస్తున్న దాఖలా కనబడడం లేదు. మరీ ముఖ్యంగా గడిచిన కొన్నేళ్ళుగా తెలుగు సినిమా కథ అలవాటైన చోటే గిరి గీసుకొని కూర్చుంది. కొత్త బరిలోకి ప్రవేశించడానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం లేదు.**

ఒకప్పుడు సినిమా నిర్మాతల అభిరుచికి నిదర్శనం. కొన్నాళ్ళయ్యాక అది దర్శక - రచయితల సృజనశీలతకు దర్పణం. కానీ, ఇటీవలి కొద్ది సంవత్సరాలుగా మాత్రం తెలుగు సినిమా హీరోల ఇమేజ్ ఊబిలో చిక్కుకొని, గిజగిజలాడుతోంది. తాజాగా వస్తున్న తెలుగు చిత్రాలు అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా మారాయి. గతంలో కథానాయకులకు దర్శక - రచయితలే శాసనకర్తలు. వారు సృష్టించిన కథలో, పాత్రలో ఒదిగిపోవడానికి ప్రయత్నించేవారు. అందుకే, ఎన్టీఆర్, ఏయన్నార్ లాంటి అప్పటి అగ్ర నటులు విభిన్నమైన పాత్రలు పోషించగలిగారు. మొత్తం కథలో తమ పాత్రను ఓ భాగంగా చూసేవారే తప్ప, తమ పాత్ర చుట్టూరానే కథ నడవాలన్న పిడివాదానికి పోలేదు. అందుకనే వారు గ్లామర్ లేని పాత్రలను సైతం ధైర్యంగా పోషించారు. ప్రేక్షకులను మెప్పించారు. 'కలసి ఉంటే కలదు సుఖం'లో ఎన్టీఆర్ అంగ వికలుడిగా నటించినా, 'అర్ధాంగి'లో ఏయన్నార్ మేదకుడి పాత్ర పోషించినా అదే కారణం!

### కథాశిల్పులు కానరారేం?

ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే, 1990ల ముందు ప్రేక్షకులపై ప్రగాఢముద్ర వేసిన సినిమాలు, పాత్రలు తెలుగులో అనేకం కనిపిస్తాయి. కె.వి. రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు, కె. విశ్వనాథ్, జంధ్యాల లాంటి ప్రతిభావంతులైన దర్శకులు బలమైన పాత్రలనూ, పాత్ర చిత్రణలనూ సృష్టించారు. ఒక్క నాయక పాత్రనే కాక, కథాసందర్భంలో కలసివచ్చే చిన్న చిన్న ఇతరేతర పాత్రలను సైతం చిరకాలం నిలిచేలా శిల్పంలా చెక్కడం వారి సినీ సృజనలోని విశిష్టత. 'మాయాబజార్'లోని లంబు - జంబు పాత్రలు కానీ, 'శంకరాభరణం'లో కర్ణాటక సంగీతాన్ని ఆధునిక శైలిలో చిత్రవధ చేసే దాసు పాత్ర కానీ - ఇవాళ్టికీ ఏళ్ళు గడిచినా మరుగునపడకుండా గుర్తుండిపోవడానికి అదే కారణం!

సరిగ్గా అలాంటి ప్రయత్నమే ఇవాళ కొరవడింది. ఫలితంగా, ఎవరి సినిమా అయినా, ఏ హీరో పోషిస్తున్న పాత్ర అయినా దాని పోకడ, ప్రవర్తన ఒకే మూసలోకి జారిపోతోంది. అదేమంటే, మాస్ కోసం నిర్మించే వాణిజ్య పంథా చిత్రాలకు ఇది తప్పదంటూ వితండవాదం లేవదీస్తున్నారు. ఆ మాటకొస్తే, 1970ల ద్వితీయార్ధం నుంచి ప్రముఖ దర్శకులుగా వెలుగొందిన కె. రాఘవేంద్రరావు, దాసరి నారాయణరావులు సైతం వాణిజ్య పంథా చిత్రాలే తీశారు. కానీ, అందులోనూ తమదైన ముద్ర చూపించగలిగారు. ఆరు పాటలు, మూడు ఫైట్ల ఫార్ములా బాణీలో చిత్రాలు తీసినప్పుడు కూడా కథానాయకుడి పాత్రలోనో, కథాంశంలోనో మెరుపు, మలుపు ఉండేలా జాగ్రత్తపడుతూ వచ్చారు. 'అడవి రాముడు' దగ్గర నుంచి 'జగదేకవీరుడు - అతిలోక సుందరి' వరకూ అత్యధిక భాగం ఫార్ములా చిత్రాలు తీసినా, రాఘవేంద్రరావు దీర్ఘకాలం దర్శకుడిగా నిలిచిందీ, ప్రేక్షకుల మనస్సు గెలిచిందీ అందుకే!

1970ల ద్వితీయార్ధం నుంచి 1990ల చివరి వరకు తెలుగు సినిమా పూర్తిగా వాణిజ్య ఫార్ములా చట్రంలోనే పరిభ్రమిస్తూ వచ్చింది. అయితే, ఆ పాతికేళ్ళ కాలంలోని ఓ వైచిత్రి ఏమిటంటే, కమర్షియల్ దోవలోనే భిన్నమైన

కోవల సినిమాలను రూపొందించే పలువురు దర్శకులు ఏకకాలంలో కొనసాగడం! విశ్వనాథ్, బాపు, దాసరి, రాఘవేంద్రరావు, జంధ్యాల, కట్టా సుబ్బారావు, క్రాంతికుమార్, కోడి రామకృష్ణ – ఇలా ఎందరో పరస్పరం భిన్నమైన ధోరణిని అనుసరిస్తూనే ఒకే సమయంలో తెలుగు సినిమాకు విజయాలు అందించగలిగారు.

### అన్నీ ఆ తాను గుడ్డలే!

కానీ, ఆ తరువాతి నుంచి పరిస్థితి మారుతూ వచ్చినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా 2000 తరువాత నవతరం హీరోలు, దర్శకులు కేంద్ర బిందువులుగా మారాక తెలుగునాట కమర్షియల్ సినిమా పూర్తిగా ఒక్క మూసకే పరిమితమైంది. హీరోలు, దర్శకుల పేర్లు వేరైనా, సినిమాలన్నీ ఒకే తానులోని గుడ్డలుగా మారిపోయాయి. అందరి సినిమాలూ ఒక్కలానే మారాయి. ప్రేక్షకుడు ఏ హాలులో ఏ హీరో సినిమాకు వెళ్ళినా, వాటి నడక ఒకే తీరుగా మారిపోయింది. తెలుగు చిత్రాల విజయాల శాతం తగ్గడానికి ఒక రకంగా ఇది కూడా కారణం అనిపిస్తుంది.

ప్రస్తుతం చక్రం తిప్పుతున్న అగ్రశ్రేణి కమర్షియల్ దర్శకుల జాబితాలో అరడజనుకు పైగా పేర్లు మనకు కనిపిస్తాయి. వీరందరూ కమర్షియల్ చిత్రాల రూపకర్తలే. నిజానికి, వీరి సినీ సృజన శైలి, చిత్రీకరణ పద్ధతి కూడా పరస్పరం భిన్నమైనవే. కానీ, వీరెవరూ మునుపటి తరంలా భిన్నమైన తరహా చిత్రాల జోలికి పోవడం లేదు. ఎవరు తీసినా ఒకే ఫార్ములా కథలనే ఆశ్రయిస్తున్నారు. దాంతో, టేకింగ్‌లో తేడా తప్ప, కథల్లో, పాత్రల్లో కొత్తదనం కనిపించడమే లేదు. ఇంకా నిశితంగా చెప్పాలంటే, పాత ఫార్ములా హిట్ కథలనే కొత్త రీళ్ళ కెక్కించి, వెండితెరపై వండి వారుస్తున్నారు.

### కథ ఒకటే, చిత్రాలు అనేకం!

ఆ మధ్య బాలకృష్ణ నటించిన 'ఒక్క మగాడు' చిత్రం గతంలో హిట్టయిన 'భారతీయుడు'కు నకలే! ఇటీవల సంక్రాంతికి వచ్చి, సక్సెసైన 'అదుర్స్' కూడా గతంలో చాలా సార్లు వచ్చిన ఫార్ములా కథే. చిన్నతనంలో విడిపోయిన కవల సోదరులు సినిమా సగంలో తమ బాంధవ్యాన్ని తెలుసుకొని, ఆఖరుకు తమ తండ్రిని రక్షించుకోవడమనే పాత ఫార్ములా కథనే జూనియర్ ఎన్టీఆర్ హీరోగా (ఇదే ఆయనకు తొలి ద్విపాత్రాభినయ చిత్రం) వండారు. ఫ్యాక్షనిజమ్ నేపథ్యంలోని కథలు, విలన్‌ను ఎదిరించి ప్రేమను సాధించుకొనే కథలు వేర్వేరు టైటిళ్ళు, వేర్వేరు కాంబినేషన్లతో వస్తూనే ఉన్నాయి. శత్రువు ఇంటిలోనే ఆశ్రయం పొంది, అక్కడ తన మంచి పనులతో వారిలో పరివర్తన తీసుకువచ్చి, పగతో రగులుతున్న ఆ కుటుంబానికీ, తమ కుటుంబానికీ మధ్య సయోధ్య కుదిర్చే హీరో కథ కూడా చాలాసార్లు చూసినదే! (రచయిత వీరూ పోట్ల దర్శకుడిగా పరిచయమైన మంచు మనోజ్‌కుమార్ తాజా చిత్రం 'బిందాస్... అజయ్ గాడి విజయ గాథ' కథ కూడా అదే!).

అలాగే, ఒక హీరో ఒక తరహా పాత్రతో, ఒక తరహా కథతో విజయం సాధిస్తే చాలు! ఇక కొద్దిపాటి మార్పులతో అదే తరహా కథలు, పాత్రలతో అతడి మీద ఆ ముద్రే కొనసాగేలా చేయడం పరిశ్రమలో పరిపాటి అయింది. ఫ్యాక్షన్ తరహా యాక్షన్ పాత్రల్లో యువ హీరో గోపీచంద్ పేరు తెచ్చుకున్నారు. 'యజ్ఞం' లాంటి చిత్రాల్లో ప్రేక్షకులూ ఆదరించారు. దాంతో, ఆయన తరువాతి చిత్రాలు కూడా వరుసగా అదే బాణీలో వచ్చాయి. చివరకు గత ఏడాది వచ్చిన అరిగిపోయిన సీమ ఫార్ములా సినిమా 'శంఖం' ఘోరంగా దెబ్బతినే దాకా పరిస్థితి వచ్చింది. కథను మూస ధోరణిలో నడిపిస్తూ, అక్కడక్కడా బలవంతంగా మలుపుల్ని జొప్పించి, అదే కొత్తదనం అనుకొనే మనవాళ్ళకు ఇలాంటి పరాజయాలు పెద్ద గుణపాఠాలు.

అందుకే, ఫార్ములా కథ అయినా సరే, ఏ కొద్దిగానైనా ఆకర్షణీయంగా చెప్పడం తప్పనిసరి. అలా చేసినప్పుడు పాత కథలను కూడా జనం పెద్ద మనసుతో చూస్తూనే ఉన్నారు. కాసులు కురిపిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'యమదొంగ' 1960ల నాటి 'దేవాంతకుడు', 1970ల నాటి 'యమగోల' చిత్రాలకు ఆధునిక అనుకరణే! ఆ మాటకొస్తే కొన్నేళ్ళ క్రితం బాక్సాఫీస్ రికార్డును తిరగరాసిన 'పోకిరి' సైతం దొంగల్లో ఒకడిలా తిరుగుతూ, ఆఖరి క్షణంలో పోలీసునని బయటపెట్టే కథానాయకుడి కథే! తాజా రికార్డు 'మగధీర' కూడా కొత్త సీసాలో పాత సారాయే! గత జన్మ తాలూకు ప్రేమ, పగల స్మృతులు ఈ జన్మలో కూడా కొనసాగడమనే పాత ఫార్ములాకు ఆకర్షణీయమైన జానపద నేపథ్యం జోడిస్తే ఆ చిత్రం తయారైంది. అయితే, గ్రాఫిక్స్ వగైరా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆ సినిమాను ఘన విజయం దిశగా నడిపించాయి.

ఇక, పవన్ కల్యాణ్‌కు 2008లో వచ్చిన 'జల్సా'యే ఇప్పటికీ ఆఖరి చిత్రం. 2007 అక్టోబర్ 18న వచ్చిన 'అతిథి' తరువాత ఇప్పటి దాకా మహేష్‌బాబు నటించిన మరో సినిమాయే రాలేదు. చిన్న ఎన్టీయార్‌కు 2008 నాటి 'కంత్రి' తరువాత 2009లో సినిమాయే రాలేదు. ఎట్టకేలకు మొన్న సంక్రాంతికి 'అదుర్స్'తో జనం ముందుకొచ్చారు. ఇలా చాలామంది అగ్ర తారలు గత ఏడాది తెరపై కనపడలేదు. చాలా మంది హీరోలు ఇలా ఏడాదికో,



ఏణ్ణర్థానికో ఒక సినిమా చేస్తున్న సమయంలో, రవితేజ ('కిక్', 'ఆంజనేయులు'), ప్రభాస్ ('బిల్లా', 'ఏక్ నిరంజన్'), జగపతిబాబు ('బంగారు బాబు', 'ప్రవరాఖ్యుడు'), 'అల్లరి' నరేష్('ఫిటింగ్ మాస్టర్', 'బెండు అప్పారావు') తదితర హీరోలే ఈ ఏడాది ఒకటికి రెండు చిత్రాల్లో నటించారు.

### కోరి ఎంచుకున్న కథలూ అదే మూసలో!

గమ్మత్తయిన విషయం ఏమిటంటే, అగ్ర హీరోలు ఇంతింత కాలం ఆగి, కోరి ఎంచుకొని నటిస్తున్న చిత్రాల్లో కూడా కథలో కొత్తదనం లేకపోవడం! వారు నటించగా విడుదలవుతున్న చిత్రాలే ఏడాదికి ఒకటీ, అరా! తీరా చూస్తే, విడుదలైన ఆ ఒక్క చిత్రం కూడా అంతకు ముందెప్పుడో వచ్చేసిన అనేక చిత్రాల కలగూరగంపే! అదేమని గట్టిగా నిలదీస్తే, కథ పాతదైనా, క్యారెక్టరైజేషన్ కొత్తదనీ, టేకింగ్ విలక్షణమైనదనీ ఊకదంపుడు కబుర్లు చెప్పేస్తారు. అయితే, ఇటీవలి కాలంలో అంత బలమైన పాత్రలు కానీ, పాత్ర చిత్రణలు కానీ వెండితెరపై కనిపించిన దాఖలాలు లేవు. గత ఏడాది విడుదలైన చిత్రాలను గమనిస్తే, కథ, కథనాల్లో పెద్ద మార్పులేమీ రాలేదు. పోనీ, విజయాలైనా వచ్చాయా అంటే, అదీ కనాకష్టమే! సక్సెస్ సంగతికొస్తే, నిర్మాణ, పంపిణీ, ప్రదర్శక శాఖలు మూడింటికీ లాభాలు తెచ్చిపెట్టిన చిత్రాలు – 'అరుంధతి', 'మగధీర', 'రైడ్', 'గోపి గోపిక గోదావరి', 'బెండు అప్పారావు' లాంటి కొన్నే! మిగిలిన చిత్రాల్లో అత్యధిక భాగం ఏదో ఒక శాఖకు చేదు రుచి చూపెట్టినవే!!

### గత ఏడాది నేర్పుతున్న గుణపాఠం

మొత్తం మీద, గడచిన ఏడాది కూడా తెలుగు చిత్రసీమకు వ్యాపారపరంగా బాగా లేదన్నది నిష్ఠురమైన నిజం. కొన్నేళ్ళుగా కొనసాగుతున్న థియేటర్ల గుత్తాధిపత్యం మాఫియా వల్ల బయ్యర్ల వ్యవస్థ 2009లో మరింత బలహీనపడింది. మరోపక్క క్రికెట్, వరదలు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు, తడిసి మోపెడైన నిత్యావసర వస్తువుల రేట్లతో అనూహ్యంగా పెరిగిన నెలవారీ ఖర్చు లాంటి కారణాలు ఏమైనా సామాన్య జనం సినిమాలు చూడడానికి అనువైన, ఆహ్లాదకరమైన వాతావరణం లేకుండా పోయింది. దాంతో 'అరుంధతి', 'మగధీర'లను మినహా మిగిలిన వాటికి తెలుగు సినిమా సత్తాకు తగిన వసూళ్ళు రాలేదు. ఏతావతా, చిత్రపరిశ్రమలో ఓ స్లంప్ కాని స్లంప్ నెలకొన్నదంటే అతిశయోక్తి కాదు.

ఈ తాజా పరిస్థితులనూ, పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, హీరోలు, చిత్ర రూపకర్తలు తమ భవిష్యత్ ప్రణాళికలనైనా పకడ్బందీగా రచించుకోవడం అవసరం. విభిన్నమైన పాత్రలు, కథలతో సినిమాలు రూపొందించాలి. కేవలం ఆరు పాటలు, నాలుగైదు ఫైట్లు, కాసిని కామెడీ సీన్లతో రొటీన్ కథను తెరకెక్కించి, ప్రేక్షకుల్ని మెప్పించాలనుకోవడం అవివేకమని ఇప్పటికైనా గుర్తించాలి. లోతుగా పరిశీలిస్తే, గత ఏడాది ఘనవిజయం సాధించిన 'అరుంధతి, 'మగధీర', '2012 – యుగాంతం' చిత్రాలు మూడూ – కథాంశాన్నీ, గ్రాఫిక్స్ వగైరా సాంకేతిక పరిజ్ఞానాన్నీ నమ్ముకొని, భారీ బడ్జెట్‌లో తీసినవే తప్ప, తారలను నమ్ముకొన్నవి కావు! ఇలాంటి సాంకేతిక శ్రమకు, పాత్రల తీరుతెన్నుల్లోని నిర్దుష్టత తోడైతే ఆ సినిమాలు చిరస్థాయిలో నిలిచిపోతాయి. ఆ దిశగా మన సినీ సృజనశీలురు కృషి చేయాలి.

ఎంత కాలక్షేపం కోసం సినిమా చూసినా సరే, అందులో ఇలా ఏదో ఒక కొత్తదనం లేకపోతే, జనం మునుపటిలా హాళ్ళకు రావడం కష్టమే. అందుకే, సక్సెసైన చిత్రాల కథాంశాన్నో, నేపథ్యాన్నో అనుసరించడానికి పరిమితం కాక, ఆ చిత్రాల అంతర్లీన విజయసూత్రాన్ని గ్రహించడం ముఖ్యం. ఆ దిశగా పయనించినప్పుడే వసూళ్ళలోనే కాక, విజయాల శాతంలో కూడా తెలుగు సినిమా ముందంజ వేస్తుంది. అప్పుడే పరిశ్రమకు మళ్ళీ మంచి కాలం వస్తుంది. ఆ కల నెరవేరే రోజు కోసం ఎదురుచూద్దాం! ★

## కొత్తదనమంటే కొత్త టెక్నాలజీయేనా?

ఇప్పుడు మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నం. నవ తరం హీరోలు తమ ఇమేజ్‌ను పెంచి పోషించే కథలకే ఓటేస్తున్నారు. పాత ఫార్ములా పాత్రలనే పదే పదే పోషిస్తున్నారు. ఆ పాత కథలనే ఎంత కొత్తగా చెప్పామన్న దానిపై దర్శకులు దృష్టి పెడుతున్నారు. అయితే పాత్రల రూపకల్పనలోనో, నట వైదుష్యంలోనో కాక, ఆధునిక సాంకేతిక వినియోగంలోనే ఆ కొత్తదనం ఉంటోంది. ఫలానా కొత్త రకం కెమేరా వాడామనో, కొత్త పద్ధతి ఎడిటింగ్ విధానం అనుసరించామనో, ఇన్ని నిమిషాల కంప్యూటర్ గ్రాఫిక్స్ వాడామనో మనవాళ్ళు గొప్పగా చెప్పకోవడంతో సరిపెడుతున్నారు. వెరసి జిమ్మీజిబ్ క్రేన్ షాట్లు, ర్యాంప్ షాట్లు, గ్రాఫిక్స్‌లో చూపిస్తున్న వినూత్నతే సినిమాలోని కొత్తదనంగా సంబరపడిపోవాల్సి వస్తోంది. స్క్రిప్టులో కొత్తదనం కోసం చేస్తున్న ప్రయత్నాలు అరుదే!



## తెర మరుగునే తారా తోరణం

ప్రతి చిత్రం విజయం సాధించడమే తమ లక్ష్యమంటున్న హీరోలు అతి జాగ్రత్తకు పోతున్నారు. సరైన స్క్రిప్టు కోసం చూస్తున్నామంటూ, నెలల సమయం గడిపేస్తూ, ఏడాదికి ఓ సినిమాలో కనిపించి, శ్రమ పడిపోతున్నట్లు భావిస్తున్నారు. ఇమేజ్ చట్రంలో ఇరుక్కుపోయిన హీరోలు ఇలా కథల కోసం వేట అంటూ కాలం గడిపేయడం గత ఏడాది విచిత్రమైన ప్రభావమే చూపింది. తారల చుట్టూ తిరిగే తెలుగు సినీ పరిశ్రమలో గమ్మత్తుగా దాదాపు అగ్రహీరోల చిత్రాలేవీ విడుదల కాని సంవత్సరంగా 2009 ప్రత్యేకంగా నిలిచింది. 2008 డిసెంబర్‌లో వచ్చిన 'కింగ్' తరువాత నాగార్జున నటించిన మరే చిత్రం రాలేదు. గడిచిన 24 ఏళ్ళ నాగ్ కెరీర్‌లో ఒక్క చిత్రం కూడా విడుదల కాని ఏడాది 2009 అంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ 2010 ఫిబ్రవరి 12న కానీ 'కేడీ'గా నాగ్ మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాలేదు.





వికాసం

# పరీక్షల సమయంలో ఆహారం

**'ఏమీ తినకుండా పొద్దున పరీక్ష ఎలా రాద్దామని?', 'కొంచెం తినవే పరీక్ష రాయడానికి ఓపికుంటుంది', 'పరీక్ష సమయానికి నీరసమొస్తే సంవత్సరమంతా చదివింది వృథా అవుతుందమ్మా కాస్త తినరా'... వంటి మాటలు మార్చి వచ్చిందంటే ప్రతి ఇంట్లోనూ వినిపిస్తూ ఉంటాయి. 'పిల్లల చదువులు పెద్దల చావుకొచ్చింది' అని కూడా అనుకుంటుంటారు కొందరు. మరి ఇటువంటి చికాకులు లేకుండా పరీక్షలు సాఫీగా సాగి పిల్లలు మంచి మార్కులు సంపాదించాలంటే ఏంచేయాలో ఈ వారం తెలుసుకుందాం.**

పరీక్షల సమయంలో ఇటు పిల్లలు, అటు తల్లిదండ్రులు విపరీతమైన వత్తిడికి గురవుతారు. పిల్లలకు అన్నం తినిపించడం కోసం అష్టకష్టాలు పడుతుంటారు. కానీ ఆ సమయంలో మంచి పోషకాహారం తీసుకోవడం వల్ల చిన్నారులకు వత్తిడి తగ్గి చదువు మీద ఏకాగ్రత ఏర్పడుతుంది.

ఫిబ్రవరి, మార్చి నెలలు వచ్చాయంటే చాలు పిల్లలకు, తల్లిదండ్రులకు ఒక రకమైన బెంగ, ఆత్రుత, వత్తిడి, కంగారు పట్టుకుంటాయి. ఆ సమయంలో పరీక్షలే దానికి కారణం. తల్లిదండ్రుల ఊహలతో పాటు, ఎదుటివారి కంటే తనకే ఎక్కువ మార్కులు రావాలని పిల్లల్లో సహజంగానే ఉండే ధోరణి, దానికితోడు మన వ్యవస్థలో ఉన్న గ్రేడులు, పర్సెంటేజ్‌లు వారి ముందు ఒక మద్యమిశ్రమంగా కనిపిస్తుంది. దానితో ఏకాగ్రత లోపించడం, మానసికంగా కుంగిపోవడం, మనసులో ఒకలాంటి ఊగిసలాట వంటివి కనిపిస్తాయి. దీని ప్రభావం ఆహారం మీద కూడా పడుతుంది.

నిజమే పరీక్షల సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ వారికి చదువు విషయంలో సలహాలిస్తూ ఉత్సాహపరచాలి. అలాగే వారి తిండి, నిద్ర, మానసిక శారీరక శక్తి విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో వారికి ఇష్టమైన, బలవర్ధకమైన ఆహారపదార్థాలు పెట్టాలి. వారికి ఏం కావాలో తరచూ అడిగి తెలుసుకుని అందివ్వాలి. కానీ ఆ సమయంలో తిండి విషయంలో మనమే వారి మాటలు వింటాం. చదువుకుంటున్నారు కదా ఎందుకు కదిలించడమనుకుంటాం. రాత్రి భోజనానికి బదులు పాలో, బిస్కెట్లో తింటానంటే ఊరుకుంటాం.

పరీక్షల సమయంలో వారు చదువుకోవాలనే కోరుకుంటాం. వారిని ఇబ్బంది పెట్టాలని అనుకోం. కానీ ఆ సమయంలో వారు తిననని మారాం చేసినా ఏదోవిధంగా నచ్చజెప్పి ఇష్టమైన వాటిని తినిపిస్తే బాగా చదువుకోగలుగుతారు.

రాత్రిళ్లు ఎక్కువసార్లు టీ, కాఫీలు ఇవ్వడంవల్ల ఎక్కువ సేపు మేలుకుని ఉంటారు. పొద్దున ఆలస్యంగా లేస్తారు. దాంతో టిఫిన్ మానేస్తారు. ఇవన్నీ తెలిసినా వారడిగితే కాదనలేం. పిల్లలు సరైన భోజనం మానేసి ఏవో చిరుతిండ్లను ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఎక్కువసేపు చదువుకున్న తరువాత కాసేపు పాటలు వినడం, ఏదైనా ఆట ఆడడం వల్ల వత్తిడి, అలసట తగ్గి మెదడుకి ఉత్సాహంగా ఉంటుంది. ఇది చెప్పినంత సులువుగా ఉండదు. కానీ తల్లిదండ్రులు శాస్త్రీయ సాక్ష్యాలను, అనేక పరిశోధనల ఫలితాలను గమనించాలి. చదువు విషయంలో సమయపాలన ఉన్నట్లే తిండి విషయంలోనూ సమయపాలన పాటించాలి. పరీక్షల సమయంలో పిల్లలకు సరైన పోషకాహారాన్ని అందించాలి. ఆ సమయంలో సంపూర్ణ సంతులిత ఆహారం ఎంతో అవసరం. ఆ సమయంలో వారికిచ్చే ఆహారం వారి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆలోచనలు, సామర్థ్యం వంటి వాటి మీద తీవ్రమైన ప్రభావం చూపుతుంది. సరైన ఆహారం తీసుకోవడం వల్ల తెలివిగా తయారవడమే కాకుండా పరీక్షలను చక్కగా ఎదుర్కోగలుగుతారు.

**అయితే పరీక్షల సమయంలో పిల్లలు గొడవ చేయకుండా వారి ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని ఇచ్చే ఎటువంటి ఆహారాన్ని పెట్టాలి?**

ఒక వెయిట్‌లిఫ్టర్‌కు సంతులిత ఆహారం ఎంత అవసరమో పరీక్షలకు సిద్ధమయ్యే టీనేజ్ పిల్లలకు కూడా అంతే అవసరమంటారు ఆహార నిపుణులు. పాస్, ఫెయిల్ లేదా ఎ లేక సి గ్రేడులను సంతులిత ఆహారం నిర్ణయిస్తుందంటారు. పరీక్షలు దగ్గరపడుతున్న, జరుగుతున్న సమయంలో మీ పిల్లల మెదుడును ఉత్సాహపరిచేవిధంగా సమపాళ్లలో ఆహారాన్ని అందించాలి.

**ఎలా?**

వివిధ రకాల ఆహార పదార్థాలు మన శరీరంలో పలు ప్రభావాలను చూపిస్తాయి. కాబట్టి మెదడుకు సరైన ఆహారాన్ని సరైన మోతాదులో ఇవ్వాలి. దాని వల్ల ఎక్కువ సేపు ఉత్సాహంగా ఉండడమేకాక ఏకాగ్రతతో చదవగలుగుతారు. బద్ధకమనేది ఏర్పడదు. పరీక్షలకు సిద్ధమయ్యే ఏ వయసువారికైనా ఇది వర్తిస్తుంది. ఇటువంటి ఒత్తిడి సమయంలో కొంతమంది పిల్లలు మార్పును జీర్ణించుకోలేరు. అటువంటి వారి ఆహారవిషయంలో చిన్న చిన్న మార్పులు చేయాలి. లేదంటే ప్రతిరోజూ విటమిన్ మాత్ర వేయాలి.

ముందుగా ఒక ప్రణాళికను తయారు చేసుకోవడం వల్ల ఆ సమయంలో పిల్లలు జబ్బు పడకుండా చూసుకోవచ్చు. అయితే అదే పనిగా తినడం వల్ల వారు బద్ధకస్తులుగా తయారవుతారు. రోజుకు మూడుసార్లుగా ఎక్కువ మొత్తం తినకుండా 5 నుండి 6 సార్లు కొంచెం కొంచెం తీసుకోవడం మంచిది. దీనివల్ల రక్తంలోని చక్కెరపాళ్లు క్రమబద్ధమవుతాయి. పీచు పదార్థాలు ఎక్కువగా వున్న ఆహారం ఇవ్వాలి. దీనివల్ల పిల్లలు ఉత్సాహంగా ఉంటారు. అలాగే ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం ఇవ్వాలి. ఇంకా సీజనల్ పండ్లు కూడా ఎక్కువగా ఇవ్వాలి. పాలతో చేసిన పదార్థాలను తక్కువగా తీసుకోవడం మంచిది. ఒకవేళ పాలు తాగందే నిద్రపట్టకపోతే అందులో కొంచెం అల్లం కానీ, పసుపు కానీ వేసి తాగించాలి.

-సంధ్య



## ఇవి గుర్తుంచుకోండి...

- పరీక్షల సమయంలో కంగారు పడొద్దని చిన్నారులకు చెప్పాలి.
- ముందుగానే చదువుకుని పరీక్ష రోజు విరామం తీసుకోమని చెప్పాలి.
- తల్లిదండ్రులు వారికి టార్గెట్ పెట్టి వత్తిడి కలిగించొద్దు. దీని వల్ల వారు జబ్బు పడే అవకాశముంది.
- ప్రతిరోజూ తప్పనిసరిగా 6 నుండి 8 గంటలు నిద్రపోయేలా చూడాలి.
- ప్రతిరోజూ యోగా, మెడిటేషన్ చేయించడం మంచిది.



## ఎగిరే బల్లి

హాయ్ పిల్లలూ! ఎగిరే బల్లి ఒకటుంటుందని మీకు తెలుసా? తెలియదు కదా. కానీ ఈ మధ్యే చైనాలోని లియోనింగ్ ప్రావిన్స్‌లో జియాంగ్‌లాంగ్ అనే సున్నపు జాతి బల్లిని కనుగొన్నారు. దీని ప్రత్యేకత ఏంటంటే అది ఎగరగలదు. చర్మపు గుర్తులున్న ఓ అస్థిపంజరాన్ని పరీక్షించినప్పుడు ఈ విషయం తెలిసింది. అయితే అది బర్రేమియన్ యుగం నాటిదట. ఇంకో ముఖ్యమైన విషయమేంటంటే దానికి అతిపెద్ద పక్కటెముకలుంటాయి. అవి చూడ్డానికి చాలా వికారంగా ఉంటాయి. ఒక్కో పక్కా 8 ఎముకలుంటాయి. అవి ఒక పల్చని పొరకు జత చేసి ఎగరడానికి వీలుగా ఉంటాయి. ఈ రకమైన జాతి శిలాజం ఒకటి 15.5 (6.1 అంగుళాలు) సెంటీమీటర్ల పొడవుంది. అందులో తోక 9.5 సెంటీమీటర్ల పొడువుంటుంది. అయితే అది బల్లి పిల్ల అయ్యుంటుందని విశ్లేషకులు చెప్తున్నారు. పక్కటెముకలతో ఎగరగలిగే ఇతర జాతులున్నప్పటికీ ... ఇంతవరకు కనిపెట్టిన వాటిలో ఇదే ఎగిరే బల్లి శిలాజం.

## నేర్చుకుందాం



## సర్దగలరా?

హాయ్... ఇవాళ మీకో పజిల్ తెచ్చామర్రా. కింద అగ్గి పుల్లలతో ఒక బాక్సు, ఆ పక్కనే మరో నాలుగు అగ్గి పుల్లలు కనిపించాయా. ఆ నాలుగు పుల్లలను ఉపయోగించి బాక్సును రెండు సమ భాగాలుగా విడగొట్టాలి. సరేనా.



## చెప్పండి చూద్దాం

ఫ్రెండ్స్... పై బొమ్మలో చెట్టుకింద కొన్ని సింహాలు పడుకుని వున్నాయి కదా. అవే కాకుండా ఇంకొక సింహం కూడా అక్కడే దాక్కుని ఉంది అది ఎక్కడుందో చెప్పగలరా?

## పాడే ఇసుక

ప్రపంచంలోని కొన్ని బీచుల్లో, ఎడారుల్లో ఉన్న ఇసుకకు ఒక విలక్షణమైన గుణముంది. ఎవరైనా ఆ ఇసుక మీద నడుస్తున్నప్పుడు అది పాట పాడినట్లు అనిపిస్తుందట! ఈ విషయం శతాబ్దాల నుండి ప్రజలలో దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. శాస్త్రవేత్తలు కూడా దీనికి కారణమేంటో చెప్పలేకపోతున్నారు. అంతేగాక కొన్ని ప్రదేశాలలో నడుస్తున్నప్పుడు ఇసుక పక్షులు కిచకిచలాడుతున్నట్లు, గుసగుసలాడుతున్నట్లు, సింహం గర్జిస్తున్నట్లు శబ్దం చేస్తుంది. హవాయియన్ ద్వీపాలలోని కవాయి బీచ్‌లోని ఇసుకలో నడుస్తున్నప్పుడు కుక్క మొరిగిన శబ్దం వస్తుంది.



## చుక్కలు కలిపేద్దామా...

## చెప్పండి చూద్దాం

ఫ్రెండ్స్... కొన్ని వస్తువుల పేర్లు ఇస్తాం. అవి కింద వున్న బొమ్మలో ఏవేవి ఎక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టండి. ఆ వస్తువుల పేర్లేంటంటే.... పెన్సిల్, పుచ్చకాయ ముక్క, క్యారెట్, ఐస్‌క్రీం కోన్, షర్ట్ తగిలించుకునే హ్యాంగర్, లాంపు, గంట, పుస్తకం, పెయింట్ బ్రష్, చేప, కాలి బూటు.




హాయ్... చిన్నారులూ! ఇవాళ నీటి గుర్రానికి సంబంధించిన 4 ప్రశ్నలడుగుతాం. మీరు అవునో కాదో టకటకా చెప్పాలి. అయితే ఆ తర్వాత మా జవాబుతో మీ సమాధానాలను సరిచూసుకోండి. ఎన్ని సరిగ్గా వుంటే మీకు అన్ని మార్కులొచ్చినట్టు. 1.నీటి గుర్రాలు దాదాపు 50 సంవత్సరాలు జీవిస్తాయి. 2.నీటి గుర్రాలకు చెమట పట్టదు. 3. అవి ఆఫ్రికా, ఆసియా, ఐరోపా ఖండాలలో నివసిస్తాయి. 4. ఇవి ఎక్కువగా చేపలు, కప్పలు, పిల్ల మొసళ్లు తిని బతుకుతాయి. 5. అవి మానవుల కంటే వేగంగా పరిగెత్తుతాయి.

### జవాబులు

<u>మీకుతెలుసా? :</u> 1.అవును 2.అవును. ఎందుకంటే అవి నీటిలో గానీ, బురదలోగానీ ఉంటుంది. 3.కాదు. ఒప్పుడు నీటి గుర్రం ఆసియా, యూరప్‌లలో నివసించేది. ఇప్పుడు అది ఆఫ్రికాలో మాత్రమే జీవిస్తోంది. 4.కాదు. ఎక్కువగా గడ్డి తింటుంది. అప్పడప్పుడూ మాంసాహారం తీసుకుంటుంది. 5.అవును

<u>చెప్పండి చూద్దాం:</u> చెట్టు కొమ్మల మధ్యలో పులి ముఖం కనపడుతోంది.

<u>సర్దగలరా....:</u>



కథ

# మంత్రగత్తె

మూలం: **అలెగ్జాండర్ కుప్రిన్**

**నా** ఉద్యోగరీత్యా అన్ని విధాలా నిర్లక్ష్యానికి గురైన పెరిబ్రోడ్ అనే కుగ్రామంలో ఆరు మాసాల పర్యంతం ఉండవలసి వచ్చింది. అక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు, ఆలోచనలు నాకు వింతగా తోచాయి. వేటాడ్డం నాకొక హాబీ. యర్మోల అనే పేరు గల ఒక సేవకుడు దొరికాడు. ఒకనాడు తీవ్రమైన వడగాలి అకస్మాత్తుగా వీచింది. "ఇంత పెద్ద వడగాలి ఎక్కడి నుంచి వచ్చింది" అని యర్మోలను అడిగాను. దానికి సమాధానంగా "ఇప్పుడు ఒక మంత్రగత్తె జన్మించైనా ఉండవచ్చు. లేక ఒక మంత్రగత్తె అయినా తమాషా చేసి ఉండవచ్చు" అని చెప్పాడు. నాకు ఆశ్చర్యమేసింది. "ఇక్కడ ఎవరైనా మంత్రగత్తెలున్నారా?"

"ఐదు సంవత్సరాల క్రితం ఒక మంత్రగత్తె ఉండేది. ఇక్కడి యువకులు దాన్ని తరిమేశారు"

"ఎక్కడికి"

"ఎక్కడికేంటి? అడవిలోకి.

మూడు రోజుల తర్వాత నేను వేటకు బయలుదేరాను. చెట్లు, చేమలతో ఉన్న ఒక ప్రదేశాన్ని చేరాను. చెట్ల మధ్య ఒక గుడిసె కనిపించింది. వెళ్లి తలుపుతట్టాను. "ఎవరైనా ఉన్నారా?" పొయ్యి దగ్గర ఏదో కదిలినట్లు అనిపించింది. తిన్నగా లోనికి వెళ్లి చూశాను. ఒక ముదుసలి నేలపై కూర్చొని ఉంది. ఆమెకు సమస్కరించి "మీరేనా మనురిక్కా" అని అడిగాను.

"ఒకప్పుడు ఆ పేరుతో పిలిచేవారు. ఇప్పుడు ఆ పేరు గానీ, గుర్తింపు గానీ లేవు. నీకేమి కావాలి" అంటూ విసుక్కుంటూ అడిగింది.

"నేను దారితప్పి వచ్చాను. ఏమైనా తాగడానికి ఉంటే కొద్దిగా యిస్తారా?"

ఆమె తలెత్తి నాకేసి తీవ్రమైన చూపులతో చూస్తూ "ఇక్కడి నుండి దయచేసి వెంటనే వెళ్లిపోండి" అంటూ గదమాయించింది. అదే సమయంలో ఒక అమ్మాయి లోపల కొచ్చి ఏదో చెప్పబోయింది. అంతలో "ఈ పెద్ద మనిషి తనకు తోవ చూపమని అడుగుతున్నాడు" అని ముసలమ్మ అంది.

"నాకు ఇరినావో రోడ్డుకు దారి చూపవా? అంటూ ఆ అందాల రాశిని అడిగాను. ఆమె నన్ను బయటికి తీసుకెళ్లి దారిని గురించి వివరించింది. అసాధారణమైన అందంతో ఇరవై, ఇరవై ఐదు సంవత్సరాల మధ్య వయస్సుతో స్థానిక యువతుల చేష్టలకు భిన్నంగా ఉన్న ఆ యువతిని చూచి ఆశ్చర్యచకితుడనయ్యాను.

"ఇది అడవి ప్రాంతం. మీరు ఒంటరిగా ఉంటున్నారు. భయం లేదా? మీకు సహాయపడేవారు ఎవరూ లేరు"

"వారు మమ్మల్ని ఒంటరిగా వదిలి పెడితే అదే పదివేలు. సరే! మమ్మల్ని గురించి మీకు ఇదివరకే తెలుసా?"

"మిమ్మల్ని గురించి విన్నాను. మీరున్న చోటుకు ఏదో ఒక రోజు రావాలనుకున్నాను. ఎలాగో ఇప్పుడు కలిశాను. అయినా ప్రజలంటే మీకెందుకంత భయం. వారేమైనా మీకు అపకారం చేశారా?"

"వారి నుండి మాకు గడ్డురోజులు దాపురించాయి. నా అమ్మమ్మను వారు "మంత్రగత్తె, ఆడదెయ్యం, జైలు పక్షి" అంటూ పిలుస్తారు.

"వారు నిన్నెప్పుడైనా బలాత్కరించారా?"

"ఒక సారి ఒక సర్వేయర్ ప్రయత్నించాడు. అతనికి తగిన బుద్ధి చెప్పాను. నేను సంవత్సరానికొకసారి సబ్బు, ఉప్పు, తేయాకు అమ్మమ్మకు కొనడానికి అక్కడకు వెళ్తుంటాను"

"నేను ఏరోజైనా ఒకసారి వచ్చి కలుస్తాను"

"ఆమె నవ్వింది. ముఖంలో కొత్త కాంతి వచ్చింది. ఇదివరకటి కాఠిన్యం తొలిగిపోయింది. తల వంచుకుని ఇంటివైపు పోతూ ఆగి "నా పేరు అల్యోగా. ఇక్కడ నన్ను అలేశ్యా అని పిలుస్తారు" అని చెప్పింది.

తిరిగి నేను ఇంటికి చేరుకుంటూనే యర్మోల వచ్చాడు.

"నేను ఎక్కడకు వెళ్లానని తెలిస్తే ఆశ్చర్యపోతావు"

"ఏముంది మంత్రగత్తెను కలిశావు. నన్ను విడిచి వెళ్లిపోయినప్పుడే తెలిసిపోయింది. అది మహాపాతకం"

కొన్ని రోజుల తర్వాత అలేశ్యాను కలిసేందుకు బయలుదేరాను. ఆ ముసలామెకు చెక్కర, టీ పొడి ఇచ్చాను. ఆమె తీసుకుంది. అయినా ఆమెలో భయం పోలేదు.

"దేనికోసమో భయపడుతున్నట్లున్నావు?"

"పోలీసు అధికారి ఎప్పుడొచ్చినా భయపెడ్తుంటాడు. నిన్ను ఎప్పుడో ఒకరోజు జైల్లో పెడ్తాను. మంత్రగత్తెలాంటి నీకు <u>సఖిలిగ్</u> దీవికి పంపిస్తాను అని అంటుంటాడు. అది నిజమేనా?"

"అందులో కొంత నిజం ఉంది. అలాంటి పనికి శిక్ష ఉంది. అయినా అది అంత చెడ్డ విషయం కాదు"

అలేశ్యాను చూచి "అలేశ్యా నీవు కూడా భవిష్యత్తు గురించి చెప్పగలవా?"

"చెప్పగలను. కానీ డబ్బు కోసం కాదు. విను. ఒక ఆటిన్ రాణి నిన్ను ప్రేమిస్తూ ఉంది. ఆమె వివాహితా, అవివాహితా అనేది చెప్పలేను. ఆమె వెంట్రుకలు చాలా నలుపు. ఆ రాణికి చావు కంటే హీనమైన పరిస్థితి ఏర్పడుతుంది. నీ వల్ల ఆమె ఎంతో అవమానకరమైన పరిస్థితిని ఎదుర్కొంటుంది. అయినా, ఆమె వల్ల నీకు ఎలాంటి చెడు జరగదు"

భోంచేసిన తర్వాత ఇద్దరూ బయటికొచ్చారు.

"మీ అమ్మ మంత్రగత్తేనా?"

"లేదు. మంత్రగత్తె కాదు. ఆమెకు రోగాల నివారణకు కొన్ని దినుసుల పేర్లు తెలుసు. పంటినొప్పులను నయం చేస్తుంది. కారే రక్తాన్ని అరికడుతుంది. ఆమె చేయని పని అంటూ ఏదీ లేదు"

ఆమె అందం, నిజాయితీ, వంశపారంపర్యమైన మూఢవిశ్వాసాలు, పసిపిల్లల మనస్తత్వం నన్ను బాగా ఆకర్షించాయి.

"యవ్వనం, అందం, బలం ఉన్న నీవు ఏ పురుషుని ప్రేమలోనూ పడవా? నీవు పెళ్లి చేసుకోవా?"

"అంటే చర్చిలోనా?"

ఆమె కనురెప్పలు కిందికి వాలాయి. చిరునవ్వు నవ్వి "లేదు, మిత్రమా, మా కుటుంబంలో ఎవరూ చర్చిలో పెళ్లి చేసుకోలేదు. నా అమ్మ, అమ్మమ్మ ఎవరూ కూడా. మాలో ఎవరూ చర్చిలో ప్రవేశించలేదు"

"దానికంతా కారణం మంత్రవిద్యేనా!"

"అవును"

ఈ విషయంలో భేదాభిప్రాయం ఉన్నప్పటికీ మా ఇద్దరి మధ్య సంబంధం పెరుగుతూ వచ్చింది. ఒకనాడు సాయంత్రం వారి గుడిసెకు వెళ్లాను. వారిద్దరూ నిరాశా నిస్పృహలతో ఉండడం గమనించాను.

"ఏమైంది అలేశ్యా?"

అమ్మమ్మ జవాబు చెప్పింది. "పోలీసు

అధికారి రాత్రి వచ్చి 24 గంటలలో ఇక్కడి నుండి వెళ్లిపోవాలి. మళ్లీ కనిపించారంటే మీ పల్లెకు పంపిస్తాం" అని చెప్పాడు. "ఈ గుడిసె కూడా నాది కాదు, భూస్వామిది. ఆ పల్లెలోని యువకులకు మా మీద కోపం వచ్చినప్పుడు ఆయన ఈ గుడిసెలో ఉండమన్నాడు. నేను ఆ పోలీసు అధికారికి లంచంగా ఇరవైఐదు రూబుల్స్ ఇస్తానన్నాను. ఆయన పిచ్చిగా అరిచాడు. మీరే మాకు ఏదైనా సహాయం చేయాలి" అని వేడుకుంది. వాళ్లకు ధైర్యం చెప్పి వెళ్లిపోయాను. ఆ తర్వాత ఆ పోలీసు ఆఫీసర్‌ను కలిసి విందుతోపాటు విలువైన నా తుపాకీనిచ్చి విషయాన్ని వివరించాను "కొంత కాలం వరకు వారినేమీ అనను" అని వాగ్దానం చేసి వెళ్లిపోయాడు. ఆ విషయం అలేశ్యాకు తెలిసిపోయింది.

ఇంటికి చేరుకున్న తర్వాత తీవ్రమైన జ్వరంతో బాధపడ్డాను. ఆరోగ్యం కోలుకున్న తర్వాత మంత్రగత్తె గుడిసెకు వెళ్లాను. తలుపు తడుతూనే చేయివణికింది.

ఆమె కూడా నన్నుబడినట్లు గుర్తించాను. అకస్మాత్తుగా తన చేతులను నా మెడచుట్టూ ఆనించి నా పెదవులపై గట్టిగా ముద్దు పెట్టుకుంది. "ఇప్పుడు నేను దేన్నీ లెక్కచేయను. నీ ప్రేమలో నా సుఖాన్ని కూడా లెక్కచేయను"

"ఆటిన్ రాణి గురించి చెప్పాను జ్ఞాపకం ఉందా? ఆ ఆటిన్ రాణిని నేనే. అది చూపించిన దురదృష్టవంతురాలిని నేనే! మా ఇంటికి రావద్దని చెప్పాలనుకున్నాను. అప్పుడే నీవు జబ్బులో పడ్డావు!!

"నీవు చెప్పింది నిజమే. అగ్నికి వాయువు తోడైతే ఎలానో, ప్రేమకు ఎడబాటు కూడా అలానే"

నేను అనుకున్నది చెప్పాలా? వద్దా? అని ఆలోచనలో పడ్డాను. అయినా చెప్పక తప్పలేదు.

"అలేశ్యా ఇక్కడ నా ఉద్యోగ నియమం పూర్తయింది. నా పై అధికార్లు నన్ను వెంటనే పట్నం రమ్మన్నారు" చేతులు పక్కకు వేలాడేస్తూ "అది నీ ఉద్యోగం కాబట్టి తప్పకపోవాలి" అంది. బాధతో కూడిన ఒక చిన్న చిరునవ్వు ఆమె పెదాలపై కనిపించింది.

"నిన్ను నా భార్యగా స్వీకరించాలనుకున్నా. ఆ మాట నీ అమ్మమ్మతో చెప్పాలనుకున్నా"

"నీ భార్యగానా! అది అసాధ్యం. నీవు చదువుకున్న వాడివి. పైగా తెలివిగల వాడివి. నాకు చదువే లేదు. ఎలా ప్రవర్తించాలో తెలియదు"

"నీవు ఎంత తెలివిగలదానివో, ఎంత త్వరగా గ్రహిస్తావో నీకు తెలియదు. మనం ప్రపంచమంతా తిరుగుదాం. అన్నీ తెలుసుకుందాం"

"ఓ ప్రియతమా? నా హృదయాన్ని కదిలించావు. అయినా నేను వివాహం చేసుకోను. కావాలంటే నీతో వస్తాను. నాకు రెండు రోజులు సమయమివ్వు"

"అలేశ్యా చర్చి అంటే ఇంకా భయం ఉందా?" పెళ్లి చర్చిలో జరుగుతుంది గనుక.

ఆమె నా చేతులు పట్టుకుని "ఏదో ఒక రోజు నేను చర్చికి పోతే నీవు చాలా సంతోషిస్తావు గదూ!"

"నాకు ఆనందాన్ని కలిగిస్తుంది"

కొన్ని రోజుల తర్వాత నా స్నేహితుడు ఒక విభ్రాంతిని కలిగించిన వార్త వినిపించాడు. అలేశ్య తన భయాన్ని విడనాడి చర్చికి పోయింది. అక్కడి మహిళలంతా ఆమెను చుట్టుముట్టారు. శాపనార్థాలతో వారు రాళ్లు విసిరారు.

అదంతా వింటూనే నేను ఏమీ ఆలోచించకుండా ముసలమ్మ గుడిసె వైపు బయలుదేరి లోపల అడుగు పెట్టాను. అలేశ్య మంచంపై గోడవైపు తిరిగి దిండులో తల దూర్చి పడుకుని వుంది. నన్ను చూస్తూనే మనురిక్కా కోపంతో "చూడయ్యా! మమ్మల్నెక్కడికి తీసుకెళ్లావో" అంటూ తిట్ల వర్షం కురిపించింది.

అలేశ్య "ఎవరు" అనింది.

"నేనే అలేశ్యా ఇప్పుడే గ్రామం నుండి వచ్చాను"

"డాక్టరును పిలిపిస్తాను. నన్ను అనుమతించు"

"నేను డాక్టరును ఎప్పుడూ అనుమతించను. నిజంగా నేను బాగా భయపడిపోయాను. ఒక్క సారి నిన్ను చూడాలని వుంది"

నిదానంగా దిండుపైనుండి ఆమె తలను పైకి లేపాను. ఆమె కళ్లు అస్వభావికంగా మెరుస్తున్నాయి. పెదవులు వణుకుతున్నాయి. ముఖంపైన మెడపైన రక్తపు చారలు కనిపిస్తున్నాయి. నుదురుపైన, కళ్ల దిగువున నల్లటి మరకలు వున్నాయి. నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఏడుపుతో ఎక్కిళ్లు వచ్చాయి.

"బాధ పడకు. నువ్వు దగ్గర వుంటే నాకెంతో సంతోషంగా వుంది. ఈ ఆఖరు దినాల్లో సంతోషంగా వుందాం. తర్వాత విడిపోయినా అంత బాధ వుండదు"

"ఆఖరు రోజులా! మనం ఎందుకు విడిపోవాలి" ఆమె కళ్లు మూసుకుని కొద్ది క్షణాలు మాట్లాడలేదు.

"మనం విడిపోవాలి వన్యా. మేము ఇక్కడ వుండలేము"

"దేని గురించైనా భయపడుతున్నారా?"

"జనాన్ని ఎందుకు నేరానికి పురికొల్పుతారు? బహుశా నీకు తెలియక పోవచ్చు. గ్రామంలో వారిని నేను బెదిరించాను. అక్కడ ఏం జరిగినా మమ్మల్నే నిందిస్తారు. ఒక జంతువు చనిపోయినా, ఒక ఇంటికి నిప్పంటుకున్నా మమ్మల్నే నేరస్థులుగా చూస్తారు"

మనురిక్కా కలుగజేసుకుంటూ "అది నిజమే. వారు మూర్ఖులు. ఆనాడు నన్ను గ్రామం నుండి తరిమేశారు. ఎందుకు? తగాదాలో ఒక ఆడమనిషిని కోపంతో బెదిరించాను. ఆమె బిడ్డ చనిపోయింది. దాంతో నాకేమి సంబంధం. వారు నన్ను తిట్టి దాదాపు చంపేశారు. నాపై రాళ్లవర్షం కురిపించారు. నేను బిడ్డను ఎత్తుకొని పరుగెత్తుకొని వెళ్లాను. వారు క్రూరులు" అన్నది.

"నేనేం కావాలి అలేశ్యా. నన్ను గురించి ఆలోచించావా?" అలేశ్యా లేచి కూర్చొని , నా తలను తన చేతుల్లోకి తీసుకొని నా నుదురుపైన చెక్కిళ్ల పైన పలు మార్లు ముద్దు పెట్టుకుంది.

"మనిద్దరం కలిసి వుండడం వల్ల ఎన్నో బాధలు అనుభవించాల్సి వస్తుంది" ఆమె మళ్లీ తలపై దిండు పెట్టింది. "ఇంటికి వెళ్లు వన్యా" అన్నది.

"మనం ఇంకెప్పుడూ కలుసుకోబోమని చెప్తూ వీడ్కోలు చెప్తున్నావా?" నా తల దిమ్మెక్కింది. ఇక తప్పదనుకొని బయటికొచ్చాను. మనురిక్కా నాతోపాటు బయటికొచ్చింది. సూర్యుడు పశ్చిమాన ఇంకా వెలుగుతూవున్నాడు.

నేను గ్రామానికి చేరుకొనే సరికి ఉధృతంగా గాలి వాన మొదలైంది. బాగా అలసిపోయి బట్టలు మార్చుకోకుండానే మంచంపై వాలి పోయాను.

అప్పుడే యర్మోల వచ్చి "నీవు వెంటనే వెళ్లిపోవాలి", "ఎందుకు నీకేమైనా పిచ్చిపట్టిందా!"

"రాత్రి వడగళ్లు పడ్డాయి. పంటలు సగం వరకు నాశనమయ్యాయి. అందరూ అది మంత్రగత్తె పనే అని అంటున్నారు"

నాకు వెంటనే నిన్న చర్చిముందు అలేశ్యా కోపంతో మాట్లాడిన బెదిరింపు మాటలు స్ఫురణకు వచ్చాయి. "ఇప్పుడు మొత్తం గ్రామం అంతా లేచింది. ఉదయం నుండి వారంతా తాగుతున్నారు. ఇష్టమొచ్చినట్లు తిడ్తున్నారు. మంత్రగత్తెతో పాటు నిన్ను కూడా నిందిస్తున్నారు. ఎంత త్వరగా వెళ్లి పోతే అంత మంచిది"

"అలేశ్యా భయాలు నిజమయ్యాయి. వెంటనే వెళ్లి రాబోవు ప్రమాదాన్ని గురించి హెచ్చరించాలి" అని అనుకుంటూ పరుగెత్తుకెళ్లి గుడిసె చేరాను. గుడిసె కిటికీలు తెరచుకొని వున్నాయి. ఇల్లంతా ఖాళీగా వుంది. చిల్లర వస్తువులు చెల్లాచెదరై వున్నాయి. నా హృదయం ద్రవించింది. కళ్లవెంట నీళ్లు వచ్చాయి. బయటికి వెళ్లబోయే ముందు నా దృష్టి కిటికీ తలుపు చెక్కపై పడింది. ఒక కాంతి వంతమైన వస్తువు వేలాడుతూ కనిపించింది. అది పగడాల దండ. అలేశ్యాకు నాపై గల సుకుమారమైన ఔదార్యంతో కూడిన హృదయపూర్వక ప్రేమకు విలువైన జ్ఞాపక చిహ్నం.

స్వేచ్ఛానువాదం: **డి.ఆర్.కె.రెడ్డి.**

**గమనిక :- గతవారం ప్రచురించిన 'అమృత బిందువులు' కథా రచయిత్రి పేరును పొత్తూరి జయలక్ష్మిగా చదువుకోగలరు.**

చుట్టూ సముద్రం, మధ్యలో పచ్చని భూభాగం, అందులో ఎత్తైన కొండలు, లోయలు, దట్టమైన అడవులు, ఆ అడవుల్లో నివసించే ఆదివాసీలు, పూల వనాలు, ప్రపంచంతో ఎటువంటి సంబంధం లేని వారి అమాయకత్వం... ఇలా ఎన్నెన్నో అందాలు నయనానందకరంగా ఉంటాయి. ఇవి జీవితంలో మధురానుభూతిగా మిగిలిపోతాయి. మరి ఇన్ని అందాలను అండమాన్ నికోబార్ దీవులు తమలో దాచుకున్నాయి. అండమాన్ నికోబార్ దీవులను చూస్తే ఈ భూమిపై గల ప్రకృతి సౌందర్యమంతా అక్కడే ఉందేమో అనిపిస్తుంది. ఆ దీవుల చుట్టూ ఉరకలు వేసే సముద్రపు నీరు, ఆ కొండాకోనలు, కిలకిలారావాలు చేసే వివిధ జాతుల పక్షులు, వివిధ రకాల జంతువులు... భూతల స్వర్గాన్ని తలపిస్తాయి. కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతిని కలిగిస్తాయి. ఇప్పుడిప్పుడే నాగరికతను అలవరచుకుంటున్న అక్కడివారు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తారు.



# అండమాన్ అందాలు... నికోబార్ చందాలు...

కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం బర్మా నుండి ఇండోనేషియా వరకు పర్వతాలు వ్యాపించి ఉండేవి. కాలక్రమేణా ప్రకృతిలో సంభవించిన అనేక రకాల ప్రళయాలు, మార్పుల వల్ల అవి భూగర్భంలో కలిసిపోయాయి. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు సముద్రాల మట్టం తగ్గడంతో మధ్యమధ్యలో కొన్ని భూభాగాలు ఏర్పడి అవి దీవులుగా రూపుచెందాయి.

ఆ విధంగా ఏర్పడిన అండమాన్ నికోబార్ దీవులు బంగాళాఖాతంలో ఆగ్నేయదిశగా 710 కిలోమీటర్ల పొడవున వ్యాపించి ఉన్నాయి. అవి మొత్తం 319. అందులో 257 దీవులు అండమాన్‌కు చెందినవి. మిగిలిన 62 దీవులు నికోబార్‌కు చెందినవి. వీటిలో కొన్నిటిలో స్వల్ప జనాభా ఉంది. మిగిలిన వాటిలో అసలు జనసంచారమే ఉండదు.

**ప్రాచీన చరిత్ర**

అండమాన్ నికోబార్ దీవులకు అత్యంత ప్రాచీన చరిత్ర ఉంది. 1300 సంవత్సరాల క్రితం చైనాకు చెందిన ఇఛింగ్ అనే బౌద్ధ సన్యాసి ఈ దీవులను సందర్శించినట్లు చరిత్రకారులు చెప్తారు. ఇఛింగ్ బౌద్ధమతాన్ని ప్రచారం చేసే ఉద్దేశ్యంతో భారతదేశానికి బయలు దేరి ముందుగా అండమాన్ నికోబార్ దీవులను చేరాడు. అక్కడి నుంచి మనదేశానికి వచ్చాడు. ఆయన ఇక్కడి బౌద్ధ ఆరామాలలో అనేక ప్రసంగాలలో పాల్గొని, ఆ మతానికి సంబంధించిన అమూల్యమైన గ్రంథాలను సేకరించి తమ దేశానికి తిరిగి వెళ్లాడు. ఆయన ఈ విషయాలన్నీ గ్రంథస్తం చేశారు. ఆ దీవులలో నరభక్షకులు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు.

దీనిపైనే మార్కోపోలో కథనం మరోలా ఉంది. 1290వ సంవత్సరంలో ఈయన జలమార్గం ద్వారా చైనా వెళ్లినప్పుడు అండమాన్ దీవులను సందర్శించాడు. ఇఛింగ్ వీటిని "అండమాన్" దీవులుగా వ్యవహరించగా మార్కోపోలో "అంగమానియన్" దీవులు అన్నారు. ఆయనకు ఈ ద్వీపసముదాయం అంతగా నచ్చినట్లు లేదు. ఇక్కడి వాతావరణాన్ని, ఆదివాసీలను చాలా కఠినంగా విమర్శించాడు.

"అంగమానియన్ ప్రజలు అతి అనాగరికులు, క్రూరులు. కొత్తవారు కనిపిస్తే చాలు విషపూరిత బాణాలతో వేటాడి చంపి నరమాంసభక్షణ చేస్తారు" అని రాశాడు మార్కోపోలో. 1322వ సంవత్సరంలో ఈ దీవులను సందర్శించిన ఫ్రియర్ ఒడరిక్ అనే మరో ఐరోపా యాత్రికుడు కూడా మర్కోపోలో అభిప్రాయాలనే వ్యక్తం చేశాడు.

అండమాన్ నికోబార్ దీవులు ప్రకృతి సౌందర్యానికి నిలయాలు. దట్టమైన అడవులు, వాటిలో నివసించే రకరకాల జంతువులు, పక్షుల కిలకిలారావాలతో ఆ దీవులు సందడిగా ఉంటాయి.

ఉత్తర అండమాన్, మధ్య అండమాన్, బరాతాంగ్, రట్‌లాండ్, దక్షిణ అండమాన్ అనేవి అండమాన్ నికోబార్ దీవులలో పెద్దవి. మిగతావన్నీ చిన్న దీవులు. పోర్టుబ్లెయర్‌కు 114 కిలోమీటర్ల దూరంలో ఉన్న బారెన్ దీవిలో అగ్నిపర్వతం ఉంది. అండమాన్ దీవుల సముదాయంగా ఏర్పడిన ఈ దీవులు ఓడలలో ప్రయాణించే వారికి నయనానందకరంగా ఉంటాయి.

అండమాన్ నికోబార్ దీవులను గురించి కొన్ని కథనాలు ప్రారంభమయ్యాయి. బంగాళాఖాతంలో ప్రయాణించేసే వారి దగ్గర సముద్రపు దొంగలు దోచుకున్న ధనాన్ని, వస్తువులను ఇక్కడ దాచిపెడుతున్నారనే పుకార్లు వచ్చాయి. దీంతో ఈ దీవులలో ఎక్కడ తవ్వినా బంగారమే దొరుకుతుందనే వదంతులు కూడా ప్రజల్లో ప్రచారం జరిగాయి. అయితే ఈ ప్రచారానికి కారణం నికోలోకొంటి అనే యాత్రికుని రచనలు కొంత అని చెప్పవచ్చు. 1440వ సంవత్సరంలో అండమాన్ దీవులను సందర్శించిన ఈయన ఈ దీవులను అండమానియా అని వ్యవహరించాడు. అంతేకాదు వీటిని బంగారు దీవులు అనడంతో ఇక్కడికి యాత్రికుల సంఖ్య కూడా పెరిగింది.

ఆ సమయంలోనే మనదేశంలో ఈస్టిండియా వారి కార్యకలాపాలు ఎక్కువ కావడం సంభవించింది. బంగాళాఖాతంలో అనువైన స్థావరం కోసం బ్రిటీషువారు అన్వేషణ ప్రారంభించారు. అప్పుడు వారి దృష్టిని అండమాన్ నికోబార్ దీవులు ఆకర్షించాయి. బ్రిటీషువారు ఈ దీవులను క్షుణ్ణంగా సర్వేచేసి పోర్టుకార్నవాలిస్ అనే చోట ఓ సెటిల్‌మెంటును ప్రారంభించాడు. పోర్టుకార్నలిస్ కాలక్రమంలో పోర్టుబ్లెయర్‌గా మారింది.

తర్వాత దేశంలో స్వాతంత్ర్యోద్యమం ప్రారంభమైంది. సత్యాగ్రహాలు తిరుగుబాట్లు ముమ్మరమయ్యాయి. ఆ సమయంలో బ్రిటీషువారు తిరుగుబాటుదార్లకు ద్వీపాంతరవాసమే శిక్షగా విధించడం ప్రారంభమైంది. అప్పటి నుంచి స్వాతంత్ర్య యోధులను అండమాన్ ద్వీపానికి పంపి శిక్షించేవారు.

మొదట్లో 1857 తిరుగుబాటులో పాల్గొన్న కొంతమందిని అండమాన్ దీవులకు పంపారు. తర్వాత 1910 నుండి 1937 వరకు అనేక మంది స్వాతంత్ర్య యోధులను ఈ దీవులకు పంపడం బ్రిటీషు ప్రభుత్వ దమన నీతి.

**అండమాన్ దీవులు**

అండమాన్ దీవులలో కొన్నిటి పేర్లు తమాషాగా ఉంటాయి. వాటిలో కొన్నిటి పేర్లపై స్వాతంత్ర్యోద్యమం ప్రభావం కూడా ఉంది. హ్యారోస్, సెయిల్ వంటివారి పేర్లతో అలంకరించుకున్న దీవులేకాక "గిటార్ ఐలెండ్" అనే పేరుగల ఓ ద్వీపం కూడా ఉంది. ఆ ద్వీపం గిటార్ ఆకారంలో ఉండడం వల్ల ఆ పేరు వచ్చిందని చెప్తారు. కలకత్తా నుండి బయలుదేరి అండమాన్ దీవులకు వెళ్ళినప్పుడు మొదట కనిపించింది లాండ్‌ఫాల్ ద్వీపం. సన్నగా పొడవుగా ఉండేదాన్ని లాంగ్ ఐలెండ్ అనీ, కోడిగుడ్డు ఆకారంలో ఉండేదాన్ని ఎగ్ ఐలెండ్ అనీ వ్యవహరిస్తుంటారు. మరో దీవి పేరు సర్పదీవి. అది పాము ఆకారంలో ఉండడం వల్లో, లేక అక్కడ పాములు ఎక్కువగా ఉన్నాయో కానీ దానికి ఆ పేరు వచ్చింది. ప్రకృతిసౌందర్యంతో ఈ స్నేక్ ఐలెండ్ మెరిసిపోతుంది.

అండమాన్ దీవులలో వర్షపాతం అధికమే. ఇక్కడ సంవత్సరంలో 8 నెలలు వర్షాలు పడుతుంటాయి.

**నికోబార్ విషయాలు**

నికోబార్‌లో 62 ద్వీపాలుంటాయి. వీటిలో 12 ద్వీపాలలో మాత్రమే జనసంచారం ఉంటుంది. మిగతావి చాలా నిర్మానుష్యంగా ఉంటాయి. కార్నికోబార్ ద్వీపంలో అధిక జనాభా ఉంటుంది. కిన్యుక, కిన్మాయి, తమాలూ పెర్కా... వంటి పేర్లు గల 15 గ్రామాలు కార్‌నికోబార్‌లో ఉన్నాయి. ఈ ద్వీపంలోని ప్రజలు తెలివిగలవారే. కానీ మూఢాచారాలను బాగా నమ్ముతారు. మంత్రతంత్రాల పట్ల అధిక విశ్వాసాన్ని చూపిస్తారు. తర్వాత చౌరా ద్వీపంలో అధిక జనాభా ఉంది.

**జీవన విధానం**

నికోబార్ దీవులలో పండ్ల తోటలను అధికంగా పెంచుతారు. నిమ్మ, నారింజ, సపోటా, మామిడి వంటి మొక్కలను ఇతర ప్రాంతాల నుండి ఈ దీవుల్లో నాటారు. ఇప్పుడు ఆ పండ్ల తోటలు పుష్కలంగా ఉన్నాయి.

నికోబార్ దీవులలో కొన్ని వింత వింత వృక్షాలు పెరుగుతాయి. ఉదాహరణకు కిన్యాయా అనే పేరుగల చెట్టు. పెద్దపెద్ద ఆకులుండే ఈ చెట్టు గింజలు కోణాకారంలో ఉంటాయి. వీటిని ముట్టుకుంటే ఒక విధమైన మత్తు ఆవరిస్తుంది. ఈ కిన్యాయా కాయలు పగిలి గింజలు సముద్రంలో పడతాయి. ఆ గింజలను తినడం వల్ల అందులోని చేపలకు మత్తు వస్తుంది. దాంతో ఎక్కువ శ్రమ లేకుండా వారు చేపలను పట్టుకోవచ్చు. ఇక్కడ పూలమొక్కలను కూడా విస్తారంగా సాగు చేస్తారు. కొబ్బరి చెట్లను కూడా వేస్తారు. ఇక్కడి ప్రజల్లో కొంతమంది కొబ్బరి పంట మీదా, పోకచెక్కల మీదా ఆధారపడి జీవిస్తూ ఉంటారు.

నికోబార్ దీవులు పక్షులకు నిలయం. సహజంగా కొన్ని నీటి పక్షులు మాత్రమే ఇక్కడ ఉంటాయి. కానీ మార్చి నుండి నవంబర్ నెల వరకు అందమైన ఎన్నోరకాల పక్షులు ఈ దీవులకు వలస వచ్చి గూళ్ళు కట్టుకుంటాయి. వీటి కిలకిలారావాలతో సందర్శకులకు ఈ దీవులు నయనానందం, శ్రవణానందం కలుగజేస్తాయి.

అండమాన్ దీవులలో నివసించే ఆదివాసీలకు సంగీతమన్నా, నృత్యమన్నా ప్రాణం. వంద సంవత్సరాల క్రితం ఈ దీవులు వారి నృత్యగానాలతో చూడచక్కగా ఉండేవి. వాతావరణం, వ్యాధులు, అనారోగ్యం, అజ్ఞానం, అవిద్య వల్ల ఈనాడు వారి సంఖ్య బాగా తగ్గిపోయింది.

ఈ దీవులలో గ్రేట్ అండమాన్, జార్వాస్, సెంటినిలిస్, ఒంగేస్ వంటి తెగలవారు నివసిస్తూ ఉంటారు. గ్రేట్ అండమానిస్‌లో అకారోకా, అకాబీ, అకాబలే... మొదలైన పేర్లు గల పది ఉపతెగలు ఉన్నాయి.

అండమాన్ దీవులలోని ప్రజలను అలంకరణ ప్రియులుగానే చెప్పుకోవచ్చు. మొల చుట్టూ చిన్న ఆచ్ఛాదనం తప్ప మరే ఇతర దుస్తులు ధరించకపోయినా వివిధ రంగులతోనూ, బురద మట్టి చారికలతోనూ దేహాన్ని, మొహాన్ని అలంకరించుకుంటారు. మొహమ్మీద గాజుపెంకులతో గాట్లు పెట్టుకుని వాటిలో రంగులు పూసుకుంటారు. మొహమ్మీద ఎన్ని గాట్లు ఉంటే అంత అందంగా ఉన్నట్లు చెలామణి అవుతారు. జార్వాస్ ప్రజలు 300 మంది దాకా ఉన్నారు. వీరు ఇతరులను అంత త్వరగా నమ్మరు. వీరితో స్నేహం చేయాలని, వీరికి నాగరికత నేర్పాలని ప్రభుత్వాధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. సెంటివిల్స్ తెగవారు అందరికంటే తీవ్రంగా ఉంటారు. వీరు కొత్తవారికి దూరంగా ఉంటారు. వారు తమ తెగవారిని తప్ప మరొక తెగను నమ్మరు. ఈ తెగకు చెందినవారు సెంటినిలిస్ ద్వీపంలోని లోతట్టు అడవులలో ప్రస్తుతం సుమారు 150 మంది మాత్రమే ఉన్నారు. కొత్తవారు కనపడితే చాలు కోపంతో ఊగిపోతారు. మరోసారి ఆలోచించకుండా విషపు బాణాలను ఎక్కుపెడతారు. వీరిని మిగతా నాగరిక ప్రజలకు దగ్గర చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఒంగేస్ తెగవారు మిగిలిన అన్ని తెగలవారి కంటే స్నేహశీలులు. వీరి సంఖ్య చాలా తక్కువ. అయినా ఇతరులతో త్వరగా కలిసిపోతారు. అండమాన్ దీవుల ప్రజలు విల్లమ్ముల మీదా, వేట నైపుణ్యం మీదా ఆధారపడ్డప్పటికీ పోక చెట్ల పెంపకం, కొబ్బరి చెట్ల పెంపకం వంటి వాటి ద్వారా కూడా జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

అండమాన్ నికోబార్ దీవుల ప్రజలను అభివృద్ధి పరిచి నాగరికపు ప్రజలకు సన్నిహితం చేసేందుకు ప్రభుత్వంవారు అనేక ప్రణాళికలను అమలు చేస్తున్నారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి రుణాలు, సబ్సిడీలు వంటి పథకాలను ప్రవేశపెట్టారు. పశుపోషణ, చేపలను పట్టడం వంటి వృత్తులలో శిక్షణ ఇప్పిస్తున్నారు. అడవుల పెంపకానికి ప్రోత్సాహాన్నిస్తున్నారు. ఇవన్నీ ఫలిస్తే అండమాన్ నికోబార్ దీవులు మరింత నయనానందకరంగా దర్శనమిస్తాయి. కలకత్తా నుండి పోర్టుబ్లెయర్‌కు విమాన సర్వీసు ఉంది.

★



## కొత్త పుస్తకాలు

అక్షరాలు
పొనుగోటి నరసింహారావు
పేజీలు:86, వెల:-50/రూ
ప్రతులకు:
పొనుగోటి నరసింహారావు
దుబ్బాక
రామన్న పేట
నల్లగొండ-508113
మరియు
విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు



కథాపురి
చీరాల పట్టణ
రచయితల కథలు
వడలి రాధాకృష్ణ
వంగర పరమేశ్వరరావు
పేజీలు:146, వెల:-125/రూ
ప్రతులకు: వడలి శేషవరలక్ష్మి
ఐటిసి లిమిటెడ్
ఐ.ఎల్.టి.డి మేనేజర్ క్వార్టర్స్
చీరాల-523157



# చక్కని కరదీపిక

ఆధునిక భారతీయ రాజకీయాకాశంలో ధ్రువ తారగా వెలుగొందిన డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. సోషలిస్ట్ ఉద్యమ రథసారథి. ఆగస్ట్ విప్లవ వీరుడు. గోవా విముక్తి పోరాటానికి నాంది పలికిన యోధుడు. నేపాల్ రాణాల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన నాయకుడు. నల్లజాతుల పౌరహక్కుల కోసం సత్యాగ్రహం చేసి అమెరికాలో అరెస్టయిన నాయకుడు.

స్వాతంత్ర్య పోరాట కాలంలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌లకు సన్నిహితుడు. సోషలిస్టు ఉద్యమ నిర్మాణంలో ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాష్ నారాయణ్, యూసఫ్ మెహరాలీ, అరుణ అసఫాలీ, అచ్యుత్ పట్వర్ధన్‌లకు సన్నిహిత సహచరుడు.

లోహియా జీవితకాలంలో ఎవరైనా 'మార్చి 23 మీ జయంతి' అని గుర్తు చేస్తే మండిపడేవాడు. మార్చి 23 అనగానే మనందరికి గుర్తురావలసినది స్వాతంత్ర్య పోరాట వీరులైన విప్లవకారులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లని చెప్పేవాడు లోహియా. సోషలిస్టు సమాజ స్థాపనకు సాధనాలుగా - పార, జైలు, ఓటు ప్రజలు వినియోగించుకోవాలని లోహియా వివరించేవాడు. "ప్రపంచ ప్రభుత్వం- ప్రపంచ పార్లమెంటు, ప్రపంచ అభివృద్ధి బ్యాంక్ నిర్మించు కోవాలి" అనే లోహియా కమ్యూనిజాన్ని అంచనా వేయడంలో, అన్వయించడంలో పొరపాటు అవగాహనతో ఉన్నారనేది చరిత్ర చెప్పే సారం. మానవజాతి కళ్యాణానికి పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజం రెండూ పనికిరావని మానవ విలువలతో కూడిన సాంస్కృతికమైన, ప్రజాస్వామిక సోషలిజం అత్యావశ్యకమని ప్రబోధించిన వారు లోహియా. ఈ పుస్తకంలోని ప్రముఖ సోషలిస్టులైన మధు లిమాయే, ఎన్.జి.రంగా, రబీరే, నార్ల వెంకటేశ్వరరావు, సంజీవదేవ్, సురమౌళి, తుమ్మల చౌదరి, జస్టిస్ పి.ఎ. చౌదరి వ్యాసాలు లోహియా ఆలోచనల్ని, ఆశయాల్ని వివరిస్తాయి. లోహియా శతజయంతి సమితి లోహియాకి నివాళిగా ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఈ దేశంలో సోషలిస్టు ఉద్యమ చరిత్ర అధ్యయనశీలురకు, చరిత్ర విద్యార్థులకు ఈ గ్రంథం చక్కటి కరదీపిక.



రామ్ మనోహర్ లోహియా -ఆలోచనలు - అభిప్రాయాలు
సంకలనం : రావెల సోమయ్య
పేజీలు:95, వెల:-20/రూ ప్రతులకు: రావెల సోమయ్య
101-గోదా నిలయం - 555, మయూరి మార్గ్, బేగంపేట.
హైదరాబాద్ -500016. ఫోన్ 27760124 :
మొబైల్-9985810903

**- తంగిరాల చక్రవర్తి**

నిర్మల సూక్తులు
కవితా సంపుటి
పేజీలు:70,
వెల:-50/రూ :
ప్రతులకు:
శ్రీ కొండపల్లి నరసింహారావు
12-13-830/15,
తార్నాక, సికింద్రాబాద్.
ఫోన్ : 27014266

వాన
మద్దూరు శ్రీనివాసులు
పేజీలు:112,
వెల:-40/రూ .
ప్రతులకు:
ఎస్.వి. కృష్ణజయంతి
19-90,
పి&టి కాలనీ, దిల్‌షుక్ నగర్,
హైదరాబాద్-500060



# చూడచక్కని చెక్క కీబోర్డు

వావ్! ఏదో కొత్త ప్రపంచంలోకి అడుగెట్టినట్టుందే! చెక్క కంప్యూటర్, చెక్క కీ బోర్డ్, చెక్క మౌస్! చూస్తుంటేనే ముద్దుగా వున్నాయికదూ. మరి ఇప్పటి వరకు ఆ ప్లాస్టిక్ కంప్యూటర్లు, కీబోర్డులు, మౌస్‌లు చూసీ చూసీ... వాడీ వాడీ... బోరొచ్చేసింది. రకరకాల రంగుల్లో ముచ్చటగా మెరిసిపోతున్న చెక్క కంప్యూటర్‌ను వెంటనే... వెను వెంటనే కొనేసి వాడేయాలనిపిస్తోంది కదూ. మీరేకాదు! వీటిని చూచిన వారందరి మాటా ఇదే. వీటి సృష్టికర్తలు మాత్రం చైనా వారు. 2008 నుంచి ఇలాంటి వాటిని తయారుచేస్తున్నారు. అంతటితో ఆగకుండా విదేశీయులకూ వాటిని పరిచయం చేశారు. యూరోపియన్, అమెరికన్ మార్కెట్లలో వాటికి భలే గిరాకీ వుంది. హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయట.

# కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూ్డా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్

కలంస్నేహం, బాలనేస్తాలు, మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
**ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.**

పేరు: ఎన్. ఆరతి
చదువు: 6వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: వివేక వర్ధిని స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: కబడ్డీ, టెన్నికాయిట్, చెస్ ఆడడం
చిరునామా: ఎన్. ఆరతి
డాటరాఫ్ : ఎన్. పర్వయ్య, తాడ్వాయి, నిజామాబాద్.

పేరు: రాంబాబు
చదువు: 5వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: ప్రాథమిక హైస్కూల్
లక్ష్యం:ఎస్.ఐ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం
చిరునామా: రాంబాబు
సన్నాఫ్ : స్వామి, రాయిలాపూర్, రామాయం పేట, మెదక్.

పేరు: ఎన్.శ్వేత
చదువు: 5వ తరగతి
వయస్సు: 10 సం॥
స్కూలు: వివేక వర్ధిని స్కూల్
లక్ష్యం : పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: చెస్ ఆడడం, టీవీ చూడడం, పేపర్ చదవటం
చిరునామా: ఎన్.శ్వేత
డాటరాఫ్ : ఎన్. బాబు తాడ్వాయి, నిజామాబాద్.

పేరు: పి. ఉదయ్
చదువు: 6వ తరగతి
వయస్సు: 11 సం॥
స్కూలు: వివేకానంద పాఠశాల
లక్ష్యం: పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం, పేపర్ చదవటం
చిరునామా: పి. ఉదయ్
సన్నాఫ్ : పి.రాజలింగం, తాడ్వాయి, నిజామాబాద్.

పేరు: పి.రాధిక
చదువు: 8వ తరగతి
వయస్సు: 13సం॥
స్కూలు: ఎ.పి.ఎస్. డబ్ల్యూ. స్కూల్
లక్ష్యం : డాక్టర్ కావడం
హాబీలు: ఆటలు ఆడడం, టీవీ చూడడం, పేపర్ చదవడం
చిరునామా: పి.రాధిక
డాటరాఫ్ : పి.రాజలింగం, తాడ్వాయి, నిజామాబాద్.

పేరు: ఎ. వెంకట శివమూర్తి
చదువు: 1వ తరగతి
వయస్సు: 4సం॥
స్కూలు: లిటిల్ సిటిజన్ కాన్వెంట్
లక్ష్యం : పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం, టీవీ చూడడం
చిరునామా: ఎ. వెంకట శివమూర్తి
సన్నాఫ్ : ఎ. సంతోషినాగరాజు, ఫూల్‌బాగ్ కాలనీ, 4వ బిట్, విజయనగరం.